
భారతీయ శంఖారావం - 5



ధర్మ సందేహాలు

ధార్మిక సమాధానాలు

- పోలిశెట్టి బ్రదర్స్

రచయితలు మీతో...

"భారతదేశం"... ఆ పదం వింటేనే ఆనందంతో, ఉత్సాహంతో ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ప్రపంచానికి ఆధ్యాత్మిక కేంద్రం మనదేశం. సత్యానికీ, ధర్మానికీ పుట్టినిల్లు. సృష్టిని గురించీ, మానవతా దృష్టిని గురించీ మొట్టమొదట వివరించిన ద్రష్టల (మునీశ్వరుల) దేశం ఇది. భూమిపై ప్రకృతితో పాటూ వికసించిన హిందూ ధర్మం, సకల జ్ఞానాలకూ పునాది. ఈ మాటలు కేవలం మనం అనుకుంటున్నవి కావు. వివిధ దేశాలకు చెందిన విజ్ఞానులెందరో ఒకే గొంతుతో చెప్తున్నవి. ఆధ్యాత్మికం, ధ్యానం, యోగం, జపం, తపం అంటూ ప్రపంచ దేశాల మేధావులంతా మన దేశం వైపు పరుగెత్తుకొస్తున్నారు... "మన దేశపు అమృత తత్త్వంలో పాలుపంచుకుందామని! హిందూత్వంలో కలసి మోక్షం పొందాలని!!"

అయితే విదేశీయులు ఊహిస్తున్నంత ఆధ్యాత్మికత, ప్రస్తుతం మన దేశంలో కన్పించడం లేదు. ఆధ్యాత్మికత అంటే ఏమిటని ప్రశ్నించే దశకు వచ్చేశారు మనవాళ్ళు. ముసలికాలంలో "రామా! కృష్ణా" అనుకోవడమే ఆధ్యాత్మికత అనుకుంటున్నారు కొందరు. భక్తి, ఆధ్యాత్మికతలు ఓల్డ్ ఫ్యాషన్! అంటున్నారు కుర్రవాళ్ళు. "ఈ కంప్యూటర్ యుగంలో ఇంకా దేవుళ్ళు... దేవతలూ ఏమిటి? కాలంతో పోటీపడి డబ్బు సంపాదించడమే మనిషి లక్ష్యం" అంటున్నారెందరో! "దేశం... దేశం అంటూ ప్రాకులాడటం దండగ. దేశాల మధ్య ఎల్లలు ఎప్పుడో చెరిగిపోయాయి. అమెరికా వెళ్ళిపోవడం... నాలుగు చేతులా సంపాదించడం (అతనివి 2 చేతులు, అతని భార్యవి 2 చేతులు)... వీలుంటే అక్కడే సెటిలైపోయి, తమ పిల్లలకు గ్రీన్‌కార్డ్స్ సంపాదించడం... అదీ జీవితమంటే! అంతేగాని స్వదేశం, సంస్కృతి, చరిత్ర... వంకాయ... బెండకాయ అంటూ కాలం దండగ చేయకూడదు" అంటున్నారు అనేకమంది విద్యావంతులు. జన్మభూమి అనేది స్వర్గంకంటే గొప్పదని, వాళ్ళు చదివిన ఇంగ్లీషు చదువుల్లో ఎక్కడా లేదు మరి... వాళ్ళేం చేస్తారిక!

మన భరతభూమికి ఉన్నంత ఓర్పు, ప్రపంచంలో మరే భూమికీ లేదు. అందుకే ఈ భూమిని భారత"మాత" గా వర్ణించారు. ఈ భారత మాత, తాను జన్మనిచ్చిన వారికే కాదు... తన వద్దకు వలస వచ్చిన వారికీ, దొంగ దెబ్బలు తీసి ఆక్రమించుకున్న వారికీ, దోపిడీలు చేసిన వారికీ, వారి వెనుకనే వచ్చి తిష్ఠ వేసిన వారికీ, చివరకు తుచ్ఛులకూ, అయోగ్యులకూ, ఉన్మాదులకూ, మతోన్మాద దుర్మార్గ శక్తులకూ, తల్లిపాలు తాగి రొమ్ము గుద్దే కసాయిలకూ కూడా స్థానాన్ని కల్పించి ఆదుకుంది, ఆదుకుంటోంది.

ఎంతగా ఇలా కలుషితమయినా కూడా భరత భూమి ఏ నాటికీ గొప్పదే! కాకపోతే జనాభాలో కల్తీ ఎక్కువై పోయింది. ఎవరికి వారికి స్వార్థం పెరిగిపోయింది. ఉపన్యాసాలు దంచే సమయంలో తప్పించి, 'దేశము - సంస్కృతి' అనేవి ఎవరికీ పట్టని అంశాలుగా మారిపోయాయి. భారతీయ సంస్కృతి ఈ విధంగా నిరాదరణకు గురి అవుతోంది. ఇప్పుడున్న తరానికీ, వస్తున్న క్రొత్త తరానికీ కూడా - మన దేశ చరిత్రపై గానీ, సంస్కృతిపై గానీ ఎట్టి అవగాహనా లేదు. వేదాలు, ఇతిహాసాల పేర్లు వింటే - వింతగా, విచిత్రంగా చూస్తారు. వాటి గురించి తెలియని వారెందరో! అనంతమైన విజ్ఞానమూ, పాండిత్యమూ గల ప్రాచీన హిందూ ఋషీశ్వరుల వారసుల పరిస్థితి ఈ విధంగా ఇంత దీనంగా మారుతోంది.

మన దేశ చరిత్రను వ్రాసుకున్నది మనం కాదు. దాన్ని విదేశీయులు వ్రాసి పెట్టి వెళ్ళారు. వారి దయ, మన ప్రాప్తం అన్నట్టు వ్రాసి వెళ్ళారు వాళ్ళు. భారతదేశ ప్రాచీనతను తగ్గించే ప్రయత్నాలెన్నో వాళ్ళు చేశారు. రామాయణ, భారతాల్ని మన చరిత్రలోకి తీసుకోకుండా అవేవో కాకమ్మ కథలంటూ మాయ చెయ్యాలని చూశారు. (అయితే మహా భారతానికి చెందిన కొన్ని చారిత్రక ఆధారాలు ఇటీవల దొరకడం మనకు సంతోషదాయకం. కానీ లౌకికతత్వం అనే వంకతో దొంగనాటకాలాడుతున్న దుర్మార్గులు ఆ ఆధారాల్ని అధికారికంగా, బాహాటంగా, గర్వంగా ఒప్పుకోవడానికి ముందుకు రావడం లేదు. అదొక దురదృష్టం) మొత్తం మీద మన రామాయణ, భారతాల్ని పుక్కిట పురాణాలుగానే త్రొక్కి పట్టి వుంచారు. అవి ఎప్పుడో ఎక్కడో... అసలు జరిగాయో లేదోననే వెర్రిబాగుల వాళ్ళ సంఖ్య పెరుగుతోంది. ఒక ప్రక్క అవి జరగలేదని చెప్తూనే, వాటిలోని అనేక విషయాల్ని మాత్రం విమర్శిస్తూ కాలం గడుపుతుంటారు కొందరు. ఇలాంటి బుద్ధిలేని జీవులు మనలోనే వుండగా, ఇక పరాయి వాళ్ళ సంగతి వేరే చెప్పాలా? మొత్తం మీద ఏదిఏమయితే భారతీయ సంస్కృతిపై విమర్శలూ, దాడులూ అనేకం సాగుతూ వస్తున్నాయి. ఈ విషయంలో నాస్తికులు, హేతువాదుల ప్రవర్తన మరీ హేయంగా ఉంటోంది. హిందువుల మనోభావాలు దెబ్బతినే అంశాలపై విమర్శలు, ఛాలెంజ్‌లూ చేస్తూ బ్రతుకుతుంటారు వాళ్ళు. తీరాచూస్తే వారికి - ఇటు ధార్మిక విషయాలు గాని, అటు సైన్సు విషయాలు గాని పూర్తిగా తెలియవు. వీరి బ్రతుకంతా సందేహాల మయమే! ఏదీకూడా చూస్తేగాని నమ్మం అంటారు. 'తమ తల్లులు చెప్పిన వ్యక్తులు నిజంగా తమ తండ్రులా, కాదా? అని సందేహిస్తుంటారు వీళ్ళు. ఎందుకంటే వారు ఆ సంఘటనల్ని చూడలేకపోయారు కదామరి! ద్రౌపదికి ఐదుగురు భర్తలనే విషయం వీళ్ళ ప్రధాన విమర్శల్లో ఒకటి...

ఈ విషయంపై వీళ్ళు మాత్రమే కాదు. నేటి సినిమాలు, టి.వి.లు, పత్రికలూ కూడా వేళాకోళాలు చేస్తుంటాయి. అయితే ఈ విషయంలోని యథార్థం వీళ్ళలో ఏ ఒక్కరికీ తెలియదు. పాండవులు ఐదుగురూ విష్ణుమూర్తి అంశలనీ, ద్రౌపది లక్ష్మీదేవి అంశ అనీ, మహాభారతం పూర్తిగా చదివితే తెలుస్తుంది. ఆ విష్ణువే శ్రీకృష్ణుడుగా అవతరించినప్పుడు, లక్ష్మీదేవి ఆయనకు అష్టభార్యలుగా భువికి దిగివచ్చింది. ఎలా ఎంతమందిగా రూపుదాల్చి వచ్చినా, అది లక్ష్మీనారాయణులకే చెల్లింది. దైవిక అంశాలతో పోల్చుకోడానికి మానవ మాత్రులమైన మనం సరిపోము. దానిపై విమర్శలు చేయగల అర్హత కూడా మనకు లేదు. ఇదంతా తెలియని నాస్తికులు, హేతువాదులు, ఇతరితర మూర్ఖులూ మన పురాణాలకు సంబంధించిన ఎన్నో అంశాలను వెక్కిరిస్తూ వుంటారు. ఇతర మతస్థుల విషయాల్లోని లోటుపాట్ల గురించి నోరెత్తాలంటే మాత్రం వారికి మహాభయం. అక్కడికొచ్చేసరికి భయ భక్తులూ, మనో భావాలూ గుర్తుకొచ్చేస్తాయి వాళ్ళకి. సందర్భం వచ్చిందనిగాని... ఎవరినీ ఏమీ అడగమని కాదు. ఇతరుల సంగతి మనకు అనవసరం. ఎవరి నమ్మకాలు వాళ్ళవి. ఎవరిని ఎవరూ విమర్శించకూడదు. పరస్పరం గౌరవించుకుని జీవించడమే మర్యాద. మనోభావాలనేవి అందరికీ ఉంటాయని మాత్రం అందరూ తెలుసుకుంటే మంచిది.

మూర్ఖత్వపు విమర్శలు వింటూ, వికటంగా తీయబడిన సినిమాలు, టీ.వి. ప్రోగ్రాంలు చూస్తూ, పత్రికల్లో చెత్తరకం వ్యాసాలు చదువుతున్న ఈ కాలం పిల్లలకు మన సంస్కృతిలోని ఔన్నత్యం, ఎలా తెలిసి వస్తుంది? ఇక వాళ్ళు ఏవిధంగా బాగుపడతారు? ఈ దౌర్భాగ్యానికి ఒక చిన్న ఉదాహరణ : మొన్న ఒక టి.వి. ఛానల్ వారు నిర్వహించిన క్విజ్‌లో "సీతను ఎత్తుకెళ్ళింది దుర్యోధనుడని" చెప్పాడు ఒక కుర్రవాడు. ఇదీ మన భారతీయుల సాంస్కృతిక ప్రతిభ! ఆ అబ్బాయి తల్లిదండ్రులకే అసలు జవాబు తెలిసిఉండదు. ఇక ఆ కుర్రవాడేం చెపుతాడు పాపం! ఒకవేళ ఆ తల్లిదండ్రులకు ఏదయినా ఒకటీ అరా తెలిసినా కూడా, అది పిల్లలకు చెప్పే తీరిక వారికి లేదు. తీరికవున్నా కూడా... "వీటివల్ల పిల్లలకేం లాభం? ఏ కంప్యూటర్ క్లాసుకో పిల్లవాణ్ణి పంపించేస్తే... వాడో ఇంజనీరైపోతాడు" అనేది వారి భావన.

సంస్కృతిని గురించిన ఆలోచన మనవాళ్ళలో చాల తక్కువ. స్వార్థభక్తి మాత్రం చాలా ఎక్కువ. ఎవరి ఇంట్లో వారు పూజలూ, వ్రతాలూ చేసేస్తూ దేవుళ్ళను రకరకాల కోరికలు కోరేస్తుంటారు. తనూ, తన కుటుంబం మాత్రం చల్లగా ఉంటే చాలనుకునే మనస్తత్వం బాగా పెరిగిపోయింది. దేశము, సంస్కృతుల సంగతి వారికి అనవసరంగా కన్పిస్తోంది.

మన రామాయణ, భారత, భాగవతాల విషయాలు మన పెద్దలకే తెలియడం లేదు. ఇక కుర్రవాళ్ళకేం తెలుస్తాయి? ఎవడో తీసిన సినిమాగానీ, టి.వి. సీరియల్ గానీ చూడడం... అదే యథార్థమని భ్రమపడడం... విమర్శలు చేయడం... ఇలా వుంది వరస!

ఆధ్యాత్మికత అనే అంశం కేవలం ముసలివాళ్ళకు మాత్రమే సంబంధించినదిగా భావిస్తారు చాలామంది. రామాయణ, భారత, భాగవతాది గ్రంథాలు ముసలికాలంలో చదువుకోవలసిన పుస్తకాలని నేటి యువత అభిప్రాయం. అంతకంతకూ గ్రుడ్డిగా మారుతున్న నేటి మన విద్యావ్యవస్థయే ఈ దురవస్థకు కారణం. భారత దేశ ఆధ్యాత్మికతా రంగంలోని అనేక అంశాల వల్ల మానవులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా, స్థిరచిత్తులుగా తయారు కావచ్చని నేడు విదేశీ మేధావులంతా ఎలుగెత్తిచాటుతున్నారు. మన ఆధ్యాత్మిక అంశాల సాధనకు వయోభేదం లేదు. చిన్నతనం నుండీ అభ్యసించవలసిన ఆరోగ్య సాధనలే అవన్నీ! మన ఆధ్యాత్మిక గ్రంథాల పఠనం సంగతి కూడా ఇంతే! కేవలం అవన్నీ ముసలివాళ్ళ కోసమే కాదు. ముఖ్యంగా యువతరానికే మన ఆధ్యాత్మిక గ్రంథాల అవసరం ఎక్కువగా వుంది. వాటిలో ఎన్నో అంశాలు, జీవనాల మనుగడకు అమృత తుల్యమైనవి. సమాజానికి మార్గదర్శకమైనవి. సమాజాభివృద్ధికోసం, మానవత్వపు విలువలు వృద్ధిపరచుకోవడం కోసం ఏం చెయ్యాలన్నా హెచ్చుశాతం యువతరానికే సాధ్యం. అందువల్ల ఆధ్యాత్మిక అంశాల్ని అనుసరించవలసింది ముఖ్యంగా యువతరమే! కాళ్ళూ, కీళ్ళూ వంగిపోయిన ముసలివారి ఆధ్యాత్మికత వల్ల (సాధారణంగా చూస్తే) వారికొక్కరికే ఉపయోగం. కానీ యువతరం సంగతి అలాకాదు. ఆధ్యాత్మిక అంశాల్ని అనుసరించే యువత వల్ల లోక కళ్యాణం సిద్ధిస్తుంది.

మన పురాణేతిహాసాల్లోని కొన్ని అంశాల విషయంలో జనం చాలా తప్పుడు ఊహలతో ఉన్నారు. ఉదాహరణకు 'నరకాసుర వధ' విషయాన్ని చూద్దాం. నరకాసురుణ్ణి సత్యభామ చంపిందని అనుకునే అమాయకులు ఇప్పటికీ 99% ఉన్నారు. ఇదెంత విచిత్రమో చూడండి మరి! నరకాసురుణ్ణి చంపింది సాక్షాత్తూ శ్రీకృష్ణుడు. అయితే ఈ సంగతి భాగవతం చదివిన అతికొద్దిమందికే తెలుసు. మిగతావారు మాత్రం – "నరకాసురుడి దెబ్బకు కృష్ణుడు మూర్ఛ పోయాడనీ, అప్పుడు సత్యభామ విల్లు అందుకుని నరకాసురుణ్ణి చంపి, కృష్ణుణ్ణి కాపాడిందని!" అనుకుంటున్నారు. భాగవతంలో వున్న యథార్థ విషయం ఏమంటే... కృష్ణుడు, నరకాసురుడు యుద్ధం సాగిస్తుండగా, తానూ యుద్ధం చేస్తానని సత్యభామ కృష్ణుణ్ణి కోరుతుంది. భార్య కోరిక మన్నించి, కాస్సేపు నరకాసురునితో యుద్ధం చేయనిస్తాడు

కృష్ణుడు. తన భార్య వీరత్వం చూసి సంతోషిస్తాడు. అనంతరం సత్యభామను విశ్రాంతి తీసుకోమని చెప్పి, ఆయనే నరకాసురుణ్ణి వధిస్తాడు. ఇదీ అసలు గాథ. అయితే ఈనాడు ఇదెంత మందికి తెలుసు?... ఇలా వుంది మన పురాణ పరిజ్ఞానం. ఇటువంటి చిన్న విషయాలే తెలియని ఎంతోమంది, ధర్మ సూక్ష్మాలతో నిండిన పెద్ద పెద్ద పౌరాణిక అంశాలపై విమర్శలు చేస్తూ... "మనది పురుషాహంకార సమాజమనీ, అందువల్లనే ఒక రాజు తన భార్యను అమ్మేశాడనీ, మరో రాజు తన భార్యను అగ్ని ప్రవేశం చేయించాడనీ, వనవాసానికి పంపించాడనీ, మరో రాజు తన భార్యను జూదంలో పందెం కాశాడనీ... ఇవన్నీ కూడా ఎంతగానో ఖండించవలసిన అంశాలనీ" ఉపన్యాసాలు దంచేస్తుంటారు. ఆయా సంఘటనల వెనుకనున్న పరిస్థితులేమిటో, అందులో ఉన్న ధర్మ సూక్ష్మాలు ఎటువంటివో... అవేమీ తెలుసుకోకుండా - ధర్మపరులైన పురాణ పురుషుల్ని కించపరిచే విధంగా మాట్లాడుతుంటారు.

కాలగమనంలో కొంతమంది మన పురాణేతిహాసాల్లో అక్కడక్కడా కొన్ని మార్పులూ, చేర్పులూ చేస్తూ వచ్చారు. ఆ మార్పులూ చేర్పుల్లో కొన్ని హానికరం కాకపోయినా, కొన్ని మాత్రం హానికరంగానే పరిణమించాయి. (వాల్మీకి రామాయణంలో లేని 'లక్ష్మణరేఖ' అనే అంశం, తర్వాత కాలంలో రామాయణంలో చోటు చేసుకుంది. అయితే ఇది రామాయణ గాథకు హాని కలిగించే విషయం కాదు కనుక ఫరవాలేదు. రావణాసురుడు ఎత్తుకుపోయింది అసలు సీతను కాదని, మాయా సీతను మాత్రమే ఎత్తుకు వెళ్ళాడని మార్పు చేసి వ్రాశారు కొందరు... ఇలాంటి కొన్ని అంశాలు జనావళిని అయోమయానికి గురిచేస్తాయి. ఇటువంటి పరిస్థితివల్ల మన పురాణేతిహాసాల్లో ఏ అంశం యథార్థమో, ఏది కల్పితమో కూడా జనానికి తెలియడం లేదు. అసలు మూలగ్రంథాలు చూసి యథార్థాలు తెలుసుకునే ఆసక్తి, ఓపిక, సమయం నేడు ఎవరికీ లేవు. ఈ ఆధునిక సమాజంలో ఆరాటపు పరుగులే తప్ప, ఆద్యంతం తెలుసుకుందాం అనే ఆత్రం ఎవరికుంది? "ఈ చరిత్రలూ, ఈ పురాణాలూ అవీ ఎవరికి కావాలండీ! అవేమైనా కూడు పెడతాయా? గుడ్డనిస్తాయా?" అన్నాడొక హేతువాది. "మన దేశ స్వాతంత్ర్యం కోసం మనవాళ్ళు పోరాటం ఎందుకు చేశారని" అతన్ని ప్రశ్నించాం. "ఎందుకేముందీ? జననీ జన్మభూమిశ్చ... అని ఏదో అంటారు కదా! అయినా మన దేశాన్ని మనం కాపాడుకోవాలి కదా!" అన్నాడాయన. "ఎందుకు కాపాడుకోవాలి? పరాయివాడు పరిపాలిస్తే మాత్రం ఏమైంది? అప్పుడూ కూడూ, గుడ్డా బాగానే దొరికాయి కదా! నిజం చెప్పాలంటే ఇప్పటికంటే బాగా దొరికాయి. మరింకేమిటి?" అని అడిగాం. "ఆయన ముఖం కాస్త సీరియస్‌గా మారింది. "కూడూ గుడ్డా ఉంటే సరిపోతుందా? మన జాతీ, సంస్కృతీ, మన కట్టుబాట్లూ, ఆచార వ్యవహారాలూ... ఇంకా ఎన్నో

ఉంటాయి కదా! వాటన్నింటినీ కాపాడుకుంటేనే కదా! లేకుంటే మనం చరిత్ర హీనులయిపోతాం" అన్నాడు. "ఇంతకుముందే కదా, చరిత్రలూ అవీ ఎవరికి కావాలండీ అన్నారు. ఇప్పుడు చరిత్ర, సంస్కృతులు ఎందుకు కావలసివచ్చాయి?" అని అడిగాం. ఆయన ఏదో మూలుగుతూ మెల్లగా అక్కణ్ణుంచి తప్పుకున్నాడు. ఆయన చివరిలో చెప్పిందే అసలైన పాయింటు. అయినా కూడా అప్పుడే ఆయనెందుకో తడబడిపోయాడు. ఏ పాయింటూ లేనపుడు గట్టిగా దబాయించి మాట్లాడి, సరైనా పాయింటు చెప్పినప్పుడు మాత్రం ఖంగుతిని పారిపోయాడు. నేటి కుహనా మేధావుల అసలు సంగతి ఇలా వుంటుంది. ఒకసారి ఒక రైలు ప్రయాణంలో ఒక నాస్తికుడు తారసపడ్డాడు. చుట్టూ నలుగురిని పోగుచేసుకుని హిందూ మతాన్ని తెగ విమర్శించేస్తున్నాడు. అలా విమర్శిస్తూనే మాటల మధ్యలో "ప్రపంచ దేశాల్లో మాత్రం మన భారతదేశానికి మహ గొప్ప పేరుందండీ!" అన్నాడు. అప్పుడు మేము కల్పించుకుని, "ప్రపంచదేశాల్లో మన దేశానికి అంత గొప్ప పేరు ఎలా వచ్చిందంటారు?" అని అడిగాం. "ఎందుకంటే... మన దేశం కెపాసిటీ అలాంటిదీ..." అని పగలబడి నవ్వాడాయన. "అదే! ఆ కెపాసిటీ ఏమిటీ అని?" అని అడిగాం. "ఏమిటంటే... మనది శాంతికాముక దేశం... పవిత్ర దేశం, సత్యం ధర్మాలు ఆచరించి చూపిన దేశం, మహాత్ములు పుట్టిన ధేశం, చక్కని నదులూ, స్థలాలు నిండిన దేశం..." అంటూ చెప్పి ఆగాడు. మేము నవ్వి "మంచి విషయాలెన్నో మీ మనసుకు తెలుసు. అయితే అవన్నీ డైరెక్ట్‌గా ఒప్పుకోడానికి మీ మెదడు అంగీకరించడం లేదు. భారతదేశానికి వెన్నెముక హిందూధర్మం. మీరిప్పుడు చెప్పిన అంశాలన్నీ హిందూ ధర్మానికి చెందినవే! మనదేశానికి ఇంతగా పేరు వచ్చిందంటే దానికి కారణం... ఇక్కడ జరుగుతున్న మారణ హోమాలూ, మత మార్పిళ్ళూ కావు. కేవలం హిందూ ధర్మం వల్లనే మన దేశానికి అంతటి ఖ్యాతి వచ్చింది. ప్రపంచంలో ఒక పవిత్ర ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచింది" అని చెప్పడంతో ఆయన ఇక మారుమాట్లాడలేదు.

అయితే భారతదేశం గొప్పదనాన్ని గుర్తిస్తున్న ప్రముఖుల్లో విధేశీయుల సంఖ్యే హెచ్చుగా ఉంటోంది. మన సంస్కృతిని చూసి ఆనందపడగలిగే స్థిరత్వం మనలో ఉండడం లేదు. ఇతర దేశాలతో పోల్చుకుంటే భారత దేశంలో జాతీయాభిమానం అంతకంతకూ తగ్గిపోతోంది. ఎందుకూ పనికిరాని క్రికెట్ క్రీడా సమయాల్లో మాత్రం "ఇండియా... ఇండియా... ఐ లవ్ ఇండియా" అంటూ ఓ నాలుగు రోజులు గంతులు వేయడం మాత్రం చూస్తుంటాం. అంత మాత్రమే మన దేశభక్తి! విభజించి పాలించు అనే సూత్రాన్ని ఆంగ్లేయులు పాటించేవారని చెప్తారు. నేటి మన దేశ దుర్మార్గ పరిపాలకులు చేస్తున్నదేమిటి మరి? కులాల వారీగా, మతాల వారీగా, వర్గాల వారీగా ప్రజలను రెచ్చగొట్టి విడగొడుతూ – మత మార్పిళ్ళనూ, విదేశీయుల

వలసలనూ, ఆక్రమణలనూ ప్రోత్సహిస్తూ పరిపాలించడమే కదా! ఈ దుష్ట రాజకీయాల వల్ల పవిత్రమైన పాలకుండ వంటి మన దేశం, నానా రకాలూ కలిపిన ముష్టివాడి భోజనంలా తయారవుతోంది. జాతీయతా భావం ఎలా వస్తుందిక?

తన దేశ చరిత్రనూ, సంస్కృతినీ మరచిన జాతికి భవిష్యత్తు లేదనేది యథార్థం. మన సంస్కృతిని బ్రతికించుకోవాలనుకున్న జిజ్ఞాస ఇంకా కొంతమందిలో మిగిలివుంది కనుకనే, మన దేశం ఇంకా ఇలావుంది. అయితే వారికీ మన సంస్కృతిలోని కొన్ని అంశాలపై అవగాహన అవసరమౌతూ ఉంటుంది. ఎందుకంటే మన సంస్కృతిలోని ఆచార వ్యవహారాలు, జీవన విధానాలు, వేద పురాణేతిహాసాలూ మొదలైనవన్నీ ఎన్నో అంతరార్థాలతో ఉంటాయి. వాటిని వివరిస్తూ జనావళికి అవగాహన కలిగించ వలసిన బాధ్యత, ఆయా కాలాల్లోని మేధావులపై వుంది. అయితే మన సంస్కృతికి చెందిన అంశాలలోని విజ్ఞతనూ, విజ్ఞానాన్నీ విడమరచి చెప్పేవారు బహు అరుదుగా మాత్రమే ఉన్నారు. సందేహాలు లేని విధంగా సంస్కృతిని అర్థం చేసుకోవడం జాతియొక్క ప్రథమ కర్తవ్యం. మనలో అనేక మందికి కలుగుతున్న సందేహాలను తీర్చడానికి కొన్ని టి.వి. ఛానల్స్, కొన్ని పత్రికలూ, కొంతమంది ధర్మాచార్యులూ కృషి చేస్తూనే ఉన్నారు. అయినా కూడా సందేహాలు, వెల్లువలా వచ్చి పడుతూనే ఉన్నాయి. వాటిలో తరతరాలుగా వెంటాడుతున్న సందేహాలూ, అభాండాలూ కొన్ని ఉంటున్నాయి. అప్పుడప్పుడూ వాటికి ఎవరెవరో పెద్దలు తమకు తోచిన జవాబుల్ని ఇస్తూనే వున్నారు. అయినా కూడా ఆ సందేహాలూ, అభాండాలూ తరతరాలకు అలా వస్తూనే వున్నాయి. మేము ఈ దుర్దశను గమనించడం జరిగింది. పాఠకులు మాకు వ్రాసిన లెటర్స్‌లో ఉన్న ఉమ్మడి సందేహాలు కొన్నింటికి జవాబులనిస్తూ, ఈ చిరు గ్రంథాన్ని ప్రచురిస్తున్నాం. మా సమాధానాలు మీకు ఎలాంటి తృప్తిని కలిగించినదీ మాకు ఈ క్రింది చిరునామా ద్వారా తెలియజేయండి. మీరు వ్రాసే ఉత్తరాల వల్ల కలిగే ఉత్సాహమే, మాకు బలం. మీకు ఇంకా ఏవైనా సందేహాలు కలిగితే, మాతో ఈక్రింది ఫోను నంబర్ల ద్వారా సంప్రదించండి.

ఫోన్ నంబర్లు : **9989089156.**

9949674700

0884 - 2354849.

మా చిరునామా :

పోలిశెట్టి బ్రదర్స్,
17-3-6, గౌరీకోనేరు వద్ద,
పెద్దాపురం - 533 437.
తూర్పు గోదావరి జిల్లా (ఆంధ్రప్రదేశ్)

అందరికీ నమస్కారాలతో,
మీ
పోలిశెట్టి బ్రదర్స్.

విషయ సూచిక

అంశము	పేజీ సంఖ్య

ధర్మ సందేహాలు - ధార్మిక సమాధానాలు

1. బ్రహ్మదేవుడు ముసలివాడా ?

ప్రశ్న : బ్రహ్మదేవుడు, శ్రీ మహావిష్ణువు యొక్క కుమారుడని చెప్తారు కదా! మరి విష్ణువును యవ్వనంలో ఉన్నట్లుగానూ, బ్రహ్మను వార్ధక్యంలో ఉన్నట్లుగాను చిత్రీకరిస్తుంటారు, ఎందువల్ల ?

జవాబు : మహావిష్ణువు నాభి నుండి ఒక కమలం పుట్టిందనీ, ఆ కమలంలో బ్రహ్మదేవుడు ఉద్భవించాడనీ భాగవతం చెప్తుంది. ఈ విధంగా చూస్తే మహా విష్ణువుకు బ్రహ్మదేవుడు కుమారుడౌతాడు. బ్రహ్మదేవుడు మహా విష్ణువు కంటే, వయసులో చిన్నవాడు. కానీ బ్రహ్మదేవుని రూపును ముసలివానిగానూ, మహా విష్ణువును నవయవ్వనుడుగాను చూపించడం జరుగుతోంది. తండ్రి యవ్వనంతో వుండగా కుమారుడు ముసలివాడెలా అవుతాడని సందేహం కలగడం సహజం. ఈ సందేహానికి చక్కని సమాధానం వుంది. దానికో బ్రహ్మాండమైన అంతరార్థం కూడా వుంది. అదేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

ప్రస్తుతం వున్న విశ్వం (Universe) శ్రీ మహావిష్ణువు స్వరూపమే! అందువల్లనే ఆయనను "విశ్వరూపుడు" అన్నారు. మహాభారతంలో అర్జునుడు చేసిన విశ్వరూప వర్ణన, నేటి శాస్త్రవేత్తలు ఇచ్చిన విశ్వరూప వర్ణనకు అతి

దగ్గరగా వుంది. సైన్స్ దృష్ట్యా చూసినా కూడా, మొత్తం విశ్వం అంతా కలసి మహావిష్ణువు అని తెలుస్తోంది.

ఇక బ్రహ్మదేవుని సంగతి చూద్దాం. ఆధునిక సైన్స్ ప్రకారం - జీవరాశికి మూలం 'ప్రకృతి'. ఆ ప్రకృతినే బ్రహ్మదేవునిగా వ్యవహరించాయి మన పురాణాలు. విశ్వంలో మన భూగోళం ఏర్పడిన చాలా కాలం తర్వాత, భూమిపై ప్రకృతి పుట్టడానికి తగిన వాతావరణం ఏర్పడింది. ఆ వాతావరణం మెల్లమెల్లగా అన్ని వైపులకు సమానంగా వికసిస్తూ వ్యాపించింది. ఈ సందర్భంలో ఆ వాతావరణాన్ని, సౌష్టవంగా అన్ని వైపులా సమానంగా వికసించే 'కమలం' తో పోల్చారు ఋషులు. పైగా భూగోళమంతా నీటితో నిండివుండగా, వాతావరణం వ్యాపించడం జరిగింది. అందువల్ల కూడా వాతావరణాన్ని నీటినుండి ఉద్భవించే 'కమలం' గా పోల్చడం జరిగింది.

భూమిపై ఏర్పడిన వాతావరణానికి కారణం సూర్యుడు. విశ్వంలో ఒక భాగమైన సూర్యుణ్ణి, విష్ణుదేవుని అంశగా, విష్ణువుకు ప్రత్యక్షరూపంగా చెప్తున్నాయి పురాణాలు. విష్ణువు నుండి కమలం ఉద్భవించడం అంటే, సూర్యుని వల్ల భూమిపై వాతావరణం ఏర్పడడం అన్నమాట. ఆ అనుకూలమైన వాతావరణం నుండి ప్రకృతి ఉద్భవించింది. కమలం నుండి బ్రహ్మదేవుడు పుట్టడం అంటే అదే! ప్రకృతి నలుదిశలా వ్యాపించి ఉంటుంది. కనుక బ్రహ్మదేవునికి నాలుగు ముఖాలని చెప్తారు.

బ్రహ్మదేవుడు పుట్టిన తరువాత "నేనెవరిని? ఎలా పుట్టాను? నా కర్తవ్యం ఏమిటి?" అంటూ ఎంతో ఆలోచించాడు. ఎంత వెదికి చూసినా విశ్వరూపం యొక్క ఆది అంతాలేవీ ఆయనకు తెలియలేదట. దాంతో ఆయన యోగనిష్ఠలోకి వెళ్ళిపోయి, వంద 'దివ్య' సంవత్సరాలు గడిపాడట. అప్పుడు ఆయనకు శ్రీమహావిష్ణువు కనిపించి, "మొత్తం విశ్వానికి తానే మూలమనీ, తనలోనే అంతా ఇమిడివున్నదనీ చెప్పి, జీవసృష్టి చేయమంటూ" ఆదేశించాడట. విష్ణువు ఆదేశానుసారం జీవసృష్టి ప్రారంభించాడు బ్రహ్మదేవుడు.

భూమిపై ప్రకృతి (బ్రహ్మ) కళ్ళు తెరచి ఎంతకాలం గడిచింది?

ఆధునికుల లెక్కల ప్రకారం విశ్వంలో మన భూగోళం ఏర్పడి, ఇప్పటికి 4 వందలకోట్లు సంవత్సరాలకు పైగా అయింది. భూగోళంపై ప్రకృతి లేకుండా సుమారు 2 వందల కోట్ల సంవత్సరాలు గడిచాయట. ఆ తర్వాత ప్రకృతి పుట్టడం జరిగింది. ప్రకృతి పుట్టడం అంటే బ్రహ్మదేవుడు కళ్ళు తెరవడం అన్నమాట. అదే 'కల్పకం' ప్రారంభంగా లెక్క.

కల్పకం అంటే ఏమిటి?

ప్రకృతి ఉద్భవించిన నాటినుండి యుగాల లెక్క మొదలవుతుంది. కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం ... ఈ 4 యుగాలు కలసి ఒక మహాయుగంగా లెక్క. అటువంటి 1000 మహాయుగాలు కలిపితే ఒక 'కల్పకం' అవుతుంది. 432 కోట్ల మానవ సంవత్సరాలకు సమానమైన ఈ కల్పకకాలమే బ్రహ్మదేవుని ఆయుర్దాయంగా లెక్క.

బ్రహ్మ నిద్రించుట, లేచుట :- ఒక గ్రహంపై ప్రకృతి ఉద్భవించడంతో ప్రారంభమయిన కల్పకం, మళ్ళీ ప్రకృతి పూర్తిగా అంతరించడంతో ముగుస్తుంది. బ్రహ్మదేవుని నిద్రా ప్రారంభం అదే! కల్పక కాల నిద్ర అనంతరం సూర్యుని ఉష్ణోగ్రత మొ॥ అంశాలు సరిపడే మరో గ్రహంలో ప్రకృతి మళ్ళీ మొదలవుతుంది. అంటే బ్రహ్మదేవుడు నిద్రలేచినట్లు లెక్క.

బ్రహ్మవయసు - మహావిష్ణువు : "బ్రహ్మదేవుని వయసు మహావిష్ణువుకు ఒక కనురెప్పపాటుగా లెక్క అనీ, బ్రహ్మవయసు ప్రభావం విష్ణువుపై రవ్వంత కూడా పడదనీ" భాగవతం చెప్తోంది. ఈ విషయంలో చాలా అంతరార్థం వుంది. ప్రకృతి పుట్టినప్పటినుండి, అంతరించే వరకూ గల కాలం "బ్రహ్మదేవుని వయసు" అవుతుంది. అనంతమైన ఈ బ్రహ్మాండ విశ్వంలో ఎక్కడెక్కడో ప్రకృతి పుట్టడం, అంతరించడం అంటే... అది పెద్దగా చెప్పుకోవలసిన విషయమేమీ కాదు. ఎందువల్లనంటే విశ్వం (మహావిష్ణువు)

యొక్క కాలపరిమాణంలో "అక్కడక్కడా గ్రహాల్లో ఉండే ప్రకృతి కాలం బహుతక్కువ." అందువల్లనే అనంతమైన విశ్వానికి... అనగా మహా విష్ణువుకు 'ప్రకృతి కాలం అనబడే బ్రహ్మవయసు' కనురెప్పపాటుగా లెక్క అని చెప్పబడింది.

"విశ్వం" అనబడే మహావిష్ణువు యొక్క ఆయుర్దాయం ఇంతా అంతా అని చెప్పలేనంత అనంతమైనది. అందువల్ల విష్ణువు ఆయుర్థాయంతో పోలిస్తే, బ్రహ్మదేవుని ఆయువు ఒక లెక్కలోనిది కాదు. బ్రహ్మదేవుని జననం, బాల్యం, కౌమారం, యవ్వనం, వార్ధక్యం, పరిసమాప్తి... ఇవన్నీ జరిగిపోతున్నా, మహా విష్ణువు మాత్రం యవ్వనంలోనే వుంటాడు. ఈ విషయం ఇంకా బాగా అర్థం కావడానికి ఒక చిన్న ఉదాహరణ చెప్పుకుందాం. ఒక యువకునికి ఇరవై సంవత్సరాల వయసు వున్నప్పుడు ఒక దోమ 'గుడ్లు' పెట్టిందనుకోండి. ఆ దోమగుడ్డు నుండి లార్వా బయటకు రావడం, ఎదగడం, పెద్దదోమగా మార్పు చెందడం, చివరకు కొద్దిరోజులకు అది మరణించడం... అన్నీ జరిగిపోతాయి. ఆ మాత్రం సమయానికి, ఆ 20 ఏళ్ళ యువకుడిలో ఏమయినా మార్పువస్తుందా ?... ఏమీరాదు. ఆ విధంగా బ్రహ్మదేవుని వయసులో ఎన్ని మార్పులు జరిగినా, ఆయన జనకుడైన విష్ణువు మాత్రం యథాతథంగానే వుంటాడు. బ్రహ్మదేవుణ్ణి ముసలివాడుగా చూపడం, విష్ణువును యవ్వనంలో చూపడంలోని అంతరార్థం ఇదే!

అయితే బ్రహ్మదేవుణ్ణి మరీ పండుముసలిగా చూపడం ఒక విధంగా పొరబాటే ! ఎందుకంటే మొత్తం బ్రహ్మగారి వయసు 432 కోట్ల (మానవ) సంవత్సరాలు. మన కల్పక కాలంలో ఇంతవరకూ ఆయనకు గడిచిన కాలం కేవలం 197 కోట్ల సంవత్సరాలు మాత్రమే గడిచాయి. (పూర్తి వివరాలు మా "పురాణాల్లో సైన్స్" గ్రంథంలో చూడండి). అనగా బ్రహ్మగారికి నడి వయసుకూడా రాలేదింకా. ప్రస్తుతం ఆయన యవ్వనంలోనే వున్నాడు. కనుక ఆయనను వృద్ధుడిగా చూపడం సమంజసం కాదు. సుమారు మరో 150 కోట్లు సంవత్సరాల అనంతరం బ్రహ్మదేవుని ముసలిరూపులో చిత్రించవచ్చు.

అయితే ఇక్కడో చిన్నమాట...

విష్ణువుకు బ్రహ్మదేవుడు కుమారుడౌతాడని ఈ సందర్భంలో చెప్పడం జరిగింది. ఇది కేవలం ఒక పోలికతో చేసిన వర్ణన మాత్రమేనని మీరంతా గ్రహించగలగాలి. అనంత విశ్వరూపుడైన మహావిష్ణువుకు కొడుకేమిటి? కూతురేమిటి? నిజానికి అన్నీ తానే! విశ్వానికి మధ్య భాగంలో ఉన్న భూగోళంపై ప్రకృతి ఉద్భవించడాన్ని, విష్ణువు నాభి నుండి బ్రహ్మ ఉద్భవించినట్లుగా మహర్షులు చమత్కరించారు. విష్ణువు అనబడే మహాశక్తి నుండి ఉద్భవించిన కారణంగా ప్రకృతి అనబడే బ్రహ్మను - ఆయన కుమారునిగా వర్ణించడం జరిగింది. ఇలాంటివి కొన్ని మహర్షులు కల్పించిన వావివరుసలని గమనించండి. విశ్వవ్యాప్తమైన శక్తులకు వారు కొన్ని సందర్భాలలో ఈ విధమైన వావివరుసల్ని కల్పిస్తూ వర్ణించారు. జ్ఞానంతో వాటి అంతరార్థాల్ని గమనించగలగాలి మనం.

2. కల్పకము లెన్ని ?

ప్రశ్న : కల్పకం అనగా ఏమిటి ? కల్పకాలు యెన్ని ? ఇప్పుడు జరిగేది ఎన్నో కల్పకం ?

జవాబు : మన హిందూ కాలమానంలో పెద్ద పరిమాణం గలది "కల్పకం". దానినే "కల్పం" అని కూడా అంటాం.

కలియుగానికి **4,32,000** సంవత్సరాలు. కలియుగానికి రెండు రెట్లు ద్వాపరయుగం. కలియుగానికి మూడు రెట్లు త్రేతాయుగం. కలియుగానికి నాలుగు రెట్లు కృతయుగం. మొత్తం నాలుగు యుగాలూ కలిస్తే, ఒక మహాయుగం. అంటే 43,20,000 సంవత్సరాల కాలం అది. అలాంటి 1000 మహాయుగాలు ఒక "కల్పకం".

ఒక కల్పకంలో 14 మన్వంతరాలు వుంటాయి. ఒక్కొక్క మన్వంతరంలో 71 మహాయుగాలుంటాయి.

అది మన హిందూ కాలమానం.

మొత్తం కల్పకాలు యెన్ని వుంటాయో అనే విషయం ఖచ్చితంగా తెలియటం లేదు. మహా భారతంలో మార్కండేయ మహాముని - తాను యెన్నో కల్పకాలను చూశాననీ, ఇంకా ముందు ముందు అనేక కల్పకాలుంటాయనీ చెప్పాడే కానీ, యెన్ని కల్పకాలు అనే సంఖ్య మాత్రం చెప్పలేదు.

శ్రీమద్భాగవతంలో కూడా కల్పకం... మన్వంతరాలు... యుగాలు... కాలమానాల గూర్చి వివరించబడింది కానీ, కల్పకాల సంఖ్య గురించి సరిగా వివరణలేదు. అయితే ప్రస్తుతం జరిగేది రెండవ కల్పకం అనీ, ఈ కల్పకం పేరు "శ్వేత వరాహకల్పకం" అనీ, దీనికి ముందు "వరాహకల్పకం" జరిగిందనీ చెప్పబడింది.

"శ్రీ మదుత్తర భారత సారోద్ధారమనే" గ్రంథంలో మొత్తం కల్పకాలు ఏడు అని చెప్పబడింది. అవి 1. ఆదివరాహ కల్పకం. 2. వరాహకల్పకం. 3. శ్వేత వరాహకల్పకం. 4. పార్థివ కల్పకం. 5. సావిత్రి కల్పకం. 6. కూర్మకల్పకం. 7. బ్రహ్మకల్పకం.

వీటిలో "ఆది వరాహం", "వరాహ" కల్పకాలు గడచి "శ్వేత వరాహ కల్పకం" అనే మూడవకల్పకం జరుగుతూ వుందని ఆ గ్రంథ రచయిత వివరించారు.

ఈ శ్వేత వరాహ కల్పకంలో ఇంతవరకు.....

1. స్వాయంభువ. 2. స్వారోచిష. 3. ఉత్తమ. 4. తామస. 5. రైవత. 6. చాక్షుస అనే మన్వంతరాలు గడిచి ఏడవదైన వైవస్వత మన్వంతరం నడుస్తుంది. అందులో 27 మహాయుగాలు ముగిసి, 28వ మహాయుగంలోని కలియుగం జరుగుతూ వుందిప్పుడు.

ఇవీ మన గ్రంథాలలోని కొన్ని కల్పక విశేషాలు.

3. ప్రళయం ఎన్నాళ్ళకొకసారి వస్తుంది ?

ప్రశ్న : ఒకానొకసారి మహాప్రళయంలో సర్వజీవరాశీ, సకలలోకాలూ నశించి పోయాయి. ఒక్క మార్కండేయ మహాముని మాత్రమే మిగిలాడు. అప్పుడే వటపత్రంపై పడుకుని ఆడుకుంటున్న చంటిపాప రూపంలోని శ్రీమహావిష్ణువుని చూశాడు మార్కండేయుడు. అలాంటి ప్రళయం ఎంతకాలానికి ఒకసారి వస్తుంది ?

జవాబు : ఈ ప్రశ్న చాలా క్లిష్టమైనదే! దీన్ని గూర్చిన వివరాలు ఒక్కొక్క గ్రంథంలో ఒక్కొక్క విధంగా వున్నాయి.

మహాభారతంలో మార్కండేయుడు పాండవులతో చెప్పిన విషయాన్ని క్లుప్తంగా చూద్దాం.

"ఒకసారి ఈ సకల సృష్టి, తారలు, గ్రహాలూ మాయమయ్యాయి. కేవలం అంతా చీకటి. ఒంటరిగా మార్కండేయుడే మిగిలాడు. అలా తిరుగుతుండగా పసిబాలుడి రూపంలో శ్రీ మహావిష్ణువు వటపత్రశాయిగా కన్పించాడు. ఆ బాలుడి సలహాపై మార్కండేయుడు, బాలుడి నోటిద్వారా బాలుడి గర్భంలోకి వెళ్ళాడు. ఆశ్చర్యం... మాయమైన సర్వలోకాలూ, గ్రహ తారకలూ అక్కడే ఉన్నాయి. బయటకు వచ్చాక, ఆ బాలుడే చెప్పాడు. "సర్వాంతర్యామి అయిన విష్ణువు తానేననీ... తనలో ఐక్యమై వున్న సర్వలోకాలనూ మళ్ళీతానే సృష్టిస్తాననీ, మళ్ళీకొన్ని కోట్ల సంవత్సరాల అనంతరం ఆ లోకాలన్నింటినీ తనలో కలిపేసుకుంటాననీ..... అలా సృష్టించడం, లయం చేసుకోవటం తన లీల అని" చెప్పాడు.

"ప్రతీ కల్పాంతంలోనూ యీ విధంగా లోకాలన్నీ లయమవుతాయనీ, అలాంటి కల్పాంతాలు తాను చాలా చూశాననీ, ఇక ముందు ఇంకా అలాంటి కల్పాంతాలు అనేకం రావచ్చనీ" మార్కండేయ మహాముని చెప్పాడు. "చాలా కల్పాంతాలు" అని చెప్పాడేకానీ "ఎన్ని" అనే విషయం వివరంగా చెప్పలేదు.

కల్పకం అంటే ఏమిటి ? కల్పకం పరిమాణం ఎంత ? అనే విషయాలు శ్రీ మద్భాగవతంలో మనకు లభిస్తాయి.

ఒక కల్పక కాలం బ్రహ్మదేవుడికి ఒక పగటికాలం, మరొక కల్పకం ఆయనకు ఒక రాత్రి. ఆ విధంగా ఒక రాత్రి, ఒక పగలు కలిస్తే..... అదే బ్రహ్మ ఆయువు.

పైన మార్కండేయముని కథలో కల్పకాంతం అనడం చూస్తే, బ్రహ్మదేవుడి పగటి కాలం అయిన ఒక కల్పకం గడిచాక, రాత్రికాలంలో మార్కండేయుడు వటపత్రశాయిని చూశాడా ? అనిపిస్తుంది. అందుకే దాన్ని కల్పకాంతం అన్నాడు. కానీ బ్రహ్మదేవుని ఆయువు ముగిసినంతలో బ్రహ్మసృష్టి అంతా నశిస్తుందే గాని, మొత్తం గ్రహాలు, తారలు ఒకటిగా లయం కావటం జరగదు. ఎందుకంటే గ్రహతారకాదులు బ్రహ్మదేవుని సృష్టికాదు కదా !

వటపత్రశాయి చెప్పిన విధంగా సకల గ్రహతారలు వగైరాలు సృష్టించబడటం, మళ్ళీ కొన్ని కోట్ల సంవత్సరాల తరువాత అన్నీ ఏకం కావటం అనే విషయం - నేటి ఆధునిక సైన్సు చెప్పిన "బిగ్‌బ్యాంగ్" సూత్రాన్నే తెలియచేస్తుంది. (ఈ విషయం మా "పురాణాల్లో సైన్సు" అనే గ్రంథంలో వివరంగా వ్రాశాం, చూడండి).

"బిగ్‌బ్యాంగ్" అనే బ్రహ్మాండ విస్ఫోటనం... విశ్వముకుళితం అనేవి జరగాలంటే ఒక కల్పక కాలం కాదు. వేలాది కల్పకాల కాలం పడుతుంది. అంటే మనవారు చెప్పిన సూత్రం - ఆధునిక సైన్సు సూత్రం ఒకటే కానీ, కేవలం ఒకే కల్పక కాలంలో అవి జరగడం మాత్రం నిజం కాదు. ఎందుకంటే ఎన్నోకోట్ల సంవత్సరాల పూర్వం జరిగిన విశ్వవిస్ఫోటనం (అదే బ్రహ్మాండం బద్దలవటం) ఇంకా పూర్తి కాలేదు. బద్దలయిన బ్రహ్మాండం ముక్కలే గ్రహ తారలుగా విడిపోయి, నేటికీ ఇంకా విసరబడుతూనే వున్నాయి. ఆ విసురుడు పూర్తి కావటానికి మరెన్నో కోట్ల సంవత్సరాలు పడుతుంది. అప్పుడు తిరిగి విశ్వముకుళితం (అంటే అన్ని ముక్కలూ పరస్పరాకర్షణతో వెనుకకు లాగబడి, ఒకే ముద్దగా బ్రహ్మాండం తయారవటం) జరిగేందుకు మరెన్నో కోట్ల సంవత్సరాలు పడుతుంది. ఆ బ్రహ్మాండమే వట పత్రశాయి. సైన్సుకు సరిపోయే ఈ సూత్రం ప్రకారం ఒక్క వట పత్రశాయి దర్శనం అయ్యేకాలంలో కొన్ని వేల కల్పకాలు వుంటాయి.

4. రామాయణం యెప్పుడు జరిగింది ?

ప్రశ్న : మహాభారతం నేటికి 5,100 సంవత్సరాలకు పూర్వం జరిగిందనడానికి భారతంలో వివరించబడిన ఖగోళాంశాలు ఋజువుగా ఉన్నాయి. అలాగే మరి రామాయణ కాలానికి యేమయినా ఋజువులున్నాయా ?

జవాబు : శ్రీరామ కళ్యాణ వేళ చెప్పబడిన గ్రహతారల వివరం ఆధారంగా రామాయణ కాలాన్ని లెక్కవేయడం బహు కష్టం అవుతుంది.

ఎందుకంటే గ్రహ తారల స్థానాల ఆధారంగా కోట్లు లక్షల యేళ్ళ నాటి విషయాన్ని ఖచ్చితంగా చెప్పలేము. కారణం ఏమంటే ఖగోళాంశాలు సాధారణంగా విష్వచ్ఛలనం మూలంగా సుమారుగా ప్రతి 25,800 సం॥కు ఒకే మాదిరిగా వుంటాయి. అందువలన లక్షల యేళ్ళకు ముందు జరిగిన రామాయణ కాలాన్ని ఖగోళపరంగా చెప్పటం కష్టం.

కల్పకమానం ప్రకారం చెప్పడం రెండవ పద్ధతి. కానీ యిందులోనూ పండితుల మధ్య విభేదాలున్నాయి.

ఒక కల్పకంలో యెలా ఏయే గాథలు జరిగాయో, ప్రతికల్పకంలోనూ అవే గాథలు అలాగే జరుగుతాయని కొందరు విశ్వసించగా, ప్రతి మహాయుగంలోనూ అవే గాథలు మళ్ళీ మళ్ళీ జరుగుతాయని కొందరు వ్రాశారు. అంటే ప్రతి కల్పకంలో ప్రతి మహాయుగంలో అదే రామాయణం, అదే భారతం జరుగుతాయని వారి భావం. కానీ ఈ భావానికి ఋజువుల్లేవు.

మన హిందూ పురాణేతిహాసాలను వీలయినంత ఆధునికంగా నిరూపించాలని పాశ్చాత్యులెంత ప్రయత్నించారో, మరీ హెచ్చు ప్రాచీనమని నిరూపించేందుకు మన వారూ కొందరు కృషి చేశారు. అందులో భాగంగానే మన పురాణాల్లోని వరాహావతారం 10 కోట్ల 58 లక్షల సం॥ల పూర్వం జరిగిందని, నరసింహావతారం 8 కోట్లు 64 లక్షల సం॥ల పూర్వం జరిగిందనీ, మత్స్యావతారం యింకా ముందుదనీ... అలాగే హరిశ్చంద్రుడు, నలుడు... మొదలైన వారంతా కోట్లాది ఏళ్ళ పూర్వం వారనీ వ్రాశారు. అలాగే

రామాయణం కూడా 24వ మహాయుగంలోని త్రేతాయుగంలో జరిగిందనీ అంటే నేటికి 1,46,16,000 సం॥ల పూర్వం జరిగిందనీ వాదించే వారున్నారు. (ప్రస్తుతం జరిగేది 27వ మహాయుగం).

కానీ ఈ విషయాన్ని ఆధునిక సైన్సు ఒప్పుకోదు. ఈ విషయంలో మనం కూడా సైన్సు ప్రకారం ఆలోచించాలి. 1,46,16,000 ఏళ్ళ క్రితం మన దేశంలోనే కాదు. భూమధ్యరేఖకు ఇరువైపులా కొన్ని వేల మైళ్ళ ప్రాంతంలో మానవజాతి పుట్టనేలేదు. ఎందుకంటే ఆ కాలంలో ఆ ప్రాంతపు వాతావరణంలో మానవజాతి జీవించడం అసంభవం.

రామాయణం యే మహాయుగంలో జరిగిందనే విషయం రామాయణంలో వివరించబడలేదు. కేవలం "త్రేతాయుగం" అని మాత్రమే వ్రాయబడింది.

అందువల్ల రామాయణం ప్రస్తుతం జరిగే మన మహాయుగంలోని త్రేతాయుగానిదేనని మనం భావించకతప్పదు. అయితే దానికీ రెండు మూడయినా ఋజువులుండాలి కదా ! చూద్దాం.

రామాయణంలో ఆనాడు వున్న పరిస్థితులను పరిశీలించి, నేటిసైన్సు వివరణతో పోల్చి చూస్తే తెలిసిపోతుంది కదా ! మన మహాయుగంలోని త్రేతాయుగ చివరి భాగంలో రామాయణం జరిగిందని అనుకుంటే.....

నేటివరకు జరిగిన కలియుగం సంవత్సరాలు	=	5,109 (2007 సం॥కి)
ద్వాపరయుగం సంవత్సరాలు	=	8,64,000
త్రేతాయుగంలోని సంవత్సరాలు	=	1,30,000 (సుమారు)
మొత్తం సంవత్సరాలు	=	9,99,109

రామాయణం జరిగింది త్రేతాయుగం చివరికాలంలో కదా ! అంటే సుమారుగా నేటికి 10 లక్షల ఏళ్ళ క్రితం రామాయణం జరిగిందని చెప్పవచ్చు.

మన ఆధునిక చరిత్రకారులు భూమి పుట్టిన నాటినుండి భూమిపై జరిగిన మార్పులను పరిశీలించి వ్రాసిన జీవ పరిణామ పట్టిక ప్రకారం చూస్తే 10 లక్షల ఏళ్ళ నాటి కాలం "నవ్యజీవదశ"లో రెండవ భాగం అయిన "క్వాటర్నరీ" పిరియడ్ అని అర్థమవుతుంది. ఆ పిరియడ్‌లో జరిగిన జీవ పరిణామం గురించి ఆధునికులు చెప్పిన వివరాలను - రామాయణంలో చెప్పబడిన వివరాలతో పోల్చి చూద్దాం.

క్వాటర్నరీ	రామాయణం
1. సరీసృపాలు, భారీ శరీరాలు గల రాకాశి జీవాలు నశించి పోతున్నకాలం. (చివరగా ఏదోకొద్దిగా మిగిలినా మిగిలి ఉండవచ్చు)	1. జటాయువు, సంపాతి, సుపార్శ్వుడు మొదలైన భారీ శరీరంగల పక్షులు, సింహిక లాంటి భారీ జలచరాలు ఆ జాతికి చెందినవే. వాటి తరువాత రామాయణంలోనేకాదు. ఆ తరువాత ఏ పురాణేతి హాసాల్లోనూ అలాంటి జీవాలు లేవు.
2. అతిపెద్ద శరీరాలతో 4 దంతాల ఏనుగులు నివసించేవి.	2. ఇదే వర్ణన కలిగిన ఏనుగులు వాల్మీకి రామాయణంలో మనకు కనిపిస్తాయి.
3. అతి పెద్ద భయంకర మాంసాహార వృక్షాలకు చివరికాలం.	3. రాక్షసులుగా వర్ణించబడిన కబంధ, విరాధులు ఈ జాతి వృక్షాలేనని రామాయణంలో వారి రూప గుణ విశేషాల వల్ల తెలుస్తుంది.
4. ఇంకా అప్పటికి ప్రపంచంలో చాలాచోట్ల ఆధునిక జీవరాశి వ్యాప్తి కాలేదు.	4. భారతదేశంలో గంగానది దాటి దక్షిణ దిశకొస్తే అన్నీ అడవులే! జన జీవన ప్రదేశాలు లేవు. మానవజాతి లేదు. అంతా జంతువులు, రాక్షసులు (నరమాంస భక్షకులు) మాత్రమే వున్నారు. (మహాభారతకాలానికి ఇండియా అంతటా రాజ్యాలు విస్తరించాయి)
5. మానవులనే జీవాలు అవతరిస్తున్న ఆరంభ కాలం. (కోతి నుండే మానవుడు పుట్టాడు).	5. అదే వానరసైన్యం. రూపం చూస్తే కోతి, కానీ రెండుకాళ్ళపై నిలబడి నడుస్తారు. మాట్లాడుతారు. బట్టకట్టడం, ఆభరణాలు ఆయుధాలు వాడటం, రాజరికాలు, పరిపాలన, నియమాలు... అన్నీ మానవ లక్షణాలు. అదే కోతిజాతి-మానవజాతిగా మారుతున్న కాలం.

ఈ విధంగా ఆధునికులు చెప్పిన 10 లక్షల యేళ్ళనాటి వర్ణనలు - రామాయణ విశేషాలు చాలా దగ్గరగా సరిపోతున్నాయి. కనుక రామాయణం 10 లక్షల ఏళ్ళక్రితం, అనగా ప్రస్తుతపు మహాయుగపు త్రేతాయుగాంతంలోనే జరిగిందని చెప్పవచ్చు.

(ఈ విషయం మరింత వివరంగాను మరికొన్ని ఆధారాలతోను త్వరలో మాచే ముద్రించబడనున్న "రామాయణంలో సైన్సు" అనే గ్రంథంలో చూడవచ్చు)

5. శ్రీరాముడు మాట తప్పాడా ?

ప్రశ్న : పెళ్ళిలో "నాతి చరామి" అనే మంత్రం వరుడి చేత చెప్పిస్తారు. ఆనాడు రాముడు కూడా పెళ్ళినాడు ఆ మంత్రం చెప్పేవుంటాడు. కానీ సీతను అడవికి పంపేశాడు. భార్యను వదలను అని మాటయిచ్చి, వదిలేశాడు. మరి రామునికి ఒకేమాట, ఒకేబాణం అని యెలా ఒప్పుకోవాలి ?

జవాబు : నిజంగానే శ్రీరాముడిది ఒకేమాట, ఒకేబాణం. దీన్ని మనం ఒప్పుకునితీరాలి. శ్రీరాముడు పెళ్ళినాడు నాతిచరామి అని వాగ్దానం చేశాడు. జీవితాంతం ఆచరించాడు కూడా. నిజానికి..... భార్యను వదలడం, వదలకుండా వుండటం అంటే యేమిటి? బ్రతికినంతకాలం కట్టుకున్న భార్యతో గడిపితేనే, భార్యను విడువని వాడని అర్ధమా ? ధర్మార్థకామ మోక్షాలలో భార్యను విడువను అంటే బాహ్యంగా కాదు. మనసులోనుండి బయటకు పంపను అని అర్థం. శ్రీరాముడు ఆ విధంగానే జీవితాంతం తన మనసులోకి సీతను తప్ప, మరే స్త్రీనీ రానీయలేదు. సీతను యేనాడూ మనసునుండి విడువలేదు. రాజారామునిగా సీతను అడవికి పంపినా, ఆయన తన మనసునుండి సీతను పంపలేదు. అనుక్షణం సీతాస్మరణతోనే గడిపాడు.

అశ్వమేధయాగంలో కూడా స్వర్ణ సీతనే భార్యగా నిలుపుకున్నాడు. సీతానామస్మరణతోనే అవతారం చాలించాడు. మరి శ్రీరామునిది ఒకేమాట కాదంటారా ? మరి రావణాసురుడు చూడండి. మండోదరిని జీవితాంతం తనకోటలోనే వుంచి, రాజ భోగాలందించాడు. కానీ అతని మనసులో

యెందరో భార్యలు, వేశ్యలు... అంతేకాదు... మరో పరాయిస్త్రీని ఆశించి, ఆ విషయంలోనే నాశనం అయ్యాడు.

'సీతభర్త, మండోదరిభర్త' ఇద్దరూ పెళ్ళిలో "నాతిచరామి" అన్నవారే! ఇద్దరిలో ఎవరు మాట నిలుపుకున్నట్లు ?

ఈనాడు యెందరో పురుషులు దీర్ఘకాలం తమ భార్యలతో కాపురం చేస్తున్నారు. అనగా భార్యలను బాహ్యంగా వదలరు. కానీ చాటుగా యెందరో పరాయిస్త్రీలతో కులికేవారున్నారు. స్వంత భార్యను తరిమివేయనంత మాత్రాన, పెళ్ళిలో వాగ్దానాలను నిలుపుకున్నట్లా ?

కనుక... ఎవరు జీవితాంతం మనసులో ఒక్క భార్యను మాత్రమే నిలుపు కుంటారో, వారే ఒకే మాటపై నిలచినట్లు. "నాతిచరామి" అనే వాగ్దానానికి వాళ్ళు మాత్రమే న్యాయం చేకూర్చినట్లు అవుతుంది.

6. స్త్రీ లంటే శ్రీరాముడికి లోకువా ?

ప్రశ్న : నిప్పులాంటి సీతమ్మను అనుమానించి అగ్ని ప్రవేశం చేయమన్నాడు రాముడు. సీత పవిత్రత ఋజువైనా కూడా, ఎవడోయేదో అన్నాడని అడవులకు పంపేశాడు. రాముడికి ఆడదంటే అంత అలుసా ?

జవాబు : శ్రీరాముడికి స్త్రీ జాతి అంటే ఎంతో గౌరవం. రామ చరిత్రను సవ్యంగా అర్థం చేసుకుంటే, ఆ విషయం తెలిసి వస్తుంది. అయితే శ్రీరాముడు అనుభవించిన ఎన్నో కష్టాలకు ఒక విధంగా ఆడవాళ్ళే కారణం అయ్యారనీ, అయితే వారెవరి మీదా కూడా ఆయనకు ఏ మాత్రం కోపం లేదనీ, మీరు ఏనాడయినా గమనించారా? తెల్లవారితే రారాజు కానున్న శ్రీరాముని అడవులపాలు చేసింది ఇద్దరు ఆడవాళ్ళు (మందర, కైక). శ్రీరాముడు వారిపై కోపించలేదు. పైగా కోప్పడేవారిని శాంత పరిచాడు.

తాటకి దుర్మార్గ రాక్షసి అని తెలిసి కూడా, ఆమె స్త్రీ అని చంపటానికి వెనుకాడాడు. తాను అరణ్యవాసానికి వెళ్ళేటప్పుడు, సీతను పుట్టింటికి వెళ్ళి ఉండమన్నాడు. సీత అందుకు అంగీకరించక, రాముణ్ణి అనుసరించింది. అప్పుడు రాముడు లక్ష్మణుడితో ఏమన్నాడో తెలుసా ? "లక్ష్మణా! సీత చాలా సున్నితమైన స్త్రీ. మనం ఎన్ని కష్టాలు పడినా కూడా, ఆమెను మాత్రం జాగ్రత్తగా చూసుకోవాలి" అన్నాడు.

సీతమ్మను రావణుడు ఎత్తుకుపోయి, శ్రీరాముని ఇబ్బందిపాలు చేయటానికి కారణం ఒక ఆడదే! (శూర్పణఖ). శూర్పణఖను ప్రాణాలతో విడిచిపెట్టింది, ఆమె ఆడది కనుకనే! ఆమెను వెంటనే చంపి పారేస్తే, రాముడికి కష్టాలే రాకపోనుకదా ! అసలు శూర్పణఖతో వైరం తెచ్చుకున్నది, ఒక స్త్రీని అమితంగా శ్రీరాముడు ప్రేమించటం వల్లనే కదా ! ఆ స్త్రీయే సీత. ఏకపత్నీవ్రతుడైన శ్రీరాముడు సీతమ్మను విడువక, శూర్పణఖను కాదని విరోధం తెచ్చుకున్నాడు. ఈనాడు శ్రీరాముని వేలెత్తి చూపించే ఈ సమాజపు మానవులయితే, శూర్పణఖను శారీరకంగా సుఖపెట్టి పంపేస్తారు. లేదా సీతనే విడిచి పెట్టేస్తారు. కానీ శ్రీరాముడు కేవలం సీతమ్మ కోసం శూర్పణఖ, రావణాదులతో వైరం తెచ్చుకున్నాడు.

సీతమ్మకొక్కటే కష్టం. భర్తకు దూరంగా అశోకవనంలో బందీ అయింది. మరి శ్రీరాముడు... సీతకు దూరమై అడవుల్లో వెదుకుతూ ఎన్నో కష్టాల నెదుర్కొన్నాడు. రావణ, కుంభకర్ణాది రాక్షసులతో యుద్ధాలు చేశాడు.

ఇక సీత అగ్ని ప్రవేశం విషయానికి వద్దాం. సీత పవిత్రురాలని రామునికి తెలుసు. లోకంలో సీతపై పరిపూర్ణ నమ్మకం కలవాడు యెవరైనా వుంటే అది శ్రీరాముడే!

భవిష్యత్తులో ఆ చాకలివాని వలే ప్రజలెవరైనా సీతను అవమానించ వచ్చుననీ, అలాంటివారికి అనుమానాలు రాకుండా వుండాలంటే, సీత పునీత అని ఋజువు చేయాలని - శ్రీరాముడు ముందు చూపుతో ఆలోచించాడు.

అందుకే ఆయన సీతతో "సీతా! చెరలో వున్న భార్యను విడిపించటం భర్త బాధ్యత కనుక, నిన్ను విడిపించాను. అంతేగాని నీపై కోరికతో కాదు. ఇప్పుడిక నువ్వు స్వతంత్రురాలివి. ఎక్కడుండేదీ నువ్వే నిశ్చయించుకో! నీ అభీష్ట ప్రకారం జరుగుతుంది" అన్నాడు.

అయితే సీతమ్మపై శ్రీరామునికి ప్రేమలేదా ? 11 నెలలపాటు "హా సీతా ! ఎక్కడున్నావు ?" అని ఎందుకు విలపించాడు మరి ? "నా సీతను మీరు చూశారా? ఎక్కడుంది ?" అంటూ చెట్టు, పుట్ట, తరులు, గిరులు, ఏటిలోని నీరు, జంతువులు, పక్షులను అడుగుతూ పిచ్చిగా ఎందుకు తిరిగాడు? హనుమంతుడు చూపించిన సీత ఆభరణాల్ని చూసినప్పుడు, చూడామణిని చూసినప్పుడు ఎందుకు ఏడ్చాడు? ఇంద్రజిత్ మాయా సీతను చంపేసినపుడు, ఎందుకు కుమిలి పోయాడు? అంటే సీతపై రామునికి అమిత ప్రేమవుంది. ప్రేమతోనే ఆమెను విడిపించాడు. కేవలం బాధ్యత కోసమే కాదు. అయితే భవిష్యత్తులో జనావళి ప్రవర్తనను శంకించి, ఆయన సీతతో అలా అన్నాడు.

శ్రీరాముని ఉద్దేశం నెరవేరింది. ఆయన మాటలకు సీత చాలా బాధపడి, తన బ్రతుకే దండగ అనుకుంది. చితిపేర్చించుకుంది. అది చూసి అక్కడ వున్న వారంతా భయంతో, బాధతో చలించిపోయినా - శ్రీరాముడు మాత్రం తొణకలేదు. కారణం ? అక్కడవున్న అందరిలో సీతమ్మపై పూర్తి విశ్వాసంగలవాడు ఆయనొక్కడే! పరమ పవిత్ర అయిన సీతను అగ్నిదహించలేదనీ, నీరు ముంచలేదనీ, గాలి కదపలేదనీ శ్రీరాముడికి తెలుసు. అందుకే ధైర్యంగా వున్నాడు.

తనకు కీడు చేసిన కైక, మందర, శూర్పణఖాది స్త్రీలనే దయదలచి విడిచిన కారుణ్యమూర్తి మదిలో, సీతపై కరుణ వుండదా! ఎదురుగా ఒక స్త్రీ సజీవ దహనం అవుతుంటే వూరుకుంటాడా ఆయన? సీతలోని గొప్పదనం తెలిసిన వాడు కనుకనే, అందరి అనుమానాలూ తీర్చేందుకే ఆమె చేసే అగ్ని ప్రవేశానికి అభ్యంతరం చెప్పలేదు. ఆమె తప్పక తిరిగి వస్తుందని ప్రగాఢ

నమ్మకం ఆయనకు. ఒకవేళ ఆ సమయంలో శ్రీరాముడు భయపడితేనే ఆయనకు సీతపై అనుమానం వున్నట్లు అవుతుంది. ఎందుకంటే సీత దహించబడితే ఆమెలో కల్మషం వున్నట్లు అవుతుంది. ఆమెలో కల్మషం వున్నట్లు అనుమానిస్తే, ఆమె చనిపోతుందేమోనని ఆయనా చలించేవాడే కదా !

ఆ విధంగా అందరి ముందూ సీత నిష్కళంకిత అని ఋజువు చేశాడు.

అయినా దుర్మార్గులు అనుమానించక మానరు కదా ! అందుకే ఆ 'చాకలి' వంటివారు దుర్భాషలాడారు. ఆ విషయం దర్బారుకు చేరింది.

ఈరోజుల్లో ఒక నేరం జరిగితే ప్రభుత్వానికి రిపోర్టు ఇవ్వనిదే యెవరూ పట్టించుకోరు. ఒక్కొక్కసారి రిపోర్టు ఇచ్చినా ప్రయోజనం వుండదు. కోర్టుకెళ్ళినా అక్కడ కూడా ధర్మం గెలుస్తుందనే నమ్మకం లేదు. ధనబలం, అధికారబలం వుంటే తీర్పు అన్యాయం వైపే వుండవచ్చు.

కాని అది రామరాజ్యం. అధర్మానికి తావులేదు. అందుకే నేరుగా దర్బారుకు వచ్చి, సీతపై నేరం మోపకపోయినా, రాజుగారు ఆ అభియోగాన్ని లెక్కలోకి తీసుకున్నారు. ఆ విధంగా .... శ్రీరాముడే జడ్జి. ఆ దర్బారే కోర్టు. అభియోగం చేసిన వాడు చాకలి. (అతను నేరుగా దర్బారుకు రాలేదు. నగరం మధ్యలోనే అభియోగం చేశాడు). ముద్దాయి సీత.

ఇప్పుడు సీత తాను నిర్దోషిగా నిరూపించుకోవాలి. కానీ యెలా నిరూపించుకుంటుంది ? ఇలా ఒక్కొక్కరూ నిందిస్తుంటే ఆమె ప్రతిసారీ అగ్ని ప్రవేశం చేస్తుందా ? అది అసంభవం. అసహజం. లంకలో అగ్ని ప్రవేశం చేసి, శుచినని నిరూపించింది సీత. అయితే ఆ దృశ్యాన్ని చూసినవారు రాముడు, ఆయన సన్నిహితులు, పరివారం. అందరూ శ్రీరాముని మనుషులే! వాళ్ళ సాక్ష్యాలు చెల్లే అవకాశాలు లేవు. ఎప్పుడో ఎక్కడో, కొంతమంది ముందు జరిగిన అగ్నిప్రవేశ సంఘటనతో, ఈనాడు ఇక్కడి ప్రజలను నమ్మించడం అసాధ్యమని శ్రీరామునికి తెలుసు. ఆ విధంగా సీత నిరపరాధి అని

నిరూపించబడే దారి లేకుండా పోయింది. సీత నిజానికి నిర్దోషి అని తెలిసినా కూడా చక్రవర్తిగా, న్యాయాధికారిగా శ్రీరాముడు ఆమెకు శిక్ష విధించవలసి వచ్చింది. నిరపరాధిగా నిరూపణలేని స్త్రీ, అయోధ్యకు రాణిగా వుండరాదు. తప్పని సరియై ఆమెకు అరణ్యవాసం విధించాడు శ్రీరాముడు.

"రాజా రాముడు"గా సీతమ్మకు శిక్ష వేశాడు. "సీతారాముడు"గా తనకూ శిక్ష వేసుకున్నాడు. ఆమె యే సుఖాలు కోల్పోయిందో, తను కూడా ఆ సుఖాలను త్యజించాడు. బ్రహ్మచర్యం స్వీకరించాడు. రాజభోగాలు విడిచాడు. తిండి కూడా పళ్ళు, కందమూలాలే! శయనించేది కటిక నేలమీదే! ధరించేది సాధారణ వస్త్రాలే! సరదాలు, సరాగాలు లేవు. కేవలం రాజకార్యాల నిర్వహణా బాధ్యతలకే హాజరయ్యేవాడు. సీతనే తలచుకుంటూ నైరాశ్యంలో బ్రతికాడు. ఏ సౌకర్యం దొరకని అడవిలో బాధపడటం కంటే అన్నీవున్న అంతఃపురంలో అన్ని సౌకర్యాలనూ విడచి బ్రతకటం కష్టం కాదా? సీతమ్మ చివరి వరకూ రాముని మనసులోనే వుంది. ఈ సందర్భంలో శ్రీరాముడు తన చేతలద్వారా మానవులకు రెండు సందేశాలిచ్చాడు. (1) న్యాయ పీఠంపై వున్న వ్యక్తి తీర్పుయిచ్చేటప్పుడు తన, పర భేదం చూపరాదు. చట్టానికి కట్టుబడాలి. (2) సహధర్మచారిణిని ప్రాణ సమంగా భావించి జీవించాలి.

(ఈనాడు న్యాయస్థానాల్లో అనేక తీర్పులు అధర్మంగా వెలువడు తున్నాయి. తమపక్షం వారు ఎన్ని ఘోరాలు చేసినా, వారి తరపునే తీర్పు లిప్పించి, నిరపరాధులను బలి చేసే ప్రభుత్వాధికారులు, రక్షణాధికారులు, రాజకీయ నాయకులు, న్యాయవాదులు, న్యాయాధీశులు మొదలైనవారికి సందేశం ఇవ్వడానికే శ్రీరాముడు ఈ జగన్నాటకం నడిపించాడు.)

సీతను అడవికి పంపిన చాలాకాలం తర్వాత రాముడు అశ్వమేధ యాగం చేశాడు. అశ్వమేధ యాగం చేసినప్పుడు చక్రవర్తికి ప్రక్కన అతని భార్య వుండి తీరాలి. అందుకు రాముడు మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. బంగారంతో సీత విగ్రహాన్ని చేయించుకొని ప్రక్కన నిలుపుకున్నాడు. అదీ సీతారాముడంటే!

సీతాదేవి అగ్నిప్రవేశం, వనవాసం, అడవిలో వాల్మీకి ఆశ్రమంలో లవకుశుల జననం... ఇలాంటివన్నీ ఆయా అవతార సమయాల్లో అలా జరగాలని ముందుగానే దైవికంగా నిర్ణయించబడి వుంటాయి. అవి ఎందుకలా జరగాలనే విషయం కేవలం దైవశక్తికి మాత్రమే తెలుసు. అవతార మూర్తుల జీవితాల్లోని కొన్ని సంఘటనల పరమార్థాలు సామాన్యులకు తెలియవు. అటువంటి తెలియని విషయాలపై వేళాకోళాలూ, విమర్శలూ చేసే మూర్ఖుల సంఖ్య ఈ కాలంలో పెరుగుతుంది. వారికి పురాణ పరిజ్ఞానం శూన్యం... విజ్ఞానమూ శూన్యం. ఆలోచన శూన్యం. అవగాహనా శూన్యం. పురాణకాలం నుండీ పురుషులంతా స్త్రీలందరినీ హింసించేస్తున్నారనీ, ఒకడు తన భార్యను అడవికి పంపాడనీ, అగ్నిలో దూకమన్నాడనీ, మరొకడు జూదంలో పందెం కాశాడనీ, ఇంకొకడు పరాయివారికి అమ్మేశాడనీ... ఇలా అనేక విమర్శలు చేస్తుంటారు. అయితే ఆయా సందర్భాల పూర్వాపరాలుగానీ, అర్థ, పరమార్థాలు గానీ వారికే మాత్రం తెలియవు. తెలుసుకోవాలనే ప్రయత్నం కూడా వాళ్ళు చేయరు. కేవలం విమర్శలే వారి జన్మ హక్కుగా భావిస్తారు. అటువంటి వారికి మన సంస్కృతిపై సరైన అవగాహన కల్గించడం ద్వారా పరిస్థితిని చక్కబరచ వలసిన అవసరం నేడు ఎంతయినావుంది.

చివరిగా ఒక విషయం. ఆదర్శవంతమైన జీవితాన్ని లోకానికి చూపడానికి కొంతమంది పుడుతూ వుంటారు. వాళ్ళు దేవతా మూర్తులయినా కావచ్చు. లేదా మానవతా మూర్తులయినా కావచ్చు. వాళ్ళందరి జీవితాలూ ఆటుపోట్లతో కష్టతరంగానే వుంటాయి. మానవాళికి ఆదర్శాల్ని చూపాలనుకున్న ఏ కుటుంబమూ కూడా సుఖపడిన దాఖలాలు దాదాపుగా లేవు. (ఉదాహరణకు శ్రీరాముని కుటుంబం, హరిశ్చంద్రుని కుటుంబం... చివరకు నిన్న మొన్నటి మహాత్మా గాంధీ కుటుంబం... ఇలా...) ముఖ్యంగా రాముడు, కృష్ణుడు వంటి అవతార మూర్తులు జనవాళికి జీవన ఆదర్శాలను బోధించడానికి అనేక సన్నివేశాల్ని సృష్టించి చూపించారు. వాటిని సరిగా అవగాహన చేసుకుని, ధర్మ మార్గాన నడచుకోవడం మన వంతు.

7. హరిశ్చంద్రుడు తన భార్యను అమ్మడం న్యాయమా?

ప్రశ్న : సత్యవ్రతుడైన హరిశ్చంద్రుడు, తన భార్యను అమ్మడం సమంజసమా?

జవాబు : సీతాదేవి విషయంలో భర్తగా శ్రీరాముడు తీసుకున్న నిర్ణయాల్నీ, వాటిలోని అంతరార్థాల్నీ ఇంతకు ముందున్న శ్రీరాముని వ్యాసాల్లో చదివారు కదా! ఇంకా ఆ వ్యాసాల్ని చదవక పోతే, ముందుగా వాటిని చదివి, అప్పుడు ఈ వ్యాసాన్ని చదవండి. దాదాపుగా ఇక్కడ కూడా అదే తీరు కనిపిస్తుంది.

మనకు శాస్త్రాలు చెప్పిన పురుషార్థాలు నాలుగు. (1) ధర్మము (2) అర్థము (3) కామము (4) మోక్షము. ఈ నాలుగింటిలో అత్యంత ప్రముఖమైనది "ధర్మము". అర్థకామాలను పొందే విధానం కూడా "ధర్మబద్ధం" గానే ఉండాలి. అప్పుడే మోక్షం సిద్ధిస్తుంది. ధర్మం అనే అంశానికి ఎంతటి విలువ ఉందో చూడండి మరి. అన్ని వేళలా, అన్ని విధాలా ధర్మాన్ని మాత్రం విడిచి పెట్టరాదని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. అలా నడచుకున్నప్పుడు ఎంత ఆపద వచ్చినా, ఆ ధర్మమే మనల్ని రక్షిస్తుంది. "ధర్మో రక్షతి రక్షితః" (మనం ధర్మాన్ని రక్షిస్తే, ఆ ధర్మం మనల్ని రక్షిస్తుంది) అని ఆర్యోక్తి ఉంది కదా!

హరిశ్చంద్రుడు తాను విశ్వామిత్రునికి చెల్లించవలసిన బాకీ సొమ్మును ఏ విధంగానైనా సరే, చెల్లించి తీరుతానని మాట ఇచ్చాడు. కాబట్టి హరిశ్చంద్రుడు ఆ ధర్మాన్ని నెరవేర్చి తీరవలసిందే! అందుకోసం తన హోదాలనూ, మొత్తం సంపదలనూ వదులుకున్నాడు. అయినా ఇంకా బాకీ తీరలేదు. ఇక హరిశ్చంద్రునకు మిగిలింది... తనకు తాను, తన భార్య చంద్రమతి, కుమారుడు లోహితాసుడు. ఎన్ని కష్టాలు వచ్చినా, బిడ్డతో పాటూ పుట్టింటికి వెళ్ళేది లేదని చంద్రమతి చెప్పింది. (తాను అరణ్య వాసానికి వెళ్ళేటప్పుడు సీతను పుట్టింటికి పంపిస్తానంటాడు రాముడు. అడవుల్లో కష్టాలు నువ్వు భరించలేవని కూడా చెప్తాడు. అయినా సీత తన పుట్టింటికి వెళ్ళననీ, భర్తను అనుసరించడమే భార్య కర్తవ్యమనీ అంది) తనకు తానుగా ఎవరికైనా

అమ్ముడుపోవడం ద్వారా తన అప్పు కొంతయినా తీర్చాలని భావించాడు హరిశ్చంద్రుడు. ఎంత హీనమైన వాడికైనా సరే, ఏదొక విధంగా అమ్ముడుపోవాలనే నిర్ణయించుకున్నాడు. తాను అమ్ముడుపోతే తన భార్య సంగతి ఎలావుంటుందోనని బాధపడ్డాడు. ఒక మహారాణిగా గడిపిన ఆమె, తన కూడా ఉండి, దారుణమైన కష్టాలు పడడం ఆయనకు ఇష్టం లేకపోయింది. అందుకే ఒక క్షేమకరమైన స్థలంలో... ఒక బ్రాహ్మణ కుటుంబానికి దాసిగా ఆమెను అమ్మడం జరిగింది. (అదీ ఆమె అంగీకారం మేరకే!) అనంతరం ఒక స్మశాన కాపలాదారునికి దాసునిగా, తనను తాను అమ్ముకున్నాడు హరిశ్చంద్రుడు. ఏ ధర్మం కోసం భార్యతో సహా అన్నీ దూరం చేసుకున్నాడో... ఆ ధర్మమే తిరిగి తనను ఏనాటికైనా రక్షించగలదని హరిశ్చంద్రుని పరిపూర్ణ విశ్వాసం. "ధర్మో రక్షతి రక్షితః" అని మనసా, వాచా, కర్మణా నమ్మిన ఉత్తమోత్తముడు హరిశ్చంద్రుడు. తనకు బాహ్యంగా దూరమైన తన భార్యాబిడ్డల్ని ధర్మమే రక్షించి, తన వద్దకు తప్పకుండా చేరుస్తుందని దైవసాక్షిగా నమ్మిన మహనీయుడాయన. ఆయన నమ్మకం వ్యర్థం కాలేదు. చివరకు ఆయన ధర్మం, ఆయన్ని కాపాడింది. భార్యా బిడ్డలు, రాజ్యమూ అన్నీ తిరిగి రావడం జరిగింది. జీవితంలో జయించాడు. సుఖసంతోషాలతో జీవించాడు.

హరిశ్చంద్రుడు భార్యను అమ్మడం వెనుక ఇంత పరమార్థం వుంది. ఆయనపై అన్యాయంగా నిందలు మోపేవారంతా, ఈ పరమార్థాన్ని తెలుసుకుని, ఇకనైనా కళ్ళు తెరిస్తే మంచిది.

8. హనుమంతుడు - సువర్చల

ప్రశ్న : హనుమంతుడు, సువర్చల అనే అమ్మాయిని పెళ్ళాడాడనే విషయం కొన్ని ప్రాంతాల్లో ప్రచారంలో వుంది. ఇది యథార్థమా? కొన్ని దేవాలయాల్లో హనుమంతుడు, సువర్చలల వివాహం జరిపిస్తూ వుంటారట. అసలు ఏమిటిదంతా? హనుమంతుడు బ్రహ్మచారి కదా! ఇందులో నిజా నిజమేమిటి?

జవాబు : ఒక్కొక్క శాస్త్రంలో ఒక్కొక్క పండితుడు ఒక్కొక్క రకంగా వ్రాయటం, వేదకాలం నుండీ పరిపాటయింది. అదేవిధంగా హనుమంతుడి గాథలోనూ కొన్ని కొన్ని విభిన్న సంఘటనలు కనిపిస్తున్నాయి. అయితే హెచ్చు గ్రంథాలలో... ముఖ్యంగా రామాయణంలో హనుమంతుడు ఆజన్మ బ్రహ్మచారి అని చెప్పబడ్డాడు కనుక, హనుమంతుడికి వివాహం కాలేదనేది నిజం.

సూర్యుని కుమార్తె పేరు సువర్చల. ఆంజనేయుడు, సూర్యుని వద్ద విద్యాభ్యాసం చేశాడు. ఆ సమయంలోనే హనుమంతుని చూసి అతన్ని వివాహమాడాలనుకుంది సువర్చల. విద్యాభ్యాసం ముగిశాకా సూర్యుడు "హనుమా! నీపై మనసు పడిన నా కుమార్తెను వివాహమాడు. అదే నాకు గురుదక్షిణ" అన్నాడు.

హనుమంతుడికి అదొక సమస్య అయింది. "సూర్యదేవా ! నేను ఆజన్మాంతం బ్రహ్మచారిగా వుండాలని నిర్ణయించుకున్నాను. అయితే నీకు గురుదక్షిణ చెల్లించాలి కనుక, ఒక మాట ఇస్తున్నాను. కలియుగాంతంలో ఆమెను పెళ్ళాడగలను" అన్నాడట. అంతవరకూ వేచి వుంటానంది సువర్చల. సూర్యుడు అంగీకరించాడు.

ఇప్పటికీ హనుమ-సువర్చలకు పెళ్ళి కాలేదు. అయినా కొన్ని దేవాలయాల్లో హనుమంతునితోపాటు సువర్చల విగ్రహం కూడా ప్రతిష్టించేస్తున్నారు కొందరు.

మరికొందరు మరో అడుగు ముందుకు వేసి, వారికి వివాహమే జరిపించేస్తున్నారు. జనానికి ఇంత తొందర పనికిరాదు మరి ! కలియుగాంతం వరకు వేచివుండమని హనుమంతుడే చెప్పాడు. సువర్చల అంగీకరించింది కూడా! ఈ మధ్యలో కొంతమంది ఇలా కంగారు పడుతున్నారు. ఇదంతా చూసి, హనుమంతుడు కోపం తెచ్చుకుంటాడో... లేక వారి మూఢభక్తికి నవ్వుకుని ఊరుకుంటాడో మరి!

("హనుమత్ లీలా తరంగిణి" అనే గ్రంథంలో ఈ సువర్చల కథ వుంది)

9. అన్నపూర్ణాదేవి, శివునికి భిక్షవేసిన సందర్భం ఎప్పటిది?

ప్రశ్న : శివునకు అన్నపూర్ణ భిక్షం వేసిన సంఘటన ఎప్పుడు జరిగింది?

జవాబు : దక్షయజ్ఞ సమయంలో సతీదేవి మరణించాకా, మళ్ళీ ఆమె పర్వతరాజు కుమార్తె 'పార్వతి'గా జన్మనెత్తింది. ఆమె పెరిగి పెద్దదై, పరమశివుణ్ణే పెళ్ళాడతానని పట్టుపట్టింది. అప్పుడు శివుడు హిమాలయాల్లో ఘోరతపస్సులో మునిగివున్నాడు. నారదుడు మొదలైన పెద్దల సలహాతో పార్వతి అక్కడకు వెళ్ళి శివుణ్ణి ఆరాధించసాగింది. అయినా ఆయన తన తపోదీక్ష విడువలేదు. అప్పుడు మన్మధుడు బాణం వేసి, శివునికి తపోభంగం కలిగించాడు. శివుడికి చాలా కోపం వచ్చింది. తన మూడవ కన్ను తెరచి, మన్మధుని భస్మం చేశాడు. అప్పటికీ ఆయన కోపం తీరలేదు. ఎక్కడికో వెళ్ళిపోయాడు. పార్వతి విచారంలో పడింది. అప్పుడు నారదుడు ఆమె వద్దకు వచ్చి "శివుడు భిక్షాటనతో దేశసంచారం చేస్తున్నాడు తల్లీ ! కనుక నీవు కాశీక్షేత్రం వెళ్ళి అక్కడకు వచ్చిన ప్రతి భక్తుడికీ అన్నదానం చేస్తూవుండు. ఏదొక రోజు శివుణ్ణి కలిసే రోజు వస్తుంది'' అని చెప్పాడు. ఆ సలహా మేరకు పార్వతీదేవి కాశీక్షేత్రానికి వచ్చే యాత్రికులకు అన్నదానం చేస్తూ 'అన్నపూర్ణ' అనిపించుకుంది. ఒకరోజు అన్నపూర్ణ వద్దకు శివుడు రానేవచ్చాడు. తన భిక్షాపాత్ర పట్టాడు. అన్నదానం చేస్తూ అన్నపూర్ణ ఆయనను గుర్తుపట్టి, చేయి పట్టుకుంది. ఆ స్పర్శతో శివునికి మొత్తం అవగతమయింది. ఆనాటి సతీదేవియే పార్వతియై, ఇలా అన్నపూర్ణగా వచ్చిందని గ్రహించాడు. అనంతరం పార్వతీ పరమేశ్వర కళ్యాణం జరిగింది.

కాశీ అన్నపూర్ణ శివునికి భిక్ష వేసిన సందర్భం ఈ విధంగా వచ్చింది. అప్పటినుండీ పార్వతి అన్నపూర్ణగా కాశీక్షేత్రంలో వెలసింది. కాశీ విశ్వేశ్వరుడుగా శివుడు వెలిశాడు. అదీ సంగతి !

10. ధర్మరాజు జూద వ్యసన పరుడా ?

ప్రశ్న : దుర్వ్యసనాలలో జూదం ఒకటి. అలాంటి వ్యసనంలో పడి, రాజ్యాన్నీ, తమ్ముళ్ళను, భార్యను పోగొట్టుకున్న ధర్మరాజు ధర్మాత్ముడెలా అవుతాడు ?

జవాబు : 64 విద్యలలో జూదం కూడా ఒకటి. పూర్వం రాజులు 64 విద్యలూ నేర్చుకునేవారు. ఆ విధంగా కురు, పాండవులందరికీ జూదం వచ్చు. అయితే ధర్మరాజు అందరికన్న తెలివిగా బాగా ఆడగలిగేవాడు. అలా అని శకునితో జూదానికి ధర్మరాజు కోరికోరి ఆనందంగా వెళ్ళలేదు. ఎలాగయినా పాండవులను తరిమి వేయాలని కౌరవులు కుట్రచేసి, ధృతరాష్ట్రుని చేత ధర్మరాజుకు జూదం ఆడేందుకు కబురు పంపించారు. ధర్మరాజు వచ్చాడు. ఆయన రావడానికి మూడు కారణాలున్నాయి.

1. ఒక రాజు, మరొక రాజును జూదానికి ఆహ్వానించినపుడు వ్యతిరేకించరాదని శాస్త్ర నియమం వుంది. (రాజులకు కొన్ని రాజ ధర్మాలుంటాయి. జూదానికి పిలవగానే వెళ్ళిపోయాడని సామాన్యులుగా మనం విమర్శిస్తాంగానీ... రాజ ధర్మాల్ని పాటించడం వారికి తప్పదు మరి)

2. ధర్మరాజు పెద్దల మాటకు ఎదురుచెప్పడు. అందులోనూ ఆహ్వానం పంపినవాడు పెదతండ్రి ధృతరాష్ట్రుడు. ఆహ్వానం తెచ్చినవాడు పినతండ్రి విదురుడు. ఇక కాదని అనగలడా ?

3. ధృతరాష్ట్రుడు చక్రవర్తి. పైగా భీష్మాది పెద్దలంతా ఆ కూటమివారే.

తప్పనిసరిగా జూదం ఆడాడు ధర్మరాజు. అయితే మామూలుగా ఆడితే, ధర్మరాజే గెలిచేవాడు. కానీ శకుని మాయజూదంతో ఓడించాడు. ఒకవేళ ధర్మరాజు గెలిచి వుంటే ఆనాటివారు, యీనాటివారు యెవరూ అతణ్ణి తప్పుపట్టే వారు కాదు. ఖర్మవశాన ఓడిపోయినందువల్లనే ఆనాటి నుండీ యీనాటి వరకూ ధర్మరాజును జూదవ్యసనపరుడిగా, భార్యను

జూదంలో ఓడిన అధర్మపరుడుగా యెందరో నిందిస్తున్నారు. కానీ నిజానికి ధర్మరాజు ధర్మపరుడే. అతడు వ్యసనపరుడు కాదనేందుకు మరో ఋజువు కూడావుంది. ద్రౌపదీ వస్త్రాపహరణ తరువాత ద్రౌపది శపిస్తుందనే భయంతో గాంధారి, ధృతరాష్ట్రులు - పాండవులు కోల్పోయిన అన్నింటినీ తిరిగి యిచ్చివేశారు. ధర్మరాజు మళ్ళీ జూదానికేం కూర్చోలేదు. తన వాళ్ళతో తన రాజ్యానికి వెళ్ళిపోయాడు. కక్షతీరలేదు దుర్యోధనుడికి. మళ్ళీ ధృతరాష్ట్రుడి చేత ఆహ్వానం పంపించాడు. జరుగుతున్న కుట్ర అర్థమయింది ధర్మరాజుకి. అపుడు ఎంతోబాధ పడ్డాడు. అయితే పైన చెప్పిన కారణాల వలన, వెళ్ళక తప్పదు. వెళితే కీడు తప్పదు. ఏం చేయాలి ? ఇలా యెంతో విచారించి, చివరికి తప్పనిసరిగా వెళ్ళి, ఓడిపోయి, అడవుల పాలయ్యాడు. దీనినిబట్టి ధర్మరాజుకు జూదానికి వెళ్ళటం యిష్టంలేదని తెలుస్తుంది కదా !

జూదంలో ధర్మరాజు తన తమ్ముళ్ళనూ, భార్యనూ, చివరకు తననూ కూడా పందెంకాయడంలో అంతరార్థం ఉంది. పెద్దలంతా పెద్దరికంగా జూదానికి ఆహ్వానించి జూదం ఆడిస్తూ, మెల్లగా రెచ్చగొట్టి పందాలలోకి దింపారు ధర్మరాజుని. ఆ ప్రకారంగా మాయాజూదం ద్వారా పాండవుల రాజ్యాన్ని కాజేశారు కౌరవులు. దాని వల్ల తన తమ్ముళ్ళకూ, భార్యకూ తీరని అపకారం జరిగిందని ధర్మరాజు ఎంతగానో బాధపడ్డాడు. వారి కోసమయినా రాజ్యాన్ని తిరిగి రాబట్టుకోవాలనే తపనతో, ఒక్కొక్క తమ్ముణ్ణీ వరుసగా పందెంలో పెట్టి వాళ్ళందరినీ కోల్పోయాడు. చివరకు తనను తాను కూడా పందెంలో పెట్టుకొని ఓడిపోయాడు. ఇక మిగిలింది ద్రౌపది. ఆమెను పందెంలో పెట్టినా పెట్టకపోయినా, ఇక పరిస్థితి ఒకటే! ఎందువల్లనంటే అప్పటికే పాండవులంతా కౌరవులకు బానిసలయిపోయారు. ఆ ప్రకారంగా ద్రౌపది కూడా ఎలాగూ బానిసగానే లెక్క. అయితే కౌరవులు ఆ సమయంలో ధర్మరాజును రెచ్చగొట్టారు. "ద్రౌపదిని ప్రత్యేకించి పందెంలో పెట్టే అవకాశం ఇస్తున్నాం. ఆమెను పందెంలో పెట్టడం ద్వారా నువ్వుగాని గెలిస్తే పోయినవన్నీ నీకు ఇచ్చేస్తాం" అన్నాడు దుర్యోధనుడు. ధర్మరాజు ఆలోచించాడు. "ఎలాగూ అప్పటికే తామంతా బానిసలు కావడం జరిగింది. అయితే కౌరవులు ఇస్తున్న

ఆ అవకాశాన్ని వాడుకోవడం ద్వారా గెలిస్తే... తిరిగి అంతా చక్కబడుతుంది. ఒకవేళ ఓడినా కూడా, ఇప్పటి పరిస్థితే ఉంటుంది" అని యోచించి, దుర్యోధనుడు చెప్పిన ప్రకారం పందానికి దిగాడు. శకునిది మాయా జూదమని ధర్మరాజు గ్రహించలేకపోయాడు. మళ్ళీ ఓడిపోయాడు. ఇదీ సంగతి! ఓడిన అనంతరం ద్రౌపదిని నిండు సభలో అందరిముందూ కౌరవులు అంత హీనంగా బాధపెడతారని, ధర్మరాజు ఊహించ లేకపోయాడు. ఒక ధర్మరాజే కాదు. దుష్టచతుష్టయమైన దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, శకునిలకు తప్ప-ద్రౌపదీ వస్త్రాపహరణం జరగబోతుందనే సంగతి, ఆ సభలో అప్పటి వరకూ ఎవరికీ తెలియదు.

మహాభారతంలోని పై సంఘటనను సరిగా అర్థం చేసుకోకుండా ఈనాటికీ చాలామంది ధర్మరాజును విమర్శిస్తూ ఉన్నారు. ఏ పరిస్థితుల్లో ఇరుక్కునిపోయి, ఆయన అంతబాధ పడవలసి వచ్చిందో ఈసారి ఆలోచించి చూడండి. ధర్మరాజు ఏనాటికీ "ధర్మ" రాజే!

11. ఎవరు గొప్ప... కర్ణుడా? భీష్ముడా?

ప్రశ్న : దానశీలి కర్ణుడు, త్యాగశీలి భీష్ముడు... వీరిద్దరిలో ఎవరుగొప్ప?

జవాబు : దానం విషయంలో కర్ణుడికి చాలా పేరుంది. కర్ణుడు అంగరాజ్యానికి రాజయ్యాక చేసిన దానాలన్నీ, దుర్యోధనుడు ఇచ్చినవే కావచ్చు. కానీ బాల్యం నుండీ కర్ణుడికి దానగుణం హెచ్చు అని భారతం చెబుతుంది. అలాగే కర్ణుడి దానాలలోకెల్ల గొప్పదానం కవచకుండలాల దానం అంటారు పెద్దలు. అవి దుర్యోధనుడిచ్చినవి కావు కదా ! కర్ణుడి స్వంతం. ఆ కవచ కుండలాల దానం కర్ణుడికి మహత్తర కీర్తిని తెచ్చిపెట్టింది.

ఇక భీష్ముడి సంగతి..... భీష్ముడు తన తండ్రికోసం రాజ్యాన్ని వదులుకున్నాడు. తండ్రి కోసం ఆయన చేసిన త్యాగం అది! మరో విషయం ఏమిటంటే, ఆ రాజ్యం భీష్ముడి స్వంతం కాదు. స్వార్జితం కాదు. అప్పటికి యింకా భీష్ముడు, రాజు కాలేదు. యువరాజు మాత్రమే. ఆ రాజ్యం అప్పటికీ ఆయన తండ్రి శంతనుడిదే. శంతనుడి రాజ్యాన్ని శంతనుడికే వదిలేశాడు. ఒక విధంగా అది సంపూర్ణ త్యాగం కూడా కాదు.

ఈసారి మళ్ళీ కర్ణుని విషయం చూద్దాం. కర్ణుడు కవచకుండలాలను దానం చేశాడు. కానీ అంతకంటే గొప్పదైన 'శక్తి' ఆయుధాన్ని ప్రతిఫలంగా పుచ్చుకున్నాడు. ప్రతిఫలం పుచ్చుకున్న దానికి దానఫలం మిగలదు. కర్ణుడు తన పూర్వజన్మలో 100 కవచాలు + కుండలాలతో వుండగానే నరనారాయణుల ముందు నిలువలేక పోయాడు. ఇక ఈ జన్మలో కేవలం ఒక్క కవచంతో నరనారాయణుల (శ్రీకృష్ణార్జునుల) ముందు నిలువగలడా ? ఆ కవచం శక్తి ఎంతో కర్ణుడికి తెలుసు. అందుకే దాన్ని ఇచ్చేసి, అర్జునుణ్ణి కూడా చంపగల శక్తి ఆయుధాన్ని తీసుకున్నాడు. అంటే... ఈ విషయంలో మోసపోయింది కర్ణుడుకాదు. ఇంద్రుడే మోసపోయాడు. ఈ దానం సందర్భంలో కర్ణుడు ఇంతటి చాకచక్యం చూపించాడు.

ఇక భీష్ముడి మాటకొస్తే..... అతను కూడా రాజ్యాన్ని వదిలేశానన్నాడు. దానికి ప్రతిఫలంగా తానుకోరుకునే వరకూ మృత్యువే దరికి రాకుండా మంచి వరం పొందాడు. అంటే ఇతనూ తన త్యాగానికి ఫలితాన్ని తీసుకున్నాడు. పైగా సత్యవతి కుమారులు పెరిగి పెద్దయ్యేవరకు సుమారు 25 సంవత్సరాలు రాజ్యపాలన (మకుటం లేని మహారాజుగా) కూడా చేశాడు. అనంతర కాలంలో చివరి వరకూ కూడా కింగ్‌మేకర్‌గా బ్రహ్మాండమైన రాజభోగాలు అనుభవించాడు.

పై విధంగా కర్ణుడు, భీష్ముడు తగిన ప్రతిఫలాలు పొందడం వల్ల వారి చర్యల్లో అంత గొప్పదనం ఏమీ లేదు. వీరిద్దరికంటే గొప్ప దాతగా, త్యాగశీలిగా ధర్మరాజును చెప్పుకోవచ్చు. ఎందువల్లనంటే.....

అరణ్యవాసకాలంలో తమకే తిండితిప్పలు కరువైన రోజుల్లో కూడా, తమనే నమ్ముకుని తమకూడా అరణ్యాలకు వచ్చిన వేలాది అమాయకప్రజల కోసం సూర్యుని గురించి తపస్సు చేసి, అక్షయపాత్ర సంపాదించి, యే ప్రతిఫలాపేక్ష లేకుండా వేలాది ప్రజలకు ప్రతిరోజూ అన్నదానాలు చేశాడు ఆయన.

ఎక్కడో హిమాలయాలకు వెళ్లి అక్కడి భూమిలో వున్న నిధులను సాధించి తెచ్చి, అశ్వమేధ యాగ సమయంలో వేలాదిమందికి వారు కోరినంత బంగారాన్ని (స్వార్జితమైన బంగారం) దానం చేసిన ధర్మరాజు - కర్ణ, భీష్మల కంటే గొప్పవాడని గ్రహించాలి మనం.

12. ఎందువల్ల కర్ణుడు పాండవ వ్యతిరేకి ?

ప్రశ్న : "కర్ణుడికి తన జన్మరహస్యం తెలిశాక కూడా, పాండవులకు వ్యతిరేకిగానే వున్నాడు. ఎందువల్ల?''

జవాబు : కర్ణుడిలో కొంత దానగుణం తప్ప, యే ఇతర మంచి గుణాలూ లేవు. అందుకే వ్యాసుడు, తిక్కన కూడా కర్ణుణ్ణి దుష్టచతుష్టయంలో చేర్చారు.

అంగరాజ్యమిచ్చి దుర్యోధనుడు ఆదరించాడనే విశ్వాసంతోనే దుష్టకార్యాలు చేశాడని కొందరు భ్రమపడుతుంటారు. కానీ అది నిజంకాదు. అంత విశ్వాసం వుంటే, పంతాలకు పోయి కురుక్షేత్ర యుద్ధానికి వెళ్ళకుండా పదిరోజులపాటు దుర్యోధనుణ్ణి వదిలేస్తాడా ? అనగా దుర్యోధనుడికంటే అతనికి తన స్వంత పంతాలే ముఖ్యం. అంతేకాక కర్ణుడు అసూయ, మోసం, ద్వేషం అన్నీ కలిగివున్నవాడే! అతడు పరశురాముడి వద్ద విద్యనేర్చుకున్నదే మోసంతో. మొట్టమొదట కురు పాండవ యుద్ధ విద్యల ప్రదర్శనలో తానూ పాల్గొనాలని వచ్చాడు. కానీ అతడు క్షత్రియుడు కాదని కొందరు అభ్యంతరం

చెప్పారు. ఆ సమయంలో అర్జునుడు గొప్ప అస్త్రనిధిగా పొగడబడుతున్నాడు. అది కర్ణుని అసూయకు నాంది. ఎలాగో ఆ అస్త్ర విద్యాప్రదర్శనలో పాల్గొన్నాడు. అయితే అందరూ అతడిని అర్జునుడి కన్న మిన్నయని పొగడ లేదు (కౌరవులు తప్ప). అందుకే యేనాటికైనా అర్జునుణ్ణి ఓడించాలనుకున్నాడు. కానీ (ద్రౌపదీ స్వయంవరం, ఘోషయాత్ర, ఉత్తర గోగ్రహణం... యిలా) అనేకసార్లు అర్జునుడి ముందు ఓడిపోయాడు. అందుకే భూమిపై తానో, అర్జునుడో ఎవరో ఒక్కరే వుండాలని నిర్ణయించుకుని అర్జునుడిపై పగబట్టాడు.

నిజం చెప్పాలంటే అర్జునుడేమీ అంతగా కర్ణుని అవమానించలేదు. అస్త్ర విద్యాప్రదర్శన నాడు కూడా కర్ణుని భీముడే అవమానించి మాట్లాడాడు. మరియు దుర్యోధనుడికి ముఖ్యశత్రువు భీముడే. స్నేహితుని శత్రువు కనుక పగబడితే భీమునిపై పగపట్టాలి కర్ణుడు. కానీ అర్జునుడిపై పగపట్టాడు. కేవలం అసూయ వల్లనే! అందుకే పాండవుల్లో యెవరు దొరికినా చంపను కానీ, అర్జునుణ్ణి మాత్రం వదలను అన్నాడు కుంతీదేవితో. అర్జునుణ్ణి చంపడానికి నాగాస్త్రం సంపాదించాడు. ఇంద్రశక్తి ఆయుధం తీసుకున్నాడు. 10 రోజులపాటు యుద్ధంలో అర్జునుడు అలసిపోయే వరకు తాను విశ్రాంతి తీసుకుని, కురుక్షేత్రానికి వచ్చాడు. అతని గురి కేవలం అర్జునుడే!

కర్ణుని జన్మరహస్యం ధర్మరాజుకు తెలిస్తే ఆయన తనకున్నదంతా కర్ణుడికే ఇచ్చేసేవాడు. పాండవులంతా అతని అనుచరులుగా వుండేవారు. కానీ కర్ణుడికి కావలసింది ఆ భాతృప్రేమ, మాతృప్రేమ కాదు. పెద్దన్నయ్యగా గౌరవాదులూ కాదు. అర్జునుణ్ణి ఓడించాలి. తానే గొప్పవీరుడిగా కీర్తించబడాలి లేదా అర్జునుణ్ణి చంపేయాలి. మరి పాండవులతో కలసిజీవిస్తే తన అసూయా పూరిత దుష్టాశయం నెరవేరదుకదా ! అందుకే అతడు ఆజన్మాంతం పాండవ విరోధిగానే మిగిలిపోయాడు.

13. వీరత్వంలో అర్జునునిపై కర్ణుడు ఎంతటివాడు?

ప్రశ్న : కర్ణుని దానశీలతను ఆసరాగా తీసుకుని ఇంద్రుడు అతని కవచాన్ని కాజేశాడనీ, కురుక్షేత్రంలో కర్ణుణ్ణి శల్యుడు తన మాటలతో కుంచింపచేశాడనీ, రధచక్రం భూమిలో క్రుంగిన సమయంలో అర్జునుడు అతణ్ణి చంపేశాడనీ..... ఇవేవీ జరిగివుండకపోతే కర్ణుని చేతిలో అర్జునుడు ఓడిపోయేవాడని కొందరు అంటూ ఉంటారు. ఇందులో నిజా నిజాలేమిటి?

జవాబు : ఏవిధంగా చూసినా అర్జునుడి వీరత్వం ముందు కర్ణుడు దిగదుడుపే! ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. అయితే ఈ మధ్య కలియుగం ముదురుతుందో ఏమో..... విలన్స్‌కి ఫాన్స్ పెరుగుతున్నారు. అంతటితో ఆగకుండా, డబ్బున్న పెద్దలు కొందరు విలన్స్‌ను గొప్పవారిగానూ, ధర్మపరుల్ని అల్పులు గానూ చిత్రించి-సినిమాలు, టి.వి. సీరియల్స్ తీసి ప్రదర్శిస్తున్నారు. ఆ పుక్కిటి కథలనే నిజమని నమ్మడం వల్ల ఇటువంటి సందేహాలు వస్తున్నాయి.

"రావణుడే రామునికన్న మిన్న" అంటాడు ఒకడు. "ద్రౌపది" మనసులో కర్ణుణ్ణి కామించిందని" ఒకడు, "ధర్మరాజుకు రాజ్యపిపాస హెచ్చు" అని ఒకడు, "కీచకుడు మంచివాడే, వాణ్ణి ద్రౌపదే రెచ్చగొట్టింది" అని ఒకడు, కీచకుడితో భీముడు గెలవలేక రహస్యంగా దాచుకున్న కత్తితో పొడిచి చంపేశాడని" ఒకడు, ద్రౌపదీ స్వయంవరంలో కర్ణుడే మత్స్య యంత్రాన్ని కొట్టేసేవాడు - ద్రౌపది వాణ్ణి కించపరిచి పోటీలో పాల్గొన నీయలేదు" అని ఒకడు, "మత్స్యయంత్రాన్ని జరాసంధుడే కొట్టేసేవాడు. ద్రౌపది అతనికి నమస్కారాలు పెట్టి బ్రతిమాలి పోటీ నుండి తప్పించింది" అని ఒకడు..... ఇలా ఎన్నని చెప్పమంటారు ? ఇవన్నీ మన సినిమాల్లో, టి.వి. సీరియల్స్‌లోని మాయా జాలాలు. ఈ సంఘటనలు ఏవీ కూడా వేదవ్యాసులవారికి తెలియవు పాపం.

కర్ణుడు వీరుడే! కానీ అర్జునుడితో యేమాత్రం సమానుడు కాదు. ద్రౌపదీస్వయంవరంలో కర్ణుడు అర్జునునితో ఓడించబడ్డాడు. ఘోషయాత్రలో

కర్ణుణ్ణి ఓడించిన చిత్రరథుడు అర్జునుడి చేతిలో ఓడి పోయినవాడే! ఉత్తర గోగ్రహణంలో కర్ణుణ్ణి పడగొట్టి, అతని తలపాగా కుచ్చు తీసుకుపోయాడు అర్జునుడు. కురుక్షేత్రంలో ఒకేరోజున అయిదు మార్లు భీముడి చేతిలో ఓడిపోయి పారిపోయాడు కర్ణుడు. అభిమన్యుడి చేతిలో చావుదెబ్బలు తిని పారిపోయి, మరో ఐదుగురు దుర్మార్గులతో కలసివచ్చి అన్యాయంగా అభిమన్యుణ్ణి చంపిన భీరువు కర్ణుడు. కర్ణుడి కుమారుణ్ణి, సైంధవుణ్ణి చంపుతానని చెప్పిమరీ, కర్ణుడి కళ్ళముందే వాళ్ళిద్దరినీ అర్జునుడు చంపేశాడు. ఘటోత్కచుడి చేతిలో చావుదెబ్బలు తిని గత్యంతరం లేక, తన ప్రాణాలు కాపాడుకోవడం కోసం, అర్జునుణ్ణి చంపడం కోసం దాచుకున్న ఇంద్రశక్తి ఉపయోగించి ఘటోత్కచుణ్ణి చంపిన భయస్థుడు కర్ణుడు. అదీ కర్ణుని వీరత్వం సంగతి!

నూరు కవచాలు కలిగి ఉన్ననాడే కృష్ణార్జునులు (నరనారాయణుల రూపంలో) కర్ణుణ్ణి చావగొట్టి 99 కవచాలను ఛేదించారు. చేసేది లేక పారిపోయాడు కర్ణుడు. ద్రౌపదీ స్వయంవరం, ఘోషయాత్ర, ఉత్తర గోగ్రహణం సమయాల్లో కర్ణునికి చివరి కవచ కుండలాలు వున్నాయి ! అయినా అర్జునుడే గెలిచాడు. అందుకే ఆ కవచ కుండలాల శక్తి ఎంతటిదో కర్ణుడికి అర్థమయిపోయింది. అందుకే ఇంద్రుడు అడిగిన వెంటనే వాటిని యిచ్చేసి, అర్జునుణ్ణి చంపగల 'శక్తి' ఆయుధం తీసుకున్నాడీ దానకర్ణుడు. శల్యుడు తన మాటలతో కర్ణుడి మనసు పాడుచేయటం సంగతి యెలావున్నా, ఒక సన్నివేశంలో కర్ణుడి ప్రాణాలనే రక్షించాడు శల్యుడు. 17వ రోజు కురుక్షేత్ర యుద్ధంలో ధర్మరాజును కర్ణుడు తిట్టినట్లుగా తెలిసిన భీముడు వెళ్ళి కర్ణుడితో యుద్ధం చేసి అతన్ని మూర్ఛపోగొట్టాడు. అన్నగారిని తిట్టిన నాలుకను కోసి పారేస్తానని ముందుకురికాడు భీముడు. అప్పుడు శల్యుడు భీముణ్ణి శాంతపరిచి, మూర్ఛలో వున్న వారి నాలుక కోయరాదని చెప్పి కర్ణుణ్ణి రక్షించాడు. ఇక రథచక్రం కృంగి పోయినప్పటి సంగతి.....

చక్రాన్ని కర్ణుడు ఎత్తుతుండగా అర్జునుడు అతన్ని చంపలేదు.

యెంతయెత్తుతున్నా రధచక్రం రాకపోవటంతో, శాపవశాన ఆ చక్రం యికరాదని, మరో రథం తెచ్చుకున్నా యిదే గతిపడుతుందనీ తెలుసుకున్న కర్ణుడు ఇక నేలపై నిలబడే యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలోనే కర్ణుడు మరణించాడు. అర్జునుడు రథంపైన, కర్ణుడు నేలపైన వున్నందువల్ల కర్ణుడు ఓడిపోయాడనుకోకండి. కర్ణుని ఓడించిన చిత్రరధుడు రథంపై వుండి యుద్ధం చేయగా, నేలపై నిలబడి పోరాడిన అర్జునుడే గెలిచాడు. అదీ వీరత్వమంటే.

అందువల్ల మనం గమనించవలసింది ఏమంటే ఏ శాపాలు వగైరాలు లేకున్నా కూడా కర్ణుడు మాత్రం ఏనాటికీ అర్జునుణ్ణి గెలవలేడు.

14. ద్రౌపదీ వస్త్రాపహరణం

ప్రశ్న : ద్రౌపదీ వస్త్రాపహరణం జరిగేటప్పుడు సభలో అంతమంది వున్నారు. ఒక్కరూ ధర్మం చెప్పలేదు. ఆపలేదు. భీష్మద్రోణాదులు కూడా అలాగే వూరుకున్నారు. ఎందువల్ల ?

జవాబు : ఏదైనా దుర్మార్గం జరుగుతున్నపుడు చూస్తూ వూరుకోరాదు. దాన్ని ఆపాలి. కనీసం ఆపేందుకు శాయశక్తులా ప్రయత్నించాలి. ఒకవేళ అదీవీలుకాకపోతే, దాన్ని బాహాటంగా నిరశించాలి. ఏదీ చేయలేనపుడు ఆ దుర్మార్గాన్ని చూడకుండా అక్కడ నుండి వెళ్ళిపోవాలి. అదీ మంచివారి లక్షణం. ఆపగలిగిన శక్తి వుండి కూడా ఆపకుండా వూరుకున్నవారూ, ప్రోత్సహించే వారూ ఆ దుర్మార్గకార్యం యొక్క పాపఫలాన్ని పంచుకోకతప్పదు.

ద్రౌపదీ వస్త్రాపహరణం దుర్మార్గమని అక్కడ వున్న అందరికీ తెలుసు. అయితే దాన్ని ఆపాలని శక్తి కొలదీ ప్రయత్నించిన వాడు విదురుడు ఒక్కడే. "అదితప్పు" అని నిరశించినవాడు, దానిని ఆపలేక అక్కడి నుండి వెళ్ళిపోయినవాడు 'వికర్ణుడు'. వీరు ఇరువురూ, పాండవులూ తప్ప, మిగిలిన

వారంతా దొంగలే అని చెప్పక తప్పదు. భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ, బాహ్లీక, సోమదత్త, భూరిశ్రవస, ధృతరాష్ట్రాదులందరూ అలాంటి దొంగల క్రిందే లెక్క. కౌరవులు, కర్ణుడు, శకుని వగైరాలు ఆ దుర్మార్గానికి ప్రోత్సాహకులు.

అందుకే కురుక్షేత్ర యుద్ధంలో అందరూ తుడిచిపెట్టుకుని పోయారు.

పైపై మెరుగు మాదిరిగా భీష్మద్రోణులు లేని బాధను నటిస్తూ, వస్త్రాపహరణం కూడదంటూ మెల్లమెల్లగా మూలిగారేగాని - ఖచ్చితంగా వికర్ణుడు, విదురుని మాదిరిగా ఎదిరించారా ? లేదు. వారు తలచుకుంటే కౌరవుల దుశ్చర్యలను ఆపలేరా ? ఆపగలరు. కానీ ఆపరు. కారణం... ద్రౌపది ద్రుపదుని పుత్రిక. ద్రుపదుడు-భీష్మ, ద్రోణ, కృపాదులకు శత్రువు. అందుకే శత్రుపుత్రికను రక్షించరు వాళ్ళు. కానీ తమకు చెడ్డపేరు రాకూడదని దుర్యోధనుణ్ణి వారించినట్లుగా నటించారంతే.

ధర్మం చెప్పమని నోరువిడిచి భీష్మాదులను అడిగింది ద్రౌపది. వారు చెప్పలేదు. పైగా "అన్ని ధర్మాలూ ధర్మరాజుకే తెలుసు. అతనే చెప్పాలి. మేమేం చెప్పగలం'' అంటూ తప్పుకున్నాడు భీష్ముడు. కానీ ధర్మరాజు నోరు విప్పలేదు. ఎందుకంటే అది అధర్మం అని తెలిసినా, ఆ మాట పైకి చెప్పే అర్హత ధర్మరాజుకు లేదు. ఎందుకంటే అప్పుడతను కౌరవుల బానిస. బానిస, యజమానికి ధర్మాలు చెప్పరాదు. ఆ విషయం తెలుసు కనుకనే భీష్ముడు అలా ధర్మరాజు మీదకు నెట్టేశాడు. నిజంగా భీష్మాదులకు ఆ దుర్మార్గం ఇష్టం లేనట్లయితే ఆపితీరాలి. లేదా వికర్ణుడిలా వెళ్ళిపోవాలి. అంతేగాని ఆ దుర్మార్గాన్ని చూస్తూ అక్కడే వుండరాదు.

(ఆ సమయంలో ధర్మం చెప్పకుండా ధర్మరాజుకే అన్నీ తెలుసు అన్నాడు భీష్ముడు. మరి అన్నీ తెలిసిన ధర్మరాజుకు శాంతి, అనుశాసనిక పర్వాల్లో కొన్ని వందల ధర్మాలను భీష్ముడు యెందుకు బోధించినట్లు ?)

ఒక్కమాటలో చెప్పాలంటే ద్రౌపదీ వస్త్రాపహరణ తప్పు అని, అధర్మం

అనీ అందరికీ తెలుసు. మామూలు సభికులు కొందరు మంచిగా ఆలోచించి వుంటారు. కానీ వారికి ఆపగల శక్తి లేదు. పాండవులు బానిసలు కాబట్టి వాళ్ళు ఎదిరించరాదు. విదురుడు అశక్తుడు. పోరుపెట్టి పెట్టి ఓడిపోయాడు. వికర్ణుడు సభనుండి వాకౌట్ చేశాడు. ఇక మిగిలిన వారంతా ఆ కార్యక్రమానికి ఆటంకం చెప్పనివారే! అందుకే శ్రీకృష్ణుడు రంగ ప్రవేశం చేయక తప్పలేదు.

ఈ సందర్భంలో ద్రౌపది ఉసురుపోసుకున్న కౌరవుల తరపు దుర్మార్గులంతా కురుక్షేత్ర సంగ్రామంలో దారుణ మరణాలకు గురయ్యారు. నిండు సభలో జరుగుతున్న ఆ దారుణాన్ని ఆపగలిగి కూడా, ఆపకుండా ధర్మ ద్రోహానికి పాల్పడిన కురుకుల పితామహుడు భీష్ముడు కూడా ద్రౌపది ఉసురు పోసుకోవడంవల్లనే 6 నెలల పాటు 'బాణాల మంచం' (అంపశయ్య) పై చిత్రహింస అనుభవించి మరీ మరణించాడు. అంపశయ్యపై పడుకోడానికీ, మరణం కోసం అంతకాలం వేచి ఉండడానికీ మరో కారణం చెప్పబడినా కూడా, అంతర్లీనంగా భగవంతుడు ఆయనకు విధించిన శిక్ష అది! తమ కోడళ్ళి కాపాడకుండా చోద్యం చూసిన గాంధారీ ధృతరాష్ట్రులకు కూడా దారుణమైన శిక్షేపడింది. కన్నబిడ్డలు వందమందినీ కళ్ళముందే కోల్పోయి, గుండెలు బాదుకుంటూ ఏడ్చారు. అన్యాయంగా ఒక స్త్రీని బాధపెడితే అప్పుడైనా, ఇప్పుడైనా, ఎప్పుడైనా... ఎప్పుడో ఒకప్పుడు దారుణమైన శిక్ష అనుభవించి తీరవలసిందే! దుష్టులకు మహాభారతం చేస్తున్న హెచ్చరికల్లో ఇది ఒకటి.

15. ఏకలవ్యుడు, అర్జునుణ్ణి మించిన వీరుడా ?

ప్రశ్న : ఏకలవ్యుడికి బొటనవ్రేలు వుండి వుంటే అతను ఏనాటికైనా అర్జునుణ్ణి ఓడించేవాడని, అందుకే గురువు అయిన ద్రోణుణ్ణి ప్రేరేపించి, ఏకలవ్యుడికి వ్రేలు తీయించేశాడని అంటారు కొందరు. ఇందులో నిజం ఎంత?

జవాబు : ఇందులో ఏ మాత్రం నిజం లేదు. ఎందుకంటే ఏకలవ్యుడు గొప్ప విలుకాడేకానీ, అర్జునుడి కంటే గొప్పవాడు మాత్రం కాదు. ద్రోణుడి

శిక్షణ లేకుండా ఏకలవ్యుడు శస్త్రాస్త్ర సాధన చేసినట్లే, ద్రోణుడు నేర్పకపోయినా శబ్దభేదిని సాధన చేసి నేర్చుకున్నాడు అర్జునుడు. ఇంకా అర్జునుడు "సవ్యసాచి". అంటే ఏ చేతితో నైనా బాణాలు వేయగలడు. కానీ ఏకలవ్యుడు ఒక్క వ్రేలు పోగానే విలువిద్యలో వెనుకబడిపోయాడు. అదే అర్జునుడైతే ఒకవేలు పోయినా మరో చేతిలో బాణాలు వేయగలడు.

ద్రోణుడి వద్ద విద్యాభ్యాసం ముగిసినా ఆగిపోలేదు అర్జునుడు. ఇంద్రునివద్ద, శివునివద్ద, అగ్నిదేవునివద్ద.. ఇంకా చాలా మందివద్ద ఎంతోకృషి, మరెంతో తపస్సూ చేసి, ఎన్నో అస్త్రాలు సాధించాడు.

ఏకలవ్యునిలో ఇంతటి కృషి లేదు. పైగా ఏకలవ్యుడి వ్యక్తిత్వం మంచిదికాదు. దుర్మార్గ బుద్ధితో అతను జరాసంధునితో కలిసి అనేకసార్లు శ్రీకృష్ణుని మీదకు యుద్ధాలకు వెళ్ళాడు. చివరకు శ్రీకృష్ణుని చేతనే చంపబడ్డాడు.

ఏకలవ్యునిలో గొప్ప విషయాలు రెండు :

1. గురువు లేకున్నా విలువిద్య సాధించడం. (అది అర్జునుడూ చేశాడు. శబ్దభేదిని సాధించాడు.)

2. గురువు కోరగానే వ్రేలినే కోసి ఇచ్చాడు. (మరి అర్జునుడు కూడా గురువు కోరగానే ప్రాణాలకు తెగించి, పోరాటం జరిపి, ద్రుపదుణ్ణి బందీగా తెచ్చి అప్పగించాడు.)

ఏకలవ్యునిపై అర్జునుడికి ఏమాత్రం అసూయ లేదు. భారతం మరోసారి చదవండి. స్పష్టంగా మీకే అర్థమౌతుంది. ఏకలవ్యుని బొటనవ్రేలు గురుదక్షిణగా ద్రోణుడు అడగడానికి అర్జునుడు ఏమాత్రం కారణం కాదు. అందుకు మరో కారణం వుంది. ద్రోణుడు మహా స్వార్థపరుడు. తాను, తన కుమారుడు అశ్వత్థామ మాత్రమే లోకంలో గొప్ప వీరులుగా వుండాలనేది ద్రోణుడి ఆశ. ఏకలవ్యుడెక్కడ తమకంటే గొప్పవాడై పోతాడోనని అతని వ్రేలు తీయించేశాడు. అలాగే అర్జునుడు కూడా తమకంటే గొప్పవాడు

కాకూడదనే అర్జునుడికి శబ్దభేది రాకుండా చేయాలని చాలా ప్రయత్నించాడు ద్రోణుడు. కానీ విధి విచిత్రమైంది కదా ! అర్జునుడే దాన్ని నేర్చేసుకున్నాడు. అర్జునుడికీ, అశ్వత్థామకూ సమానంగా అన్ని విద్యలూ నేర్పిన ద్రోణుడు, "నారాయణాస్త్రం" అనే తిరుగులేని మహాస్త్రాన్ని అర్జునుడికివ్వకుండా అశ్వత్థామకు మాత్రమే ఇచ్చాడు. అర్జునుని పట్ల ద్రోణునికి ఉన్న కపట ప్రేమ అర్థమౌతోంది, గమనించండి.

16. కుమారస్వామి - సుబ్రహ్మణ్యస్వామి..... ఒకరేనా?

ప్రశ్న : "మన దేవాలయాలలో కొన్ని చోట్ల శ్రీవల్లీ దేవసేనా సమేత కుమారస్వామి అని విగ్రహాలు వుంటాయి. మరికొన్ని ఆలయాల్లో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అని విగ్రహాలుంటాయి. కుమారస్వామి పూర్తిగా మానవరూపంలో వుండగా, సుబ్రహ్మణ్యస్వామి సర్పరూపంలో ఉంటాడు. ఇంతకూ ఆ ఇద్దరూ ఒక్కరేనా ? మరి రెండు రూపాలెలా సాధ్యం ?"

జవాబు : నిజానికి ఇరురూపాల దేవుడూ ఒక్కరే. ఆయన జన్మించడం షణ్ముఖ కుమారస్వామిగానే జన్మించాడు. (ఈ కథ మా పురాణగాథల్లో సైన్సు అద్భుతాలులో చూడండి) కుమారస్వామి అంటే మానవజాతికి అధిదేవుడు. అతి సూక్ష్మ క్రిమినుండి మహాసర్పం వరకు గల ప్రాకెడి జీవజాతికి అధిదేవుడు సుబ్రహ్మణ్యేశ్వరుడు. అందుకే ఆయన సర్పరూపంలో దర్శనమిస్తాడు.

"అయితే కుమారస్వామి ఇలా సుబ్రహ్మణ్యంగా యెందుకు మారినట్లు?" ఈ విషయాన్ని వివరించే కథలు మన పురాణాల్లో రెండు విధాలుగా వున్నాయి.

ఒకటవ కథ : తారకాసుర్ణ్ని చంపేశాక, కుమారస్వామిలో గర్వం పెరిగిందట. అందువలన బ్రహ్మ సృష్టికి పోటీగా ప్రతిసృష్టి ప్రారంభించాడట.

దానివలన లోకం కంపించిపోగా బ్రహ్మవచ్చి అలాంటి పని చేయరాదని, సృష్టి కార్యం తనదేననీ చెప్పాడట. ఇలాంటి ప్రతిసృష్టి లోకానికి కీడు కలిగిస్తుందని కూడా చెప్పాడు. అందుకు కుమారస్వామి కోపించి బ్రహ్మను ఒక చెట్టుకు కట్టేసి, దండంతో బాగా కొట్టసాగాడట. అది తెలిసి శివుడు వచ్చాడు. కుమారస్వామిని బాగా మందలించి, బ్రహ్మను విడిపించాడు. కుమారస్వామి తను చేసిన పనికి పశ్చాత్తాపంపొంది, తనకుతానే శిక్ష వేసుకున్నాడు. అదేమంటే... తానుకొట్టిన దెబ్బలకు బ్రహ్మ శరీరం యెంతగా గాయపడిందో అన్నిగాయాలూ తనకూ తగిలేందుకు తానొక మహాసర్పం (పాము)గా మారి ముళ్ళపొదల మధ్య నుండి ప్రాకుతూ, ఒళ్ళు గాయాలు చేసుకుని ఒక పుట్టలో చేరి తపస్సుచేసి, తన పాపాన్ని కడుక్కున్నాడని పురాణ కథ.

వింతయిన ఈ కథలో మంచి అంతరార్థం వుంది. అదేమిటో చూద్దాం. నిజానికి కుమారస్వామి ఏ తప్పూ చేయలేదు. కుమారస్వామి అనగా మానవులకు అధిదేవుడు కదా ! అంటే మానవజాతికి తెలివి పెరిగేకొలదీ గర్వం కూడా పెరిగిపోయి, అంతా సైన్సేగాని భగవంతుడే లేడు అనే స్థాయికి చేరి, సృష్టికి ప్రతిసృష్టి అనేంతగా సైన్సు ప్రయోగాలతో అనేక క్రొత్త విషయాలు, పరికరాలు సృష్టించసాగింది. అయితే ఆ క్రొత్త సృష్టి మనిషికి తాత్కాలికంగా యెంతో లాభం కలగవచ్చు. కానీ ప్రకృతిలో, వాతావరణ కాలుష్యం యేర్పడుతుంది. ఈ కాలుష్య హాని, లోకం కంపించి పోవడంగా చెప్పబడింది ఈ కథలో!

(నేటికీ మానవులు తమ సుఖజీవనం కోసం నేలబొగ్గు, పెట్రోలియం, కరెంటు, ఎ.సి., ఫ్రిజ్‌లు, అనేక పరిశ్రమలు, అణుబాంబులు వగైరాలను పెంచుకుంటూ పోతుండటం వలన నీరు, గాలి, వాతావరణ కాలుష్యాలు, శబ్దకాలుష్యాలు, దృష్టికాలుష్యాలు పెరిగిపోతున్నాయి. చివరకు ఓజోన్‌పొరకు కూడా రంధ్రం పడింది. ఫలితంగా జీవరాశికి, ప్రకృతికి కూడా అనారోగ్యాలు పెరిగిపోతున్నాయి) ప్రకృతికి అధిదేవుడు బ్రహ్మ. జీవసృష్టికి మూలం ప్రకృతి. ప్రకృతి, కాలుష్యంతో పాడైపోవటమే - బ్రహ్మదేవుడు మానవ అధిదేవునిచే దెబ్బలు తినడంలోని అంతరార్థం.

అంటే ప్రాచీన కాలంలో కూడా మానవుడి ప్రయోగ ఫలితాల వలన ప్రకృతి కాలుష్యం పెరిగిపోయిందన్నమాట. దాన్ని నివారించేందుకు ఋషులు ఈ కథను ప్రచారం చేశారు. (అయితే మళ్ళీ ఈనాడు అదే కాలుష్యం పెరుగుతుంది)

ఇక కుమారస్వామి సర్పరూపం యెందుకు దాల్చాడు ? అనే దాని అంతరార్థం రెండవ కథలో మనకు లభిస్తుంది.

రెండవ కథ : ఒకసారి పార్వతీ పరమేశ్వరులను దర్శించు కోవటంకోసం యెందరో దేవతలు, ఋషులు, అప్సరసలు వచ్చారట. వారిలో కొందరు దిగంబరంగా కూడా వచ్చారు. ఆ దిగంబర స్త్రీ, పురుషులను చూసి కుమారస్వామి హేళనగా నవ్వుకున్నాడట. అది గమనించిన పార్వతి అతన్ని మందలించింది. "మానవుల మర్మాంగాలు సృష్టి వృద్ధికోసం యేర్పాటయినవి. అవి కేవలం శృంగారం కోసమేకాదు. అందువల్ల వాటిని చూసి హేళన, వ్యంగ్యం వుండరాదు. జాతికి జన్మస్థానాలు అవేనని గుర్తించి నిగ్రహం, గౌరవం చూపాలి" అని పార్వతి చెప్పగా కుమారుడు సిగ్గుపడి, ఆ పాప పరిహారం కోసం సర్పంగా మారిపోయి, కొంతకాలం ఆ రూపంలోనే వున్నాడట. ఇందులోనూ అంతరార్థం వుంది.

ఇక్కడ కుమారస్వామి అనగా 'మానవుడు' అని మనం భావించాలి. మానవులు పరాయి మానవ మర్మాంగాలను చూడగానే శృంగార వికారాలను పొందుతారు. ఒక విధమైన హేళన భావం వస్తుంది. కానీ అదితప్పు అనీ, అవి కేవలం సృష్టికి ద్వారాలని గ్రహించాలనే జ్ఞానబోధను పార్వతీదేవి ద్వారా ఋషులు ఈ కథలో చెప్పించారు. జీవ సృష్టికి మూలం బీజం. అనగా పురుషవీర్యంలోని జీవకణం. ఈ జీవ కణాలను మైక్రోస్కోపులో పరిశీలించండి. అనేక జీవకణాలు బిలబిల మంటూ నీటిలో చిన్న చిన్న పాము పిల్లలమాదిరిగా తోకలు వూపుకుంటూ యీదులాడుతుంటాయి. అందుకే వీటిని ప్రాకెడి జీవులలో చేర్చారు. అందువల్ల ఇటువంటి జీవకణాలు

మొదలు భారీ సర్పాల వరకు ప్రాకెడి ప్రాణుల జాతిగా కేటాయించారు. వాటిని అధిదేవుడు సుబ్రహ్మణ్యేశ్వరుడు.

జీవకణంగా వున్న కాలంలో ప్రాకులాడే జీవిగా ఉన్న ఆ ప్రాణి, స్త్రీ అండంతో కలిసి మానవుడిగా రూపు మారుతుంది. మానవుడికి ఈ ప్రాకెడి ప్రాణికి గల అనుబంధం యిదే! కొంతకాలం ప్రాకెడి జీవకణంగా, కొంతకాలం మనిషిగా రెండురూపాలున్నాయి మానవుడికి. అందుకే ప్రాకెడి ప్రాణుల అధిదేవుడు సుబ్రహ్మణ్యేశ్వరుడు కాగా, పరిపూర్ణ మానవుల అధిదేవుడు కుమారస్వామి అయ్యాడు. ఈ విధంగా రెండురూపాలను దాల్చాడు షణ్ముఖుడు.

మర్మాంగాల గురించి యదార్థ విషయాన్ని పార్వతీదేవి వివరించగానే ఆ మర్మాంగాలలోని జీవకణ రహస్యాన్ని గుర్తించి, వాటికి అధిదేవుడయ్యాడు కుమారుడు.

(కొత్తగా వీర్యంలోని జీవకణాలను కనుగొన్న మహర్షి అబ్బురపాటుతో వ్రాసిన పురాణకథ యిది).

జీవకణాలపై ఆధిపత్యం సుబ్రహ్మణ్యేశ్వరునిది. కనుకనే సంతానంలేని దంపతులు ఈ స్వామికి పూజలు చేసి, సంతానం పొందటం మనం చూస్తుంటాం.

ఏ రూపంలోవున్నా ఈయన భార్య శ్రీవల్లీదేవి మాత్రమే. నిజానికి దేవసేన యీయనకు భార్యకాదు. ఈయన ఏకపత్నీ వ్రతుడే. దేవసేన అనగా దేవతల సైన్యం. దేవతలకు అన్న మరియు రాజు “ఇంద్రుడు” అని అందరికీ తెలుసు. అందుకే ఇంద్రుడి చెల్లెలు దేవసేన అని చమత్కరించారు. దేవ సైన్యానికి కుమారస్వామిని సేనాధిపతిగా చేశాడు ఇంద్రుడు. అదే “దేవసేన”కు “పతి”గా (అధిపతిగా) చేయడంలోని అర్థం. నిజానికి దేవసేన ఒక అమ్మాయి కాదని తెలుసుకోండి.

17. దేవుళ్ళకు భార్యలుంటారా?

ప్రశ్న : హిందూదేవుళ్ళ సంఖ్య అధికంగా ఎందుకుంది? దేవుళ్ళకు భార్యలుంటారా? ఎందరో భార్యలున్న శ్రీకృష్ణుడు అస్ఖలిత బ్రహ్మచారి ఎలా అవుతాడు?

జవాబు : హిందూ దేవుళ్ళ సంఖ్య అధికంగా ఎందుకు ఉంది? దేవుళ్ళకు భార్యలుంటారా? అనే విషయాలకు జవాబులు తెలుసుకునే ముందు... 'దేవుడు' అనే పదానికి నిర్వచనాన్ని తెలుసుకోవాలి మనం. 'దేవుడు అంటే ఎక్కడో ఒకచోట ఒకాయన కూర్చుని వుంటాడని అనుకోకండి. విశ్వవ్యాప్తమైన మహాశక్తే దేవుడు. విశ్వమంతటా ప్రతి అణువునా, పరమాణువునా ఒక "శక్తి" దాగి ఉన్నదని సైన్స్ చెప్తుంది. ఈనాడు సైన్స్ చెప్తున్న ఈ శక్తిని... ఏనాడో మన ఋషీశ్వరులు కనుగొన్నారు. ఆ శక్తివల్లనే సకల విశ్వమూ నడిపించబడుతున్నదనే అద్భుత సత్యాన్ని కూడా వారు గమనించారు. ఆ శక్తినే వారు "దైవశక్తి" అని వ్యవహరించారు. "విశ్వంలో నిండి ఉన్నవన్నీ ఈ అద్భుతమైన దైవశక్తి స్వరూపాలే! హెచ్చుశక్తితో వివిధ స్వరూపాలుగా ప్రదర్శితమయ్యే ఈ దైవ శక్తినే - "వివిధ దేవుళ్ళు - దేవతలు" గా ఋషీశ్వరులు గుర్తించడం జరిగింది. ఈ కారణంగానే హిందూ ధర్మంలో దేవుళ్ళు, దేవతల సంఖ్య అధికంగా ఉంది. నిజం చెప్పాలంటే ఈ దేవుళ్ళు దేవతలకు కూడా నిర్దిష్ట స్వరూపాలేమీ ఉండవు. అవన్నీ సృష్టిలోని వివిధ శక్తులే! అయితే ఒక గుర్తింపు కోసం, ఒక ఏకాగ్రత కోసం ఈ దేవుళ్ళ, దేవతా స్వరూపాలను మనమే ఏర్పరచుకున్నాం. అయితే వారంతా ఒకే శక్తికి చెందినవారని ఆనాడు ఋషీశ్వరులకూ తెలుసు, ఈనాటి మహాత్ములకూ తెలుసు.

సాధారణ ప్రజలకు తెలిసేలా చెప్పాలంటే - దేవుళ్ళు, దేవతలు రెండు రకాలని చెప్పాలి. (1) సృష్టిలోని శక్తి స్వరూపాలకు ప్రతీకలు (ఉదా : త్రిమూర్తులు, త్రిమాతలు... ఇలా) (2) దైవశక్తి ఎత్తిన అవతారాలు (ఉదా : రాముడు, సీత, కృష్ణుడు... ఇలా)

సాధారణంగా దేవుళ్ళనూ, దేవతలనూ కూడా "దేవుడు" అనే పదంతో మనం వ్యవహరించడం పరిపాటి. దేవుడు అంటే మగ దేవుడని మాత్రమే కాదు. దైవశక్తి అనేది అసలు భావం. ఈ విషయాన్ని మనం ఎప్పుడూ మరువకూడదు. నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు, పంచభూతాలూ మొదలైనవీ... సృష్టిలోని మగ, ఆడ, చెట్టూ చేమా, రాయీ రప్పా, కొండా కోనా... అన్నీ కూడా దైవ శక్తి స్వరూపాలే! అంటే దేవుని యొక్క స్వరూపాలే!

ఒక స్వరూపం అంటూ నిశ్చయించలేని అంతర్యామి 'దేవుడనీ' సృష్టిలోని అన్ని స్వరూపాలూ కూడా 'దేవుడివేననీ' - బహు చక్కని వివరణ ఇచ్చారు మన ఋషీశ్వరులు. అర్థం చేసుకోగలిగితే మొత్తం యథార్థం అంతా ఇందులోనే వుంది.

ఇక దేవుడికి భార్య ఏమిటి? భర్త ఏమిటి? పిల్లలేమిటి? అన్నీ ఆయనే కదా!

అయితే దేవుళ్ళలో భార్యాభర్తలని నిర్ణయించబడడం రెండు విధాలుగా ఏర్పడింది. (1) సృష్టిలోని కొన్ని శక్తి స్వరూపాలను భార్యా భర్తలైన దేవుళ్ళుగా నిర్ణయించి నిలుపుకోవడం. (ఉదాహరణ : సృష్టికి కారణమై నలుదిశలా వ్యాపించివున్న ప్రకృతిని - "నాలుగు ముఖాలుగల బ్రహ్మదేవునిగా" నిలుపుకున్నాం. ప్రకృతికి అనుసంధానమై వున్న విద్య (Education) అనే అంశాన్ని "సరస్వతీ దేవి"గా భావించుకుంటూ, ఆమెను బ్రహ్మదేవుని భార్యగా ప్రతిష్టించుకున్నాం.) (2) దైవశక్తి భార్యాభర్తలుగా అవతారాలు దాల్చినపుడు వారిని దేవుళ్ళుగా నిలుపుకోవడం (ఉదా : సీతారాములు)

జీవులకు కొన్ని ఆదర్శాలు నెలకొల్పడానికీ, కొన్ని గుణపాఠాలు నేర్పడానికీ - దైవశక్తి తన అవతారాల ద్వారా అప్పుడప్పుడూ కొన్ని లీలలు చేస్తుంటుంది. అవసరాలనుబట్టి తానే భర్తగా, తానే భార్యగా, కుమారునిగా, కుమార్తెగా... ఇలా వివిధ పాత్రలు ధరిస్తూ ఉంటుంది.

కొందరు దేవుళ్ళకు బహుభార్యలున్నారు కదా! మనకు ఉంటే తప్పేమిటని

మూర్ఖంగా ప్రశ్నించి ముందుకు వెళ్తే, మనకు భంగపాటు తప్పదు జాగ్రత్త! సృష్టిలో అన్నీ తానే అయిన దైవశక్తితో పోలికను మానుకోవడం మన ప్రథమ కర్తవ్యం! మానవ జీవితానికి సంబంధించినంత వరకూ ఏకపత్నీ వ్రతం ఆచరణీయమని, దేవుడు మనకు శ్రీరాముని రూపంలో చెప్పాడు. అది మనకు ఆదర్శం. మరి కృష్ణునికి ఎందరో భార్యలు కదా! అదేమిటీ, అంటారా? శ్రీకృష్ణుని అష్టభార్యలూ లక్ష్మీదేవి అంశలే! ఇక మిగిలిన భార్యలందరూ గత జన్మలలో మహావిష్ణువు ద్వారా వరం పొందిన వారు. (అయినా దైవ శక్తులతో పోలిక వద్దని ముందుగానే చెప్పాం. దాన్ని గుర్తుంచుకోవడం అన్ని విధాలా మంచిది.)

ఇరువురు భార్యలంటూ చెప్పబడిన దేవుళ్ళ సంగతి చూద్దాం ఇప్పుడు. విఘ్నేశ్వర స్వామికి సిద్ధి, బుద్ధి అనే ఇద్దరు భార్యలని చెపుతారు. అయితే నిజానికి విఘ్నేశ్వరునికి పెళ్ళే కాలేదు. ఎన్నిమార్లు పెళ్ళి ప్రయత్నం చేసినా సఫలం కాలేదట. అందుకే ఎవరైనా యేదయినా కార్యం తలపెట్టినపుడు, ఎంతకూ అది జరగకపోతే "వినాయకుడి పెళ్ళి మాదిరిగా వుంది" అనే లోకోక్తి కూడా ఏర్పడింది. సిద్ధి, బుద్ధి అనేవి వినాయకుడు తన భక్తులకు వరాలుగా ఇస్తాడు. కార్యసిద్ధి, బుద్ధి కుశలతలు ఆయన అదుపులోనే వుంటాయి కాబట్టి - సిద్ధి, బుద్ధి ఆయనకు భార్యలుగా వర్ణించటం జరిగిందంతే!

ఇక కుమారస్వామి గురించి... ఇంతకు ముందున్న ఒక 'ప్రశ్న - జవాబు'లో ఈయన గురించి వివరంగా చెప్పుకున్నాం కదా! ఈసారి పరమేశ్వరుని సంగతి... ఈశ్వరుని భార్య సతీదేవి. ఆమె దక్షయజ్ఞంలో తనువు చాలించినా, మళ్ళీ పార్వతిగా పుట్టి ఆయన్నే పెళ్ళాడింది. ఆమె ఒక్కతే ఈశ్వరుని భార్య. వేరే భార్యలు ఆయనకు లేరు. గంగమ్మ ఆయన పత్నికాదు. దానికి శాస్త్ర బుజువుల్లేవు. కేవలం పుక్కిట పురాణాలు, జానపద గీతాల్లోనే గంగమ్మను శివసతిగా చెపుతారు. అది యథార్థం మాత్రం కాదు.

ఇక విష్ణువు మాటకొస్తే... శ్రీదేవి, భూదేవి అని ఇరువురి భార్యల

గూర్చి చెపుతారు. వారిరువురూ కూడా శ్రీ మహాలక్ష్మియే! చివరిగా శ్రీకృష్ణుని విషయం... శ్రీకృష్ణుని అష్టభార్యలూ లక్ష్మీదేవి యొక్క అంశలే! ఇక గోపికలంతా క్రితం జన్మలో వరం పొందిన అప్సరసలు. ఈ విషయాన్ని వివరంగా మా "శ్రీకృష్ణగీత" అనే పుస్తకంలో ఇచ్చాం, చూడండి.

భగవంతుడు సర్వసమర్థుడు. ఆయనతో పోటీ పడటం, ఆయనను విమర్శించటం, ఆకాశంపై వుమ్మివేయడం వంటిది. ఆయనశక్తి యేమిటో మనకు అర్థం కావడానికే శ్రీమహావిష్ణువు తన అవతారాల్లో అనేక లీలలు చూపాడు. పరశురామావతారంలో భార్యలేకుండా బ్రహ్మచారిగా, చిరంజీవిగా బ్రతికాడు. శ్రీరామావతారంలో ఒకే భార్యను కలిగి ఆమె దగ్గరగా వున్నా, యెక్కడోవున్నా కూడా ఏకపత్నీ వ్రతంతోనే బ్రతికాడు. బ్రహ్మచర్యం, ఏకపత్నీవ్రతాలు చూపిన తదుపరి శ్రీకృష్ణావతారంలో అనేక మంది భార్యలతో అనేక రూపులుగా మారి, ఏకక్షణంలో వారిని అలరించాడు.

ఆ మాటకొస్తే శ్రీ మహావిష్ణువు సర్వాంతర్యామి కదా! అన్నీ ఆయనే. లోకంలోని పురుషులూ ఆయనే! స్త్రీలూ ఆయనే! చివరకు చరాచరాలన్నీ ఆయనే! అటువంటపుడు ఆయన ఎందరితో ఎలా కలిసినా, అది దోషం కాదు. తనను తానే కలిసినపుడు 'స్కలనం' అనే దానికి తావేది ? అందుకే శ్రీకృష్ణుడు "అస్ఖలిత బ్రహ్మచారి" అయ్యాడు. లోకంలో జీవాలన్నీ ఆయనే అనే విషయాన్ని శ్రీకృష్ణావతారంలో నిరూపించి చూపాడు. ఒకసారి బ్రహ్మదేవుడు శ్రీకృష్ణుణ్ణి పరీక్షించాలనుకున్నాడు. బాలకృష్ణుడితోపాటు అడవికి వెళ్ళిన వందలాది గోపబాలురను, వేలాది ఆవు, దూడలను, స్పృహతప్పించి ఒక గుహలో దాచేశాడు. అది గ్రహించిన శ్రీకృష్ణుడు తానే అన్నివేల గోపాలురుగా, ఆవులుగా, దూడలుగా, అన్ని రూపాలు దాల్చి- గ్రామానికి వెళ్ళాడు. గోపికలంతా వారు నిజంగా తమపిల్లలు, పశువులుగానే భ్రమపడ్డారు. అలా ఒకరోజు కాదు. రెండు రోజులుకాదు. ఒక సంవత్సరం కాలం అలాగే గడిచిపోయింది. చివరకు బ్రహ్మ సిగ్గుపడి, అసలు గోపాలురను, పశువులను విడుదలచేసి, శ్రీకృష్ణుని

క్షమాపణ కోరాడు. శ్రీకృష్ణుడు తన మాయా రూపాలను ఉపసంహరించాడు. చూశారా ? భగవంతుడు తలచుకుంటే పిల్లలు, పశువులుగానేకాదు - ఏ విధంగానైనా కూడా మారగల సర్వ సమర్ధుడు.

అందువలన మూర్ఖంగా ఆయనను విమర్శించడం మాని-ఆయన గొప్పతనాన్ని గ్రహించి పూజిస్తే, యిహం - పరం దక్కుతాయి.

18. వశిష్టునికి - అరుంధతి ఏమౌతుంది ?

ప్రశ్న : వరుసకు చెల్లెలు అయిన అరుంధతిని వశిష్ఠుడు పెళ్ళి చేసుకున్నాడనే విమర్శ ఒకటుంది. ఇందులో నిజానిజాలేమిటి?

జవాబు : ఈ విమర్శలో ఏమాత్రం నిజం లేదు. అదెలాగో వివరంగా తెలుసుకుందాం. వావివరుసల గురించి మన శాస్త్రాలు స్పష్టంగా చెప్పాయి. భగవంతునిచే చేయబడిన ప్రత్యక్ష సృష్టిలో వావివరుసలకు ఆస్కారం లేదు. దేవుని పరోక్షసృష్టి (అనగా స్త్రీ, పురుష సంయోగం వల్ల జరిగే సృష్టి) లో మాత్రం వావివరుసలుంటాయి.

శివుడు ప్రత్యక్షంగా ఒకే క్షణంలో వీరభద్రస్వామిని, భద్రకాళీమాతనూ సృష్టించాడు. అది ప్రత్యక్ష సృష్టి కనుక, వారు సోదరప్రాయులు కారు. వారిని భార్యాభర్తలుగానే సృష్టించాడు.

అలాగే బ్రహ్మదేవుడు స్వయంభువ మనువును, శతరూపను భార్యాభర్తలుగా సృష్టించాడు. వారు సోదర ప్రాయులుకారు. ఈ రకం సృష్టిలో వీర్యం, అండం కలవటాలుండవు. ఇటువంటివి కాకుండా మిగిలిన సందర్భాల్లో వావివరుసలనేవి, దేవతల్లో కూడా వుంటాయి. దానికి అనేక ఋజువులున్నాయి.

ఇక వశిష్ట - అరుంధతుల మాటకొద్దాం.

సృష్టిని పెంపొందించే కార్యక్రమాలను అప్పగించడం కోసం బ్రహ్మ-ప్రజాపతులను, ఋషులను, మనువులను కొందరిని సృష్టించాడు. నారదుడు, దక్షుడు, వశిష్ఠుడు, భృగువు, క్రతువు, పులహుడు, పులస్త్యుడు, అంగీరసుడు, అత్రి, మరీచి, స్వయంభువ మనువు, శతరూప, కర్ధమ ప్రజాపతి మొదలగువారంతా బ్రహ్మ దేవుని పిల్లలే! కానీ వారంతా సోదరులనబడరు. వారిలో స్వయంభువ మనువు, శతరూపల పుత్రిక దేవహూతిని కర్ధమ మునికిచ్చి పెళ్ళి చేశారు. వారికి పుట్టిన కుమార్తెలను బ్రహ్మ మానసపుత్రులైన ఋషులకిచ్చి పెళ్ళిళ్ళు చేసి, సృష్టిని పెంచమన్నారు. వారి వివరము...

కర్ధమపుత్రికలు		ఋషులు
కళ	భర్త	మరీచి
అనసూయ	భర్త	అత్రి
శ్రద్ధ	భర్త	అంగీరసుడు
హవిర్భువు	భర్త	పులస్త్యుడు
గతి	భర్త	పులహుడు
క్రియ	భర్త	క్రతువు
ఖ్యాతి	భర్త	భృగువు
అరుంధతి	భర్త	వశిష్ఠుడు
శాంతి	భర్త	అధర్వుడు

అందు మరీచి పుత్రుడు కశ్యపప్రజాపతి దక్షపుత్రికలు 13 మందిని పెళ్ళాడి-దేవ,దానవ, సర్ప, పక్షి జాతులనెన్నో కన్నాడు. అలాగే మిగిలిన వారూ అనేక మందిని కన్నారు. ఆ విధంగా జీవసృష్టి సాగింది. ఇందులో వశిష్ట, అరుంధతులు సోదరీ సోదరులెలా అయ్యారో ఈసారి చెప్పండి. వారేకాదు. ప్రత్యక్షంగా బ్రహ్మ సృష్టించిన వారెవరూ కూడా ఎవరికెవరూ జన్మతోనే బంధువులుకారు. వేరువేరుగా సృష్టించబడ్డారు. సృష్టించబడిన తరువాతనే, వారిలో వారు కొన్ని బంధుత్వాలను కలుపుకుని, జీవసృష్టిని సాగించారు. అలా వారికి జన్మించిన వారు మాత్రం బంధుత్వాలు, వావివరుసలు కలిగివుంటారు. కనుక అరుంధతి, వశిష్టులు అన్నాచెల్లెళ్ళుకారు.

ఆ విధంగా సోదరీ సోదరులు వివాహాలు చేసుకునే సంస్కృతి వేరే మతాల వారిలో వుంది. వారి మత గ్రంథాల్లో అలాంటి బంధాలు కలిగిన వారి కథలున్నాయి. కానీ అటువంటివి మనలో లేవు.

ఇక్కడ మరొక చిన్న విషయం.

అరుంధతి మాదిగ కులానికి చెందినదని ప్రజల్లో ఒక భావన వుంది. దానికి కారణం, కొన్ని పురాణాల్లో కూడా ఆ మాట కన్పించటమే!

"నీవు చిన్నస్థాయి స్త్రీవైనా, నీ పాత్రివ్రత్యానికి సంతోషించాను. నీకు అతి ఉన్నత స్థానం కలిగిస్తాను'' అని వశిష్టుడు అరుంధతితో చెప్పినట్లుగా ఒక పురాణంలో వుందని కొందరు అంటారు. అయితే మరి భాగవతంలో ఖచ్చితంగా "అరుంధతి, కర్దమ ప్రజాపతి కుమార్తె'' అని వుంది. అయితే వీటిలో ఏది నిజం? అయినా అరుంధతిని కడజాతి పిల్ల అనడానికి ఓ అంతరార్థం ఉంది. ఆకాశంలోని అరుంధతీ నక్షత్రాన్ని చూశారా ? చాలా తక్కువ కాంతితో మిణుకు మిణుకు మంటుంది. దాని దగ్గరలో ఉన్న సప్త ఋషీ నక్షత్రాలు మంచి కాంతితో మిలమిల మెరుస్తూ వుంటాయి. అతి తక్కువ కాంతితో మెరుస్తున్నందున అరుంధతిని నల్లని స్త్రీయనీ... కడజాతి పిల్లయనీ చమత్కరించడం జరిగింది. అదీ సంగతి! మిగిలిన ఆరుగురు ఋషుల భార్యలూ వేరే చోట వుండగా, కేవలం అరుంధతి మాత్రం వశిష్టుని ప్రక్కనే వుండటం వలన ఆమెకి ఓ ప్రత్యేకత వుంది. ఆమె కడజాతి కన్య అనేది ఒక కల్పన మాత్రమే!

19. ఆంక్షలన్నీ ఆడవాళ్ళకేనా....!

ప్రశ్న : కొన్ని మహిళా సంఘాలవాళ్ళు అప్పుడప్పుడూ అక్కడక్కడా నిలదీసి ప్రశ్నిస్తుంటారు... "ఆంక్షలన్నీ ఆడవాళ్ళకేనా!'' అని. హిందూ గ్రంథాలు ఆడదాన్ని అణగద్రొక్కమని చెప్తున్నాయంటూ కొందరు స్త్రీలు

గగ్గోలు పెడుతుంటారు. రాజకీయంగానూ లేదా ఇతరితర లబ్ధికోసం కొందరు అవకాశవాదులు వారిని సమర్థిస్తూ, వారికంటే ఎక్కువుగా హడావుడి చేస్తుంటారు. దీనిపై మీ సమాధానం ఏమిటి?

జవాబు : హిందూ గ్రంథాలు ఆడదాన్ని అణగద్రొక్కమని ఎక్కడా చెప్పలేదు. పైగా స్త్రీ అపురూపమైనదనీ, ఆమెను భక్తిభావంతో ఆదరంగా, ప్రేమగా చూసుకోవలసిన బాధ్యత - పురుషులపై ఉన్నదనీ చెప్పాయి. ఎక్కడ స్త్రీలు ఆరాధించబడతారో అక్కడ దేవతలు ఆనందనాట్యం చేస్తారని వేదాలు ఘోషిస్తున్నాయి. మన వేదాలు, పురాణాలు చెప్పిన మంచి అంశాలను వక్రీకరిస్తూ తప్పుడు ప్రచారాలు చేస్తున్న కొందరు దుండగుల కారణంగా అక్కడక్కడా మహిళాసంఘాలు అపార్థాలకు లోనౌతున్నాయి. అతి ప్రాచీనకాలాన మనువు, స్త్రీల గురించి చెప్పిన చక్కని విషయాలను తప్పుదారి పట్టించి, ప్రచారం చేస్తున్నారు కొందరు. ఆ విషయాల్ని తెలుసుకుందాం. స్త్రీకి ఎప్పుడూ ఒక సంరక్షణ అవసరమనీ - అందువల్ల బాల్యావస్థలో తండ్రి సంరక్షణ, యవ్వనంలో భర్త సంరక్షణ, వార్ధక్యంలో కుమారుని సంరక్షణ స్త్రీకి అవసరమని మనువు చెప్పాడు. స్త్రీ అనేది క్షేత్రము... అనగా ఒక నారుమడిని పోలినది. పంట వేసుకునే నారుమడి ఎవరో ఒకరి ఆధీనానికి చెంది, వారి సంరక్షణలో వుండటం అత్యంత ఆవశ్యకం. అప్పుడే అది సక్రమమైన ఫలితాల్ని అందించగలదు. ఎవరి సంరక్షణ లోనూ లేని భూమి పరిస్థితి, ఎంత అసహ్యాకరంగా తయారవుతుందో మనకు తెలియనిది కాదు. వయసులో వున్న స్త్రీ పరిస్థితి కూడా ఇంతే ! ఆమెకు సమాజంలో ఒకరి ఆధీనమూ, సంరక్షణా చాలా అవసరం. ఆమెను అపురూపంగా భద్రపరచి రక్షించుకోలేకపోతే... సమాజంలో ఒక కుటుంబం అంటూ లేకుండా పోతుంది (ఎవరి బిడ్డ ఎవరో కూడా తెలియకుండా అయిపోతుంది. స్వేచ్ఛ సంపాదించిన స్త్రీల విచ్చలవిడితనం వల్ల విదేశాల్లో పరిస్థితి ఈ విధంగానే మారింది. స్వాతంత్ర్యం, సమానత్వం, హక్కులూ అంటూ మన దేశంలో కూడా రోడ్లకెక్కుతున్న మహిళల కారణంగా మన దేశ పరిస్థితి కూడా విదేశాల్లోవలే

మారుతుంది.) మనువు చెప్పిన మంచి మాటల్ని ఈనాడు కొందరు ఇలా వక్రీకరిస్తున్నారు. "స్త్రీకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేకుండా 'బాల్యంలో తండ్రి వద్ద, యవ్వనంలో భర్తవద్ద, ముసలితనంలో కొడుకు వద్ద' బానిసలా చాకిరీ చేస్తూ పడిఉండాలని" మనువు చెప్పినట్లుగా ప్రచారం చేస్తున్నారు. వారి మాయమాటలు నమ్మిన మహిళలు కొందరు దీనిపై ఉద్యమాలు లేవదీస్తున్నారు. దేశ సంస్కృతిని అర్థం చేసుకోలేకపోవడం వల్ల వస్తున్న అనర్థం ఇది! ఆంక్షలన్నీ ఆడవాళ్ళకేనా! అన్నారు. అదీ పొరబాటే! ఆడ, మగ అందరికీ ఆంక్షలుంటాయి. కొన్ని ఆంక్షలు లేకుంటే సమాజం సవ్యంగా నడవదు. మానవత్వం, మంచితనం, శీలం మొదలగు వాటన్నిటి గురించీ ఆంక్షలు ఇరువురికీ సమానంగా ఉంటాయి. ఎటొచ్చీ ఆడకూ, మగకూ ఒక్కచోటే తేడా వుంది. సంతాన క్షేత్రం స్త్రీ వద్ద వుంది. అందువల్ల ఆమె విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుని తీరాలని శాస్త్రం చెప్తోంది. వాటిని బంధనాలుగా భావించి స్త్రీలు తిరగబడితే... ఎంతటి ముప్పుకలుగుతుందో ఒకసారి ఆలోచించి చూడండి. విదేశీ వనితలకున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు మాకూ కావాలని ఈ మధ్య మనదేశ మహిళలు ఉద్యమాలు చేస్తూ ముందుకు దూకుతున్నారు. అయితే వీరు కోరుకుంటున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని ఏనాటినుండో అనుభవించేసి, జీవితాల్లో దెబ్బతిని బుద్ధి తెచ్చుకున్న అమెరికన్ మహిళలు ఇటీవలనే ఓ ప్రకటన చేస్తూ "ఏళ్ళ తరబడి మేం పొందిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల వల్ల విచ్చలవిడితనం పెరిగిపోయి, మా సమాజం కుళ్ళిపోతోంది. ఇటువంటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మాకు వద్దు. భారతీ మహిళలకున్న గౌరవం, భద్రతా మాకు కావాలి" అంటున్నారు. అమెరికన్ మహిళల నుండి వచ్చిన ఈ ఆక్రందనను అర్థం చేసుకుంటే, విషయం మొత్తం అవగతమౌతుంది మనకు.

భర్తకు భార్య ఒక మంత్రివలె చక్కని సలహాలనిస్తూ ఒక మంచి మార్గదర్శిగా ఉండాలనీ, తల్లివలే భోజన సదుపాయం చూడాలనీ, దాసివలే సేవలు చేయాలనీ, రంభవలే సుఖపెట్టాలనీ, లక్ష్మీదేవి వలే సౌభాగ్యంతో కన్పించాలనీ, క్షమ విషయంలో భూదేవిలా వుండాలనీ మన పూర్వీకులు

చెప్పారు. ఇవేమీ కూడా స్త్రీని కించపరిచే అంశాలు కావు. దాసిగా సేవలు చేయమన్నారని స్త్రీని పనిమనిషి చేసేశారంటూ గగ్గోలు పెట్టనవసరంలేదు. మంత్రిగా మసలమని చెప్పిన మాటకూడా మనం గుర్తుంచుకోవాలి. మంత్రిగారి ఆలోచనలమేరకే రాజుగారు ప్రవర్తిస్తారు. దీన్నిబట్టి చూస్తే భర్తను ఉత్తమరీతిలో నడిపించవలసిన మార్గదర్శి పదవికూడా భార్యకే ఇవ్వబడింది కదా! మగవాడి జీవితంలో భార్యను మించిన స్నేహితురాలు (గర్ల్‌ఫ్రెండ్) లేదని మన పూర్వీకులు చెప్పారు. ఇవన్నీ సరైన దృష్టితో ఆలోచించగలిగిన విజ్ఞతను పెంచుకోగలగాలి మనం.

స్త్రీని దేవతామూర్తిగా భావించి గౌరవించే సంస్కృతి మనది. ఆధ్యాత్మికత, భక్తి, శాంతము, సహనము, శీలము..... ఇవన్నీ స్త్రీ జాతి మూలధనాలు. ఈ ఉత్తమ గుణాలన్నింటిలో పురుషులకంటే స్త్రీలే మిన్న అని హిందూ గ్రంథాలు నిరూపిస్తున్నాయి. సంస్కృతిపై అవగాహన లేని మహిళలు కొంతమంది - "మన శాస్త్రాలన్నీ మహిళలను చిన్న చూపు చూస్తున్నాయనీ, అన్ని శాస్త్ర విషయాలూ పురుషులకు అనుకూలంగా వ్రాయబడ్డాయనీ" భావిస్తున్నారు. శాస్త్రాలు వ్రాసిన మహర్షుల్లో అధికులు పురుషులే కనుక, వారు పురుష పక్షపాతులుగా వ్యవహరించి ఉంటారని కూడా వారి భావన. "ఈ లోకంలో ధర్మమార్గాన జీవితం గడిపిన వారికి స్వర్గంలో దేవతా స్త్రీలతో సుఖ భోగాలుంటాయని" ఎక్కడో ఒక ఉపన్యాసంలో ఒక గురువుగారు చెప్తున్నారట. అదివిన్న ఒక మహిళ చటుక్కున లేచి "మీరు ఇలాంటి మాటలు చెప్పవచ్చునా? మగవారికి ఇక్కడున్న భోగాలు సరిపోలేదా? ఇంకా దేవతా స్త్రీలతో భోగాలా? ఎంతయినా మీరూ మీరూ మగవారే కదా! బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు" అంటూ తిరగబడింది. అప్పుడు ఆ గురువు గారు శాంతంగా "తల్లీ! కోపగించకు. చెప్పేది పూర్తిగా చెప్పనివ్వు. పురుషులను శీలవంతులుగా సరిదిద్దాలనే తలంపుతోనే ఈ విషయం చెప్పుకొస్తున్నాను. అంతేగాని, పురుషులను వెనకేసుకురావడం లేదు. నిజానికి స్వర్గమూ లేదు... దేవతా స్త్రీలూ లేరు. ఆ విధంగా చెప్పుకురావడం వల్ల ఇహలోకంలో పురుషులు ధర్మ మార్గంలో చరిస్తారని ఒక భావం. మరణానంతరం శరీరాన్ని వదిలిపెట్టిన ఆత్మకు లింగ భేదమే

ఉండదు. అలాంటప్పుడు వారికి ఇక దేవతాస్త్రీలతో సంబంధమేమిటి? శీలం విషయంలో అప్పుడప్పుడూ తప్పులు చేసే పురుషులను సరిదిద్దడం కోసం ఇలాంటి విషయాలు ఉదహరించడం జరుగుతుంది. అదే మహిళల విషయంలో చూడండి. వారిని గురించి కనీసం కలలోనైనా తప్పుగా ఊహించలేము. అందువల్ల వారిని సరిజేయవలసిన ప్రసక్తే లేదు. కాబట్టి నేను చెప్పే అంశం ముమ్మాటికీ స్త్రీల ఔన్నత్యాన్నే సూచిస్తుంది" అని చెప్పుకొచ్చారు. ఆ మాటలకు ఆ మహిళ శాంతించి కూర్చుంది. ఆవేశపడిపోయే మహిళలకు అర్ధమయ్యే రీతిలో సవ్యంగా ఇలా చెప్పగలగాలి. మన విద్యాలయాల్లోని పాఠ్యాంశాల్లో మన సంస్కృతి పై అవగాహన పెంపొందించే పాఠాలను పొందుపరచడం వల్ల ఎన్నో విధాల మంచిని సాధించగలం. (కానీ ఈ నికృష్టకాలంలో అది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు.)

20. ఏ మతం ఉత్తమమైనది?

ప్రశ్న : ప్రపంచంలో ఎన్నో మతాలు ఉన్నాయి కదా! ఆ మతాలవారంతా ఎవరికివారే తామే గొప్ప వాళ్ళమని, తమ మతమే అసలైందనీ అంటుంటారు. ఇంతకూ వీటిలో ఏమతం ఉత్తమమైనది?

జవాబు : జనావళికి కలిగే కష్టాలు - సుఖాలు, ఓటమి - విజయాలూ, దుఃఖాలు - ఆనందాలు, అనారోగ్యాలూ - ఆరోగ్యాలూ... ఇలాంటి వాటిని లెక్కలోకి తీసుకుని, ఏ మతం ఉత్తమమో చెప్పడం చాలా పొరబాటు. ఎందుకంటే ఈ అంశాలన్నీ రుచి చూసినవారూ, చూస్తున్నవారూ ప్రపంచంలోని అన్ని మతాల వారిలోనూ వున్నారు. కేవలం ఏదొక మతంవారు మాత్రమే సుఖపడడం, మిగతా మతాల వారు కష్టాలు పడడం అనేది ఏనాడూ లేదు. అందువల్ల ఏ మతం ఉత్తమమైనది అనే విషయాన్ని తేల్చడానికి ప్రాతిపదికగా పరిశీలించవలసిన అంశాలు 5 ఉన్నాయి.

యథార్థమైన ధర్మంగాని, మతంగానీ ముఖ్యంగా ఈ 5 విషయాల్లో అత్యుత్తమమవ్వై వుండాలి. అవి ఏమిటంటే 1) ఆధ్యాత్మిక దృష్టి 2) ధార్మికబోధన 3) అతిప్రాచీనత 4) ఉత్తమ సంస్కృతీ సంప్రదాయాలు 5) సైన్సుకు సరిపడి ఉండడం.

పై 5 అంశాల్లోనూ హిందూమతానికి ఉన్న ఉత్కృష్టతను గురించి చర్చించే ముందు మనం ఒక విషయాన్ని తెలుసుకోవాలి. మనం పలికే 'హిందూమతం' అనే పదం - ఒక పొరబాటు పదం. మనది 'హిందూ ధర్మం'. ఇదొక మతం కాదు. మతం అనేది చాలా సంకుచితమైనది. ఎవరో ఒక మనిషి మనసులోంచి ఉద్భవించి, ప్రచారం చేయబడిన దాన్ని "మతం" అంటారు. ఆ మతం వెనుక ఒకరిద్దరు వ్యక్తులు, ఒకటి రెండు మత గ్రంథాలూ ఉంటాయి. అయితే హిందూ ధర్మం సంగతి అలాకాదు. ఎవరో ఒక వ్యక్తి ప్రారంభించింది కాదు ఇది. దీనికి ప్రచారకులు కూడా ఉండరు. సృష్టితోనే మొదలయిన విశ్వ ధర్మం... మన "హిందూధర్మం". చివరివరకూ సృష్టితోనే వుంటుంది ఇది! హిందూ ధర్మం అనేది ఒక ధార్మిక జీవన విధానం. హిందూ ధార్మిక గ్రంథాలు ఒకటీ రెండూ కాదు. లక్షల్లో వుంటాయి. ఒక ఆధ్యాత్మిక విజ్ఞాన పరంపర అది! అదే హిందూ ధర్మాన్ని రక్షిస్తూ వుంటుంది. (మతానికి పుట్టుక, పెరుగుదల, నశింపు ఉంటాయి. కానీ ధర్మానికి చావు పుట్టుకలుండవు. ధర్మం అనేది సనాతనమైనది, సత్యమైనది, శాశ్వతమైనది. మతం మానవ నిర్మితమైనది. ధర్మం దైవదత్తమైనది. మతం వ్యక్తి గతము, సంకుచితము. ధర్మం విశాలమైనది, అందరికీ చెందినది. మతం మానవులను విడదీస్తుంది. ధర్మం సకల జీవులనూ ఏకం చేస్తుంది.) అయితే ఇటీవల ఎవరెవరో ఎక్కడెక్కడో పుట్టుకొచ్చి వారికి తోచిన విధానాలతో కొన్ని కొన్ని మతాలంటూ ఏర్పరచారు. ఈ విధంగా అనేక మతాలు అనంతర కాలంలో రావడంతో సనాతనమైన హిందూ ధర్మానికి కూడా "మతం" అనే పదాన్ని తగిలించి, "హిందూ మతం" అనే వ్యవహారిక నామాన్ని తీసుకురావడం జరిగింది. (ఈ విషయాన్ని మనం నిరంతరం గుర్తుంచుకోవాలి)

పైన తెలిపిన 5 విషయాల్లో 'హిందూమతం' పాత్ర ఎంతటిదో తెలుసుకుందాం ఇప్పుడు.

1. ఆధ్యాత్మిక దృష్టి : "ఆధ్యాత్మికత" అనే పదానికి నిర్వచనమే హిందూమతం. ఆధ్యాత్మిక భావనకు ప్రపంచంలో పుట్టినిల్లు మన భారతదేశం. జీవాత్మ, పరమాత్మ, పునర్జన్మ, పాపం, పుణ్యం, ధర్మాధర్మాలు, యోగం, ముక్తి సాధన, భగవంతుడంటే ఏమిటి ?... ఇలా యెన్నో అంశాలను గురించి హిందూమతం సవివరంగా, అనంతంగా చెప్పింది. ఋషీశ్వరుల దేశం మనది. శీలం, తపం, జపం, యోగం, ధ్యానం, త్యాగం మొదలైనవన్నీ మన సంపదలు. అసలుసిసలైన ఆధ్యాత్మికవేత్త ఒక్కడు కూడా ఏనాడూ ఏ విదేశంలోనూ జన్మించలేదు. అందువల్లనే ఈనాడు విదేశీయులంతా భారతదేశ ఆధ్యాత్మికతవైపు పరుగు లెడుతూ వస్తున్నారు. ఏనాడో వివేకానందుడు మన హిందూ ధర్మం గురించి అమెరికాలో చేసిన సింహగర్జన, ప్రపంచమంతటా ఇప్పటికీ ప్రతిధ్వనిస్తూనే వుంది. మన ఆధ్యాత్మిక శక్తి అలాంటిది మరి!

2. ధార్మిక బోధ : ప్రతి మత గ్రంథము ధర్మాన్ని బోధిస్తుంది, నిజమే! కానీ ప్రతి మతానికి ఏదో ఒకటి రెండు గ్రంథాలుంటాయి. అవి కేవలం కొన్ని ధార్మిక వాక్యాలను వల్లిస్తాయి. హిందూ ధర్మంలో మాత్రం లెక్కకుమించినన్ని గ్రంథాలున్నాయి. వాటిలో ఎన్నో ధర్మాలు నిక్షిప్తమై వున్నాయి. అవి కేవలం ధార్మిక వాక్యాలుగా కాకుండా ఏ ధర్మం ఆచరిస్తే, యే మంచి ఫలితం వస్తుంది ? ఏ అధర్మంతో నడిస్తే, ఏ శిక్ష పడుతుంది ? మనిషి యే ధర్మాలను ఎలా ఆచరించాలి? తల్లి, తండ్రి, సోదరీసోదరులు, అత్తమామలు, బావ మరదులు, వదిన, మరదళ్ళు, యజమాని, సేవకులు, ధనికులు, పేదలు, రాజు, ప్రజలు, ఇరుగు పొరుగులు, గురుశిష్యులు, వివిధ బంధాలతో ఏఏ ధర్మాలను ఎలా ఆచరించాలనేది ఉపమానాలతో, ఉదాహరణలతో, కథలుగా, గాథలుగా మన హిందూ గ్రంథాలలో కన్పిస్తాయి. ఈ విధమైన వివరణలు మరే ఇతర గ్రంథాల్లోనూ కనిపించవు.

విశ్వంలో వుండే సకల ధర్మాల వివరణ హిందూ గ్రంథాల్లో వుంది. హిందూ గ్రంథాల్లో లేని ధర్మం, ఈ విశ్వంలో మరెక్కడా లేదు.

3. అతిప్రాచీనత : ఈ ప్రాచీనతా విషయంలో ప్రపంచంలోని ఎన్నో జాతులు, మతాలు, దేశాలు పోటీ పడుతూనే వున్నాయి. అయితే ఇతర దేశాలు, జాతులు, మతాలు వారి ప్రాచీనతను - కేవలం అయిదారు వేల సంవత్సరాల వరకు చూపించగలుగుతున్నాయి.

కానీ విశ్వం ఆవిర్భావాన్ని, భూమి... వాతావరణం... ప్రకృతి జననం... జీవ జాతుల జననం... ఇలాంటి అతిప్రాచీన విషయాలను వివరించిన ఏకైక గ్రంథాలు..... "హిందూ వేద, పురాణేతి హాసాలు".

దానికి ఋజువులున్నాయి.

కొన్ని లక్షల యేళ్ళ క్రితం ఉత్తర ధ్రువంలో యెలా వుండేదో వివరించాయి మన హిందూగ్రంథాలు. (మేరు పర్వత జీవన గాథలు అతిప్రాచీనమైనవి)

10 లక్షల ఏళ్ళనాటి భారతదేశ భౌగోళిక, జంతు, వృక్ష శాస్త్రాది విషయాలను వివరించింది - "రామాయణం". అవన్నీ ఈనాటి ఆధునిక శాస్త్రాలకు సరిపోతూండటం విశేషం.

గంగానది, గోదావరి నది యెప్పుడు ఎలా పుట్టాయనేది ఆధునికులు ఇంతవరకూ లెక్కించలేకపోయారు. అవి యెలా ఏర్పడ్డాయో, మన గ్రంథాలు చెప్పాయి. అంత ప్రాచీనమైనది మన హైందవం.

బుధగ్రహం ఎప్పుడు కనుగొనబడిందీ ఆధునికులు చెప్పలేరు. బుధగ్రహం కనుగొనబడిన వివరాలు, దాని లక్షణాలు... మొదటిసారిగా వెలువరించినది మన హిందూగ్రంథాలే! అంత ప్రాచీనమైనది మన హిందూ విజ్ఞానం.

ఇన్ని మాటలెందుకు..... సృష్టిలో ప్రప్రథమ విజ్ఞానులు హిందువులు. వారి అనంతరమే ఇతర జాతులు, మతాలూ కళ్ళు తెరిచాయనటానికి అనేక ఋజువులున్నాయి.

(మా భారతీయ శంఖారావం ప్రచురణలు చదివి, ఋజువులు తెలుసుకోండి)

4. ఉత్తమ సంస్కృతీ సాంప్రదాయాలు : హిందూ సంస్కృతి గురించి వేరే చెప్పాలా ? ప్రపంచమంతటికీ తెలుసు. జుట్టు, బొట్టు, కట్టు దగ్గరనుండి గానం, నాట్యం, శిల్పం, చిత్రం..... ఏ అంశంలోనైనా-వినయం, వందనం, పద్ధతి అనేవి ఉన్నాయంటే అవి కేవలం హిందూ సంస్కృతిలోనే వున్నాయి.

అన్ని కళలూ విదేశీయుల నుండే మనం నేర్చుకున్నట్లుగా కొందరి అభిప్రాయం. అయితే విదేశాల నుండి మనవారు నేర్చుకున్న సంస్కృతులు ఏమిటి? విరబోసుకుని తిరిగే జుట్టు, బొట్టు కాటుకల్లేని పేడి ముఖాలు, వీలయినంత ఎక్కువగా శరీరాలను ప్రదర్శించే బట్టలు, సిగ్గూశరంలేని స్త్రీ, పురుష విచ్చలవిడి ప్రవర్తనలు..... ఇంకా పోతే..... పాచి ముఖంతో కాఫీ, టీ సేవనం... ఆరోగ్యాలను పాడుచేసే రోగాలను ప్రసాదించే ధూమపానం... ఇవీ విదేశీ కళలు. జుట్టు, బొట్టు, కట్టు... స్త్రీ, పురుష తిరుగుళ్ళ విషయాల్లో ఆదిమవాసీ మరియు కోతిజాతి కాలాన్ని తలపింపచేస్తున్నాయి విదేశీ దిగుమతి సంస్కృతులు.

శరీరాన్ని మైమరపించి విచ్చలవిడిగా ఆడించేవి "విదేశీ సంస్కృతి నృత్య గానాలు". మనసును కట్టిపడేసి ఆనంద విహారం చేయించేవి "హిందూ సంస్కృతి నాట్యగానాలు".

నిండుగా హిందూ సంస్కృతీ రీతిలో ముస్తాబైన స్త్రీని చూస్తే, తుంటరి వాడయినా నమస్కారం పెడతాడు. అదే విదేశీ సంస్కృతిలో ముందుకొచ్చిన ఆడదాన్ని చూస్తే, కన్ను కొడతాడు వాడు.

దీని ముందు ధర్మబోధనలో చెప్పుకున్నామే... హిందువుల వివిధ బంధాల ప్రవర్తనావళిలో వున్న ఔన్నత్యాన్ని..... అదీ మన సంస్కృతి!ఉదయం మేల్కొనడం దగ్గర నుండీ రాత్రి నిద్రించేవరకు యెవరు, ఎలా, ఏ సమయానికి ధర్మమార్గాన ఏమి చేయాలనేది విశదీకరిస్తుంది మన సంస్కృతి. ఆ సంస్కృతిని పూర్తిగా ఆచరించగలిగిన వారు ప్రపంచమంతటా గౌరవాభిమానాలు పొందగలుగుతారు.

ఈనాటికీ ఎందరో విదేశీయులు కూడా మన సంస్కృతికి జేజేలు పలుకుతుంటారు. హిందూ వివాహ వ్యవస్థ, దాంపత్య బంధం, వివిధ బాంధవ్యాల పద్ధతులూ... మరేయితర సంస్కృతిలోనూ కానరావు.

5. సైన్సుకు సరిపడి వుండడం : సైన్స్ అంటే విదేశీయుల సొత్తు అనీ, విజ్ఞానమంతా విదేశాల నుండే మన దేశానికి దిగుమతి అయిందనుకునే మూర్ఖులు ఎందరో వున్నారు. సైన్సు పరిజ్ఞానమంతా హిందూ ధర్మంలోనిదేనని వారికి ఏమాత్రం తెలియదు. (హిందువుల విజ్ఞాన విషయ ప్రతిభను వివరంగా తెలుసుకోవాలనుకునే వారు మా "పురాణాల్లో సైన్స్" పుస్తకాన్ని చదవండి.) హిందువుల విజ్ఞానం వెల్లివిరిసిన నాటికి, ప్రపంచంలో పరజాతులేవీ కళ్ళయినా తెరవలేదు.

ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి నిద్రించే వరకు, హిందువుల దినచర్యలో అణువణువూ అంతరార్థంతో కూడిన విజ్ఞానమే! వారి ఆచారాల్లో విజ్ఞానం, వేషభాషల్లో అలంకారాల్లో విజ్ఞానం, వారి వేద, పురాణేతిహాసాల్లో విజ్ఞానం, వారి పూజా విధానాలు, పూజాద్రవ్యాలు, నైవేద్యాలు మొదలగు వాటిలో విజ్ఞానం, పంచాంగాల్లో విజ్ఞానం, దేవుళ్ళు, దేవతల విషయాల్లో కూడా విజ్ఞానం... ఇలా వారి జీవితాలే "విజ్ఞానమయం".

(ఇంకా వివరాల కోసం మా భారతీయ శంఖారావం ప్రచురణలు చదవండి.)

మరి ఇతర జాతులు, మతాలకు అలాకాదు. వారి జీవనం వేరు. విజ్ఞానం వేరు. అందుకే వారి మతాలకు, విజ్ఞానానికి అంతగా బంధం వుండదు. వారిలో జ్ఞానులకు మాత్రమే విజ్ఞానంతో బంధం వుంటుంది. సాధారణ ప్రజలకు విజ్ఞాన సంబంధం తక్కువ. కానీ హిందువుల్లో మాత్రం అతిసామన్యుడు కూడా విజ్ఞానం కలిసిన జీవనాన్ని సాగిస్తుంటాడు. పండితులు, పామరులు అందరూ విజ్ఞాన బాటలోనే వుంటారు. హిందూ ధర్మం సృష్టిలోని మొట్ట మొదటి ధర్మం కనుక - అది దేనినీ, ఎవరినీ విమర్శించదు. ఎందుకంటే దాని తర్వాత వచ్చిన మతాలూ, శాఖలూ అన్నీ కూడా దానిలోని అంతర్భాగాలే! హిందూ ధర్మంలో లేని ధర్మం మరెక్కడా లేదు. అన్ని మతాల మూల సిద్ధాంతాలన్నీ, హిందూ ధర్మం లోనివే! అందుకే హిందూ ధర్మం ఎవరినీ మతాలు మార్చుకోమని చెప్పదు. ఎవరు ఏమతం, ఏ ధర్మంలో వున్నా, సృష్టిలోని అందరూ కూడా హిందూ ధర్మంలోని సభ్యులే! ఈ కారణం చేతనే "లోకాస్సమస్తా సుఖినోభవంతు" అని చెప్పగలిగింది హిందూ ధర్మం. వేరేగా ఏవేవో మార్గాలు అవలంభిస్తున్నామని చెప్పుకునే వారి బుద్ధి"సంకుచితంగా" ఉంటుంది. మా మార్గమే అసలైనదనీ, మా మార్గంలోకొస్తేనే రక్షణ కలుగుతుందనీ, మా దేవుడే అసలైన దేవుడనీ, ఇతరుల నుండి తామెంతో వేరు అనీ... తప్పుడు ఊహలతో, వేర్పాటు వాదాలతో తిరుగుతుంటారు వారు.

హిందూ ధర్మం మతమార్పిళ్ళు చేయదు. మారణహోమాల్ని పోషించదు. (అహింసా పరమో ధర్మః, ధర్మోరక్షతి రక్షితః అని చెప్తుంది) కొబ్బరినూనెతో సకల రోగాలూ పోగొడతామనీ, మాయ కబుర్లతో అంగ వైకల్యాలన్నీ చిటికెలో నయంచేసేస్తామనీ, హిందూ ధర్మం చెప్పదు. మోసపూరిత పనుల్ని హిందూ ధర్మం అంగీకరించదు. దాని పవిత్రతే దానికి రక్ష. వందల ఏళ్ళుగా ఎందరో విదేశీయులు అష్టకష్టాలకు గురిచేసినా, చేస్తున్నా శోభాయమానంగా విలసిల్లుతూనే వుంది హిందూ ధర్మం.

అదండీ సంగతి! ఈసారి మీరే నిర్ణయించుకోండి... ఏ మతం ఉత్తమమైనదో! ఏ ధర్మాన్ని ఆచరిస్తే మానవుడికి ముక్తీ... మోక్షం లభిస్తాయో!

కొసమెరుపు : మాయామోసాలతో మతమార్పిళ్ళు చేయించే పెద్దమనిషి ఒకాయన మొన్న కన్పించి "చూశారా? ఒకరినిబట్టి ఒకరికి మా మతం ఎంత త్వరగా వ్యాపించిపోతుందో! మావాళ్ళ సంఖ్య అంతకంతకూ అనంతంగా ఇలా పెరిగిపోతూనే ఉంది. మా మతం ఎంత గొప్పదో గమనించారా మరి!" అన్నాడు. దానికి మేము చిరునవ్వు నవ్వి "ఎయిడ్స్ వ్యాధి ఒకరిని బట్టి ఒకరికి త్వరత్వరగా వ్యాపించి, వాళ్ళ సంఖ్య కూడా ఎంతగానో పెరిగిపోతుంది. ఆ సంఖ్యాబలాన్ని లెక్కలోకి తీసుకుని, ఎయిడ్స్ వ్యాధి చాలా గొప్పదని చెప్పగలమా? కౌరవులు వందమంది. పాండవులు ఐదుగురే! చివరకు విజయం ఎవరిని వరించిందో తెలుసుకదా!" అన్నాం. ఆ పెద్దమనిషి మళ్ళీ నోరెత్తలేదు. మెల్లగా అక్కణ్ణుంచి జారుకున్నాడు.

21. సూర్యచారం నిజమా ?

ప్రశ్న : సూర్యచారం (సూర్యుడు కదలడం) నిజమా? "సూర్యుడు" కదలని జ్యోతిర్మండలం కదా! మరి సూర్యుడు కదులుతూ ఉండడం... దానివల్ల దక్షిణాయనం, ఉత్తరాయణాలు రావడం... ఇవన్నీ ఏమిటి? సూర్యచారం గురించి చెప్పే మన శాస్త్రాలు నిజమా ? అబద్ధమా ?

జవాబు : ఉపగ్రహాలన్నీ తమ మాతృగ్రహం చుట్టూ తిరుగుతాయి. గ్రహాలన్నీ సూర్యుని చుట్టూ తిరుగుతాయి. సూర్యుడు మాత్రం ఎవరి చుట్టూ తిరగడు. అయితే ఆత్మ ప్రదక్షిణ చేస్తూనే వుంటాడు. అలా అని సూర్యుడు ఎల్లకాలం ఒకేచోట వుంటాడని అనుకుంటే పొరపాటే! ఈ గ్రహాలు, ఉపగ్రహాలతోపాటుగా పిల్లలకోడి మాదిరిగా ఈ అనంత విశ్వంలో అలా నడిచి వెళ్తూనే వున్నాడు సూర్యుడు.


వీణారాశి దిశగా సూర్యుడు వెళ్తున్నాడని ఆధునిక శాస్త్రవేత్త లంటున్నారు. అయితే ఆ కదలికను మనం గమనించటం కష్టం. ఎందుకంటే ఎన్నో కోట్ల సంవత్సరాలకు గానీ, మార్పు వచ్చినట్లుగా కనపడదు.


విశ్వంలోని ఈ సూర్యచారం సంగతి ఇలా వుండగా, జ్యోతిష గ్రంథాల లెక్క ప్రకారం మరోవిధమైన సూర్యచారం వుంది.

నిజానికి సూర్యుడు అక్కడే స్థిరంగా వున్నా, సూర్యుని చుట్టూ భూమి తిరగటం వల్ల సూర్యుడే తిరుగుతున్నట్లు మనకు భ్రమ కలుగుతుంది. మనం చూస్తున్న సూర్యునికి ఆవలి వైపు ఎంతో దూరాన ఒక నక్షత్రరాశి వుంటుంది కదా ! అప్పుడు సూర్యుడు ఆ నక్షత్ర రాశిలో వున్నట్లుగా చెప్తాయి జ్యోతిష గ్రంథాలు. మరోనెల గడిచే సరికి భూగోళమే కొంత ప్రక్కకు జరుగుతుంది. అప్పుడు ఆ కోణంలో చూస్తే, సూర్యుని వెనుక మరో నక్షత్ర రాశి కనిపిస్తుంది. ఈ సందర్భంలో నిజానికి చలించినది 'భూమి'. కానీ సూర్యుడే ప్రక్కకు జరిగినట్లు భ్రమపడతాం మనం. అలా భూమి జరిగే కొలదీ మనం చూసేకోణం మారడం వల్ల, సూర్యుడే 12 రాశుల్లోకి మారినట్లుగా అనిపిస్తుంది మనకు.


ఇక్కడ ఉన్న బొమ్మల్ని పరిశీలించండి. ఈ క్రింది 1వ బొమ్మలో భూమినుండి చూస్తుండగా సూర్యునికి ఆవల "వృశ్చికరాశి" కనిపిస్తుంది. అంటే సూర్యుడు వృశ్చికంలో వున్నట్లు మనకు అనిపిస్తుంది.

1వ. బొమ్మ





ఈ 2వ బొమ్మలో భూమి నుండి చూస్తే, సూర్యుడు వృషభంలో వున్నట్లనిపిస్తుంది కదా ! నిజానికి తిరిగేది భూమి మాత్రమే! అయినా సూర్యుడే 12 రాశుల మీదుగా ప్రయాణించినట్లనిపిస్తుంది. అదే "సూర్యచారం".



ఈసారి 3వ బొమ్మ చూడండి. భూమి "ఎ" వద్ద బయలుదేరి "బి" చేరే సమయాన్ని "ఉత్తరాయనం" అంటాం. ఎందుకంటే భూమి ఉత్తరదిశ నుండి దక్షిణానికి వెళ్ళేకొలదీ సూర్యుడే ఉత్తరానికి వెళ్తున్నట్లు కన్పిస్తుంది. అలాగే "బి" నుండి "ఎ" వద్దకు... అనగా దక్షిణం నుండి ఉత్తరానికి భూమి వెళ్తుంటే, సూర్యుడే దక్షిణదిశగా వెళ్తున్నట్లు అనిపిస్తుంది. సూర్యుడు ఉత్తరంగా వెళ్తే ఉత్తరాయనం, దక్షిణ దిశగా వెళ్తే దక్షిణాయనం.

అదే విధంగా సూర్యునికి దక్షిణదిశలో వున్న భూగోళం అలా తిరుగుతూ సూర్యునికి ఉత్తరదిశకు చేరుతున్నప్పుడు, సూర్యుడే ఉత్తరంనుండి దక్షిణానికి పయనించినట్లు మనకు అనిపిస్తుంది. అదే దక్షిణాయనం. అక్కడికి భూమి యొక్క సూర్య ప్రదక్షిణంలో సగభాగం పూర్తయింది. అపుడు రెండవ సగభాగ ప్రయాణం మొదలయి... ఉత్తరం నుండి దక్షిణానికి భూమి చలించినా, సూర్యుడే ఉత్తరదిశగా వెళ్ళినట్లు కనిపిస్తుంది. అదే ఉత్తరాయనం.

ఈ రెండు ఆయనాలలో ఉత్తరాయనం మంచిదని, అది చాలా పుణ్యకాలమనీ... దక్షిణాయనం అంత మంచిదికాదని, కొందరు భ్రమపడుతూ వుంటారు. నిజానికి రెండు ఆయనాలూ పుణ్యకాలాలే! ఇంకా దక్షిణాయనంలోనే వర్షాలు, పాడి పంటలు, పండుగలు, పర్వదినాలు, శరత్కాలం, కార్తీక పుణ్యకాలం, ధనుర్మాస పుణ్యకాలం..... ఇలా ఎన్నో మంచి మంచి అంశాలున్నాయి. ఆయనాలకు సంబంధించిన మరిన్ని విశేషాలు "పురాణగాథల్లో సైన్సు అద్భుతాలు" అనే మా గ్రంథంలో వివరంగా ప్రస్తావించబడ్డాయి, చదవండి.

22. నక్షత్ర రాశుల్లో మకరం అంటే ఏమిటి?

ప్రశ్న : సాధారణంగా జ్యోతిష గ్రంథాల్లో 'మకరం' అంటే మొసలి బొమ్మవేస్తారు. కానీ కొందరు "మకర రాశి"ని-తల మరియు సగం మొండెం "మేక" లాగ, మిగిలిన సగం శరీరం "చేప తోక"లాగ చిత్రిస్తుంటారు. ఇంతకూ మకరం అంటే ఏమిటి?

జవాబు : మకరం అంటే అందరికీ తెలిసిన సాధారణ అర్థం మొసలి కనుక, మొసలి బొమ్మ వేస్తారు. అయితే 12 రాశుల్లో 10వ రాశి అయిన మకర రాశిని పాశ్చాత్యులు "కేప్రికారన్" అంటారు. అంటే "మేక చేప" అని అర్థం. ఆకాశంలోని ఆ నక్షత్రాల గుంపు సగం వరకు మేకలాగ, చివర సగభాగం చేపలాగ వుందని భావించి అలా చిత్రించారు. కొన్ని జాతులవారు లేడి + చేప అని కూడా అంటారట. చైనా వారు కూడా దీన్ని మేక + చేపగానే గుర్తించారు. గ్రీకులైతే దానికొక పుక్కిట పురాణాన్ని కూడా కల్పించి వ్రాశారు. అయితే వీరందరి కంటే ముందుగానే మన హిందువులు ఈ రాశిని "మేక చేప"గా వూహించారు. అప్పట్లో ఆ రాశి పేరు "అజము". అంటే "మేక" అని అర్థం. ఋగ్వేదంలో ఈ మేక, పూషుడనే దేవత రథాన్ని లాగే జంతువు అనీ, దీనితోక చేపతోక వలె వుంటుందనీ వర్ణించబడిందట. దీని ప్రక్కనే వున్న "ధనుస్సు"రాశి మన్మథుడనీ, ఆ ధనస్సుతోనే పూలబాణాలు వేసే వాడని

వర్ణించబడింది. ఆ మన్మథుడి ప్రక్కనే వున్న ఈ మకరరాశిని మన్మథుని ఝుండాపై గుర్తుగా వర్ణించారు. అందువల్లనే మన్మథుణ్ణి "మీన కేతనుడనీ", "మకర ధ్వజుడనీ" కూడా వర్ణించారు కవులు. మకరం అంటే 'మొసలి, పెద్ద చేప' అని రెండర్థాలు వున్నాయి. ఋగ్వేద కాలంలో ఇది "మేక చేప"గా వర్ణించబడినా, కాలక్రమేణా అది "మొసలి"గా స్థిరపడింది. అయినా ఇప్పటికీ కొందరు ఈ రాశికి "మేక చేప" బొమ్మను చిత్రీకరిస్తున్నారు. అదీ విషయం.

23. ఆధునిక కాలంలోని గ్రహాల లెక్కింపు జ్యోతిష శాస్త్రానికి భంగమా ?

ప్రశ్న : నవగ్రహాల నుండి ప్లూటో తప్పుకుంటే, మన జ్యోతిష శాస్త్రానికి నష్టమా?

జవాబు : సూర్యకుటుంబంలోని నవగ్రహాల్లో ఒకటైన "ప్లూటో" అనే గ్రహానికి "గ్రహానికి వుండవలసిన లక్షణాలు సంపూర్ణంగా లేవు కనుక, దాన్ని నవగ్రహాల లిస్టులోంచి తొలగించాలని"-నేటి పాశ్చాత్య శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయం వినగానే మన దేశంలో ఉన్న మిడిమిడి జ్ఞానంగల వెర్రిబాగులవాళ్ళు కొంతమంది ఒక్కసారిగా ఎగిరిగంతేసి, "ఇంకేముంది ? నవగ్రహాలపై ఆధారపడిన మనవాళ్ళ జ్యోతిష శాస్త్రాలన్నీ కట్టగట్టి ఏట్లో పారేయలంటూ" గోల మొదలెట్టారు. అది విన్న ఎంతోమంది మందబుద్ధులు "నిజమే సుమా !" అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. అయితే వీళ్ళెవరికీ తెలియని యథార్థం ఒకటుంది. సూర్యకుటుంబంలో చెప్పుకొస్తున్న నవగ్రహాలు వేరు. మన జ్యోతిషశాస్త్ర గ్రహాలు వేరు. సూర్యకుటుంబంలోని నవగ్రహాలు ఇవి :- బుధుడు, శుక్రుడు, భూమి, కుజుడు, గురుడు, శని, యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో. అయితే మన జ్యోతిష శాస్త్ర నవగ్రహాలు ఇవి: సూర్యుడు, చంద్రుడు, బుధుడు, శుక్రుడు,

గురుడు, కుజుడు, శని, రాహువు, కేతువు. సూర్యుడు ఒక నక్షత్రం అనీ, చంద్రుడు మనకు ఉపగ్రహమనీ మన పూర్వీకులకు తెలుసు. అయినా వాటి ప్రభావం జీవరాశిమనుగడపై ప్రభావాన్ని చూపిస్తున్నందున అవి నక్షత్రాలయినా, ఉపగ్రహాలయినా కూడా వాటిని జ్యోతిషశాస్త్రపరంగా గ్రహాలుగానే లెక్కవేశారు. పైగా మరో విశేషం కూడా వుంది. రాహువు, కేతువు అనేవి యథార్థ గ్రహాలు కావని, అని గ్రహ ఛాయలనీ కూడా ఋషీశ్వరులకు తెలుసు. అయినా కూడా ఆ ఛాయల ప్రభావం భూమిపైనున్న జీవరాశిపై వుంటుంది కనుక, వాటిని కూడా గ్రహాల లెక్కలోకి తీసుకున్నారు.

మన భూమి యొక్క, చంద్రుని యొక్క చలనాల ఆధారంగా రాహుకేతువుల స్థితి మారుతూ వుంటుంది. ఆ స్థితుల మార్పులవల్ల భూమి, సూర్య, చంద్రుల స్థితిగతుల్లో మార్పులొస్తాయి. ఈ విధంగానే బుధుడు, శుక్రుడు, కుజుడు, గురుడు, శనిగ్రహాల ప్రభావం భూమిపై నున్న జీవకోటిపై వుంటుందని గ్రహించిన ఋషీశ్వరులు, వాటిని జ్యోతిష శాస్త్ర గ్రహాల్లోకి తీసుకున్నారు. శనిగ్రహానికి ఆవల వున్న ఇతర గ్రహాలు..... యురేనస్, నెప్ట్యూన్, ప్లూటోల ప్రభావం మనపై లేదని గ్రహించిన మహర్షులు, వాటిని జ్యోతిష, పంచాంగాల పరిధిలోకి తీసుకోలేదు.

మన జ్యోతిష శాస్త్రంలో చెప్పబడిన నవగ్రహాల యొక్క ప్రభావము, కొన్ని నక్షత్రాల ప్రభావము - "భూమిపైనున్న జీవరాశులపై పడుతుందని" కనుగొన్న మహర్షులు "జ్యోతిష, పంచాంగాలను" రూపొందించి, మనకు అందించారు.

పై విషయాలను బట్టి తెలియవస్తున్నది ఏమంటే... నవగ్రహాల లిస్టులో ప్లూటోను వుంచినా, వెలివేసినా కూడా, ఆ సంగతి మన శాస్త్రాలకు అనవసరం.

ఋషీశ్వరులు రూపొందించిన శాస్త్రాలకు తిరుగే లేదు.

కొసమెరుపుగా చిన్న విషయం తెలుసుకుందాం. సూర్యకుటుంబంలో చేర్చవలసిన, తొలగించవలసిన గ్రహాలను గురించి పాశ్చాత్యశాస్త్రవేత్తలు

పడుతున్న తంటాలు మీకు తెలుసా ? ఇప్పటికి 75 సంవత్సరాల క్రిందట సూర్యకుటుంబంలో 8 గ్రహాలే ఉండేవి. 75 సంవత్సరాల క్రితం 9వ గ్రహంగా ఫ్లూటోను చేర్చారు. నేడు మళ్ళీ ఆ ఫ్లూటోని గ్రహం కాదంటున్నారు. గ్రహశకలాల్లో అతిపెద్ద పరిమాణంగల 'సెరిస్' అనే గ్రహశకలాన్ని 'గ్రహం'గా లెక్కించ ప్రయత్నించి వదిలేశారు. ఫ్లూటోకు జోడీ గ్రహంగా చెప్పబడిన 'చరన్' అనేదాన్ని పరిశీలించి, దానికి గ్రహస్థాయి లేదన్నారు. ఈ గ్రహాలన్నింటికీ ఆవలవున్న మరో గోళాన్ని 'క్సెనా' అనే గ్రహంగా నిర్ణయించబోయి, మళ్ళీ విరమించుకున్నారు. ఫ్లూటోతో సహా ఈ క్రొత్తవాటికి గ్రహ లక్షణాలు లేవని అంటున్నారు.

ఈ విధంగా గ్రహాల జాబితాలో ఒకనాడు వుంటూ, మరోసారి తీసివేయబడుతూ వుండే ఖర్మ, మన జ్యోతిష గ్రహాలకు లేదు. మన మహర్షుల లెక్క శాస్త్రబద్ధంగా వుంటుంది. అదే హిందూ విజ్ఞాన ప్రతిభ అంటే !

24. అలెగ్జాండర్ ప్రపంచాన్ని జయించాడా ?

ప్రశ్న : "ప్రపంచ విజేత... గ్రీకువీరుడు... అలెగ్జాండర్" అంటూ చాలా కీర్తిస్తారు కొందరు. పురుషోత్తముణ్ణి ఓడించిన అలెగ్జాండర్, పురుషోత్తముని వీరత్వానికి మెచ్చి అతని రాజ్యాన్ని అతనికి తిరిగి ఇచ్చేశాడని కొన్ని పాఠ్యాంశాలు వచ్చాయి. అలెగ్జాండర్ భార్య రుక్సానా హిందూరాజైన పురుషోత్తముడికి రాఖీకట్టి శరణు వేడిందని, అందుకే అలెగ్జాండర్‌ని చంపగలిగి కూడా పురుషోత్తముడు వదిలేసి, తానే ఓటమిని తీసుకున్నాడని కొందరు వ్రాశారు. వీటిలో ఏది నిజం మరి?

జవాబు : మనదేశ చరిత్ర వ్రాసి పెట్టినది మన భారతీయ

చరిత్రకారులు కాదు. "మెకాలే" మొదలయిన విదేశీ మెకాలు (మెకం అనగా మృగం) మనదేశ ఔన్నత్యాన్నీ, ప్రాచీనతనూ హీనపరచటం కోసం, తమ జాతి మతాల ఔన్నత్యం గొప్పదని అందరినీ నమ్మించటంకోసం ఇలా చరిత్రను మార్చేసి వ్రాశారు. వాటినే పాఠాలుగా చదువుకుంటున్నాం మనం. అవే నిజాలని చాలా మంది భారతీయులు కూడా నమ్మేస్తుంటారు.

ఆ ప్రయత్నంలోని ఒక అబద్ధమే ఈ గ్రీకు వీరుడి భారతదేశ విజయగాథ. అలెగ్జాండర్ వీరుడే! కానీ హిందూ వీరుడైన పురుషోత్తముడి కంటే గొప్పవీరుడు మాత్రం కాదు.

అయినా పాశ్చాత్యుల ప్రాభవం పెంచటంకోసం పురుషోత్తముణ్ణి అలెగ్జాండర్ ఓడించినట్లుగా వ్రాశారు. మరి అది నిజమైతే తిరిగి పురుషోత్తముడికి రాజ్యం యెలా వచ్చిందనే ప్రశ్న వస్తుంది కనుక, అలెగ్జాండరే ఆ రాజ్యాన్ని తిరిగి దానం చేసినట్లుగా కల్పించారు. భావదాస్యం అలవరచుకున్న భారతీయులు ఆ విషయాన్ని నమ్మేశారు. కానీ కొందరు భారతీయ విజ్ఞానులు దీన్ని సహించలేక పోయారు. ఫలితంగా రుక్సానా... రాఖీ బంధన్ వగైరాలు కథలో చేరాయి. పురుషోత్తముడి వీరత్వం తెలిసిన అలెగ్జాండర్ భార్య 'రుక్సానా' చాటుగా వెళ్ళి పురుషోత్తముడికి రాఖీ కట్టి పతిభిక్ష కోరిందనీ, అందువల్లనే యుద్ధంలో అలెగ్జాండరును చంపే అవకాశం దొరికినా వదిలేసి, అలెగ్జాండర్‌కు పురుషోత్తముడు పట్టుబడ్డాడనీ కథను మలుపు త్రిప్పారు.

నిజం చెప్పాలంటే ఈ రెండూ నిజంకాదు. పురుషోత్తముడికి పెద్ద గజబలం వుండేది. ఆ రోజుల్లో విదేశీయులకు గజబలం లేదు. ఆ గజబలం ధాటికీ, పురుషోత్తముడి ధాటికీ, ఆగలేకపోయారు గ్రీకులు. అందునా జీలంనది దాటి వెళ్ళి యుద్ధం చేయటం, గ్రీకులకు కష్టమైపోయింది. ఫలితంగా ఓడిపోయారు.

అలెగ్జాండరు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రీకులు అన్ని విధాలా నష్టపోయారు. అంతవరకూ అన్నీ విజయాలే పొందిన అలెగ్జాండరు మొదటి ఓటమిని జీర్ణించుకోలేక పోయాడు. హిందూదేశ సరిహద్దులోనే ఎదురుదెబ్బ తగలటం సహించలేకపోయాడు. వెనుదిరిగి పోయాడు. (గ్రీకు సైనికులకు తమ భార్యా బిడ్డలు గుర్తొచ్చి, వెనుదిరగాలని మొరాయించటం వల్ల వెనుదిరిగినట్లుగా, విదేశీచరిత్రకారులనబడే స్వార్థపరులు తప్పుడు వ్రాతలు వ్రాశారు.)

ఆనాటి అలెగ్జాండరు కూడా వచ్చిన గ్రీకు చరిత్రకారులు మన హిందూదేశం గూర్చి ఎంతో గొప్పగా వర్ణిస్తూ తమ గ్రంథాల్లో వ్రాసుకున్నారు. హిందువుల వీరత్వం, ఔదార్యం, సంస్కృతి, దేశవైభవం అన్నింటినీ కొనియాడారు వాళ్ళు. అలెగ్జాండర్ కూడా "జీవులకు చివరకు మిగిలేది వారి పాపపుణ్యాలే గాని, ఈలోకం నుండి తీసుకుపోగల సంపద లేమీ వుండవు" అనే హిందూ ఆధ్యాత్మిక సత్యాన్ని ఆకళింపు చేసుకుని వెనుదిరిగాడు.

ఇక్కడ మరొక్క విషయం.

ఇటీవల పాశ్చాత్యులు అలెగ్జాండరు గాథపై తీసిన ఒక హాలీవుడ్ సినిమా, మనదేశంలో కూడా విడుదలయింది. అది పూర్తిగా విదేశీయులు తీసిన సినిమా. మనదేశ ప్రమేయం ఏదీ అందులో లేదు. విదేశాల్లో ఉన్న చరిత్ర ఆధారంగానే తీసిన సినిమా అది. అందులో పురుషోత్తమునితో యుద్ధం చేసిన అలెగ్జాండరు ఓడిపోవటం, గాయపడటం, వెనుదిరగటం.. అన్నీ బాహాటంగా, ఖచ్చితంగా, వివరంగా చిత్రీకరించారు. చూశారా! వాళ్ళేమో నిస్సంకోచంగా అలెగ్జాండరు ఓటమిని అంగీకరిస్తుంటే, మనదేశంలోని భావదాస్యంలో మునిగిన మూర్ఖులు మాత్రం పురుషోత్తముడే ఓడిపోయాడని చెప్పబడిన తప్పుడు చరిత్రల్ని నమ్మి, "గ్రీకు వీరుడు..." అంటూ పిచ్చి పాటలు పాడుకుంటున్నారు.

25. మనం క్రీస్తుశకాన్ని ఎందువల్ల వాడవలసి వస్తోంది?

ప్రశ్న : "మనం హిందువులం, భారతీయులం. అయినా క్రీస్తు శకాన్ని వాడుతున్నాం. ఎందుచేత ? మనకు శకాలంటూ ఏవీలేవా?

జవాబు : మనకు శకాలు లేకపోవడమేమిటి? అనేక శకాలున్నాయి. మన శకాలతో సమానమై శకాలుగానీ, కాలమానాలు గానీ ప్రపంచంలో లేనేలేవు. మన విక్రమ శకం, శాలివాహన శకం మొదలైనవి ఎన్నో వందల యేళ్ళ నుండీ వున్నాయి. అలాగే క్రీస్తుకంటే 3000 సం॥ ముందునుండీ ప్రారంభమైన 'యుధిష్టరశకం' వుంది. అంతకంటే ముందు ప్రారంభమైన కలిశకం వుంది. ఇంకా చెప్పాలంటే 197 కోట్ల సంవత్సరాల ముందు నుండీ కాలమానాన్ని నిర్దేశించి చెప్పే కల్పకమానం వుంది మనకు.

క్రీస్తు శకం కేవలం 2000 సంవత్సరాల నుండే వుంది. అంతకంటే పూర్వపు కాలమానం కావాలంటే "క్రీస్తు పూర్వం" అనే లెక్కతో ముందునుండి వెనుకకు, తలక్రిందులు లెక్కలోకి వెళ్ళాలి.

ఉదా : క్రీస్తుపూర్వం 150వ సంవత్సరంలో పుట్టినవాడు 45 ఏళ్ళు బ్రతికి, మరణిస్తే - క్రీ.పూ. 105లో మరణించాడని చెప్పాలి. చూశారా ! 150లో పుట్టి 105లో మరణించడం అంటే, అది తలక్రిందులు లెక్కేకదా ! కానీ మనకు అలాంటి ఇబ్బందులు లేవు. కలిశకం 5100 సం॥ పూర్వం నుండీ..... కల్పకమానం అయితే, 197 కోట్ల సంవత్సరాల నుండి ఏకధాటిగా కాలమానం చెప్పగలం.

మనంతటి ప్రాచీనత లేకపోయినా..... కొన్ని కొన్ని ఇతర దేశాలకు కూడా వారి స్వంత శకాలున్నాయి. అయితే కాలమానం లెక్కింపు ప్రపంచమంతటా ఒక రకంగా ఉండేందుకు - ఒక ఉమ్మడి కాలమానంగా క్రీస్తు శకాన్ని వాడుతున్నాం. ఉమ్మడిగా అయితే మాత్రం క్రీస్తు శకాన్నే

ఎందుకు తీసుకున్నారని మీకు సందేహం రావచ్చు. దానికి కారణం తెలుసుకోండి. గతంలో ప్రపంచంలోని అనేక దేశాలను ఆక్రమించుకుని పరిపాలన చేసిన బ్రిటీష్ వారు చేసిన పని ఇది! తాము నమ్మిన మతాన్నీ, కాలమానాన్నీ బలవంతంగా ఆయా దేశాలపై రుద్దేశారు వాళ్ళు. అనంతర కాలంలో ఆయా దేశాలవారు బ్రిటీష్‌వారిని తరిమివేసి స్వాతంత్ర్యం పొందగలిగినా వారు రుద్ది వెళ్ళిన మత ప్రభావం, కాలమాన లెక్కల ప్రభావం నుండి మాత్రం పూర్తిగా బయటపడలేకపోయారు. కేవలం మతమూ, కాలమానంలోనే కాదు. ఇంగ్లీషు భాష, ఇంగ్లీషు ఫ్యాషన్లు, కొలమానాలు, కొన్ని ఆచార వ్యవహారాలు, వేషధారణలు... ఇవన్నీ ఆంగ్లేయుల నుండి వివిధ దేశాల్లో పాతుకుపోయాయి.

ఇదీ క్రీస్తుశకం కథ. ఇదంతా తెలియక..... క్రీస్తు ఎంతో గొప్పవాడు కనుకనే ప్రపంచమంతటా, క్రీస్తుశకం వాడబడుతుందని భావించే అమాయకులు పెరుగుతున్నారు. అయినా మన దేశంలో ఈ క్రీస్తుశకం అనేది కేవలం సాధారణ క్యాలెండరు లెక్కవరకే పరిమితం. పండుగలు, శుభకార్యాలు మొదలయిన అన్ని ముఖ్య కార్యక్రమాలకూ మనం మన పంచాంగ ప్రకారం, మన శకాల లెక్కనే వాడుకుంటున్నాం. ఆ సంగతి మరచిపోకండి మరి!

కొసమెరుపు : మహా పురుషులు జీవించిన కాలం నుండీ, లేదా ఏదైనా గొప్ప సంఘటన జరిగిన కాలం నుండీ - సంవత్సరాలను లెక్కించడం చరిత్రలో ఒక రివాజు. అదే శకం లెక్కింపు అంటే! ధర్మరాజు కాలం నుండి యుధిష్ఠర శకం, శాలివాహనుని కాలం నుండి శాలివాహన శకం, కలియుగ ప్రారంభం నుండి కలిశకం..... ఇలా శకాలు లెక్కించబడ్డాయి. ఇకపోతే క్రీస్తు శకం సంగతి! క్రీస్తు పుట్టుకను గురించి ప్రపంచ చరిత్రకారులెవరూ ఇప్పటికీ నిర్ధారణగా చెప్పలేకపోతున్నారట. ప్రముఖ విదేశీ గ్రంథకర్త హెచ్.జి.

వెల్స్ వ్రాసిన "ప్రపంచ చరిత్ర" లో క్రీస్తు జననం ఎక్కడా ప్రస్తావించ బడలేదట. ఏసుక్రీస్తు కంటే ముందు కాలంనాటి బుద్ధుడు, చాణక్యుడు, అలెగ్జాండర్ వంటివారి చరిత్రలు ప్రపంచ చరిత్రపుటల్లో స్పష్టంగా ఉన్నాయి. వీళ్ళందరికంటే ఆధునికుడైన క్రీస్తు పుట్టిన కాలాన్ని స్పష్టంగా ఎవరూ ఈనాటికీ చెప్పలేక పోతున్నారట. క్రీస్తుశకం సున్నా సంవత్సరంలో పుట్టాడా? లేక క్రీస్తు శకం 01వ సంవత్సరంలో పుట్టాడా? అనేది నిర్ధారణ లేదట. నిర్ధారణ లేని కాలాన్ని ఆసరాగా చేసుకుని "ఒక శకం" నడుస్తూ ఉండడం ప్రపంచ వింతల్లో ఒకటి. (క్రీస్తు పుట్టుకను గురించిన ఈ వివరాలు డాక్టర్ వేదవ్యాస్ I.A.S., Ph.D గారి "ఇండియాలో జీసస్" గ్రంథం నుండి సేకరించబడినవని గమనించ మనవి.)

26. భక్తి వలన ప్రజలకు ధననష్టమా ?

ప్రశ్న : పూజా పునస్కారాలూ, వ్రతాలు, ఆచార వ్యవహారాలూ, యాత్రలూ, సంబరాలు, ఉత్సవాలూ, తీర్థాలూ, కుంభమేళాలు అంటూ ఎన్నో వేలరూపాయలను వృధా ఖర్చు చేస్తుండడం వల్ల దేశాభివృద్ధి కుంటు పడుతోందని కొంతమంది నాస్తికులు చేసే విమర్శలో బలంవుందా?

జవాబు : విమర్శలే వారి జీవిత ధ్యేయం అనుకునే మూర్ఖులు..... 'నాస్తికులు, హేతువాదులు'. వాళ్ళ విమర్శలో ఏ మాత్రం బలం లేదు. అయితే హిందూ ధర్మానికి సంబంధించిన వివిధ అంశాల్లోని శాస్త్రీయతను మనవాళ్ళు సరిగా గమనించలేక పోవడం నిజంగా మన దౌర్భాగ్యం! "శాస్త్రీయంగా మీ ధర్మం ఇంతటి గొప్పది సుమా!" అంటూ విదేశీ శాస్త్రవేత్తలంతా ఈనాడు మనకు వివరిస్తున్నారు. ఇది చాలా శోచనీయ పరిస్థితి! పరిపూర్ణ జ్ఞాన, విజ్ఞానాలు గల మహర్షులు ఎన్నో అంతరార్థ కారణాలతో పూజలు, వ్రతాలు, తీర్థయాత్రలు, కుంభమేళాలు మొదలైనవన్నీ ఏర్పరచిపెట్టారు. ఇవన్నీ మానవ జీవితానికి ధార్మిక

చింతననూ, ప్రశాంతతనూ, ఆరోగ్యాన్నీ, ఆహ్లాదాన్నీ, ఐకమత్యాన్నీ, సమ సమాజ భావననూ కలిగిస్తాయి. విషయ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాయి. పై కార్యాలవల్ల ఖర్చు అయ్యే డబ్బు ఎక్కడా వృధాగా పోదు. ఆలోచించి చూస్తే, అదంతా చక్కని సమాజ వినిమయంగా వెళ్తుందని అర్ధమౌతుంది.

పై కార్యక్రమాలవల్ల జీవులకు అనంతమైన ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుంది. జీవితానికి అవసరమైన ఈ ఆధ్యాత్మిక లాభం, ఒకరు చెపితే తెలిసేది కాదు..... నిజ భక్తి వల్ల ఎవరికి వారికే తెలుస్తుంది! ఏకాగ్రచిత్తంతో పూజలు, యాత్రలు చేసేవారు ఇహ, పరలోకాల్లో విజయాన్ని సాధిస్తారు. ఇక లౌకిక దృష్టితో ఆలోచించి చూసినా..... ఈ పూజల కోసం, వ్రతాల కోసం మనం చేసే ఉపవాసాలు, స్నాన పానాదులు మన ఆరోగ్యం కోసమేకదా! పసుపు, కుంకుమ ధారణలు, పత్రి-పూలతో పూజలు, దీపం, ధూపం, హారతి ఇవన్నీ మన ఆరోగ్య రక్షణకే! దేవుడు కోరేది భక్తి మాత్రమే. ఫలాన దేవుడికి ఫలాన నైవేద్యం ఇష్టమనీ, ఫలాన పండుగకు ఫలాన వంటలుచేసి నైవేద్యం పెడితే మంచిదనీ కొన్ని చోట్ల చెప్పబడ్డాయి. అవి కూడా మన ఆరోగ్య రక్షణకే! ఏ వాతావరణంలో యే ఆహారం తీసుకుంటే మంచిదో, ఆ కాలానికి అవి నిర్దేశించబడ్డాయి. ఋషీశ్వరుల పరిశోధనా ఫలితమే, ఆ నియమాల ఏర్పాటు. వీటి అంతరార్థాలు తెలియని వారు ఏదేదో విమర్శిస్తుంటారు. మనం వారిని పట్టించుకోవలసిన పనిలేదు.

అదే విధంగా... యాత్రలు, నదీస్నానాలు, పర్వతారోహణలు కూడా వివిధ లాభాలను కలిగించేవే! యాంత్రిక జీవనాలతో కొట్టుమిట్టాడే మనసులకు ఇవి చక్కని ప్రశాంతతనూ, ఆనందాన్నీ యిస్తాయి. నిజమైన భక్తితో వాటన్నింటినీ ఆచరిస్తే కార్యసాధన, ముక్తి లభిస్తాయి. పర్వత ప్రయాణాలు, నదీస్నానాలు ఆరోగ్యాన్నిస్తాయి. మరిన్ని విశేషాలకు "పురాణాగాథల్లో సైన్సు అద్భుతాలు" అనే మా గ్రంథం చదవండి.

జనావళి చేసే తీర్థ యాత్రల వల్ల దేశం నష్టపోవటం కాదు. దేశం, ప్రజలు, ప్రభుత్వాలూ కూడా ఎంతో అభివృద్ధి పొందుతున్నాయి. ఈ భక్తి, ఈ యాత్రలు,

పుణ్యక్షేత్రాలూ లేనట్లయితే తమ జీవనోపాధి కోల్పోయి -కొన్ని లక్షల మంది తిండి, బట్ట, ఇల్లు లేక - వీధిన పడతారు. నిరుద్యోగ సమస్య ఘోరంగా పెరిగి పోతుంది. రిక్షాలు, ఆటోలు, కార్లు, బస్సులు, రైళ్ళు, టాంగాలు, పడవలూ... ఇలా ఎన్నో వాహనాల వల్ల బ్రతికేవారు, దుకాణాలు, హోటల్స్‌తో జీవనాలు సాగించేవారు, దేవాలయ సిబ్బంది, బ్రాహ్మణులు, కూలివారు... చివరకు క్షతగాత్రులైన బిచ్చగాళ్ళకు కూడా ఈ యాత్రలు జీవనోపాధిని కల్గిస్తున్నాయి. టూరిజం పేరిట ప్రభుత్వాలకు ఆదాయం పెరుగుతుంది. దేవాలయాల సొమ్ముతో అనేక రోడ్లు, భవనాలు, హాస్పిటల్స్, కాలేజీలు, యూనివర్సిటీలు నడపబడుతున్నాయి. ఇలా చెప్పుకుంటూపోతే యెన్నో లాభాలున్నాయి.

భక్తికి సంబంధించిన కార్యక్రమాల కారణంగా ఎంతోమందికి విద్య, వైద్యం, మంచినీరు, ఉద్యోగావకాశాలూ మొదలైనవెన్నో లభిస్తున్నాయి. మరి నాస్తికత్వం వల్ల దేశానికి ఏంలాభం కలుగుతుంది....? వినాశనం తప్ప ఏమీ లేదు. ముందుగా నాస్తికులంతా తీర్థయాత్రలు చేసి, లోకజ్ఞానాన్ని పెంచుకోవలసిన అవసరం ఎంతయినా వుంది.

27. వాలెంటైన్స్ డే (ప్రేమికుల రోజు) లాంటివి మనకు అవసరమా?

ప్రశ్న : ప్రస్తుతకాలంలో ఫిబ్రవరి 14న 'ప్రేమికుల రోజు' అంటూ కొందరు పండుగ జరుపుకుంటున్నారు కదా! దానికి సంబంధించిన అసలు కథ ఏమిటో కాస్త వివరిస్తారా?

జవాబు : నిజం చెప్పాలంటే, ఇదొక అంటుజాడ్యపు వెర్రిపండుగ. 'వాలెంటైన్' అనబడే ఇటలీ దేశస్థుడొకడు, ప్రేమ గురించి తన ప్రాణాలను ధారపోశాడని, అతను మరణించిన తేదీని ఫిబ్రవరి 14గా భావిస్తూ ఆ రోజున అతని పేర "ప్రేమికుల రోజు" జరుపుకుంటున్నాం అని, నేటి ప్రేమికులు చెప్పుకుంటున్నారు. వీరు చెప్పే విషయంలో చాలా తప్పులున్నాయి.

యథార్థ చరిత్రను తిరగేసి చూస్తే అసలు విషయం ఇది : వాలెంటైన్ వివరాలు ఖచ్చితంగా, సుస్పష్టంగా చరిత్రలో లేవు. 3వ శతాబ్ద కాలంలో ఇటలీ దేశ చరిత్రలో ముగ్గురు వాలెంటైన్‌లు కన్పిస్తున్నారు. ఒక వాలెంటైన్ మతాధికారిగా ఉండేవాడు. మరో వాలెంటైన్, రోమ్ చక్రవర్తి గ్లాడియస్ - 2 సైన్యంలో ఒక సైనికుడుగా ఉండేవాడు. 3వ వాలెంటైన్ ఒక సామాన్య రోమన్ పౌరుడు. మొదటి వాలెంటైన్ మతాధికారిగా ఉంటూనే మరణించాడు. 2వ వాలెంటైన్, రోమ్ చక్రవర్తి గ్లాడియస్ - 2 చే వధించబడ్డాడు. దీనికో కథ ఉంది. చక్రవర్తి గ్లాడియాస్ - 2, తన సైనికులెవరినీ వివాహం చేసుకోనిచ్చేవాడు కాదు. అలా అయితే సైనికుల వీరత్వం తగ్గదని అతని భావం. అయితే ఆ సైనికుల్లో ఒకడైన వాలెంటైన్ తన సహచరులైన సైనికులకు రహస్యంగా పెళ్ళిళ్ళు జరిపించేవాడట. ఈ సంగతి తెలుసుకున్న చక్రవర్తి, ఆ వాలెంటైన్‌ను వధించాడు. దీన్ని బట్టి చూస్తే, ఈ 2వ వాలెంటైన్ ఒక పెళ్ళిళ్ళ బ్రోకరు అని తెలుస్తుంది. ఇక 3వ వాలెంటైన్ సంగతి! ఇతనొక సాధారణ పౌరుడు. రోమ్ నగరంలోని ఒక జైలర్ గారి అమ్మాయిని ప్రేమించాడు. అందుకు కోపించిన జైలర్ గారు అతన్ని జైల్లో బంధించి, చివరకు వధించాడు. చరిత్రలో ఉన్న మొత్తం వాలెంటైన్‌ల అసలు చరిత్రలు ఇవి! ఈ ముగ్గురు వాలెంటైన్లలో ఏ ఒక్కణ్ణి తీసుకున్నా కూడా, వాడు అమర ప్రేమికుడు ఎలా అయ్యాడో అర్థం కాదు. ఇక ఫిబ్రవరి 14 అనే తేదీ అతని పుట్టిన తేదీ కాదు. కనీసం వాడు చచ్చిన తేదీకూడా కాదు. అయితే ఈ ఫిబ్రవరి 14వ తేదీ అనేది ఎలా ప్రాముఖ్యతలో కొచ్చిందీ తెలుసుకుందాం. ప్రాచీన రోమన్‌లు పూజించే దేవతల్లో 'జూనో' అని ఒకావిడ ఉంది. ఆ దేవత "స్త్రీలకు, పెళ్ళిళ్ళకూ సంబంధించిన దేవత" అని వారి నమ్మకం. ఆ జూనో దేవత పై ఉన్న భక్తి శ్రద్ధలతో ఫిబ్రవరి 14వ తేదీన రోమ్‌లో సెలవు ప్రకటించుకుని, ఉత్సవాలు చేసుకునేవారట. ఆ దేశపు కొన్ని పక్షులు ఆ తేదీన ప్రేమాతిశయంతో జంటలు కట్టేవని, ప్రాచీన రోమన్ చరిత్రకారులు

వ్రాసుకున్నారు. ఫిబ్రవరి 15వ తేదీన రోమ్ నగరంలో ఎంతో ఉత్సాహంతో జరుపుకునే వసంతోత్సవం క్రమంగా ఫిబ్రవరి 14కు మారిపోయింది. ఇన్ని విధాలుగా ఫిబ్రవరి 14వ తేదీకి ప్రాముఖ్యత వచ్చింది. అనంతరకాలంలో ఆ ఫిబ్రవరి 14 గురించి తెలుసుకున్న అమెరికన్ పౌరులు, పరస్పర ప్రేమలను తెలియపరచుకోడానికి ఆరోజున ప్రేమ కార్డులను పంచిపెట్టుకోవడం మొదలుపెట్టారు. సరిగ్గా ఆ సమయంలో వాలెంటైన్ దశ తిరిగింది. ముగ్గురు వాలెంటైన్‌లలో ఎవడైతేనేమి... ఒక వాలెంటైన్‌ను తీసుకుని, వాడికి అమర ప్రేమికుడుగా ముద్రవేసి, వాడికీ... వాడికి ఏ మాత్రం సంబంధం లేని ఫిబ్రవరి 14వ తేదీకీ ముడిపెట్టేశారు కొందరు. వెర్రి వేయి విధాల ముచ్చట అట! ఇక చూడండి. వాలెంటైన్స్ డే... ఫిబ్రవరి 14... ప్రేమికుల రోజు... అంటూ మొదలయింది. అనేక దేశాల్లో ఈ వెర్రి పాకింది. అయితే ఈ మధ్య ఈ వెర్రి మరీ ముదరడం చూసిన చాలా దేశాల ప్రభుత్వాలు, తమ తమ దేశాల్లో ఈ 'ప్రేమికుల పండుగ' ను నిషేధించాయి. చివరకు అమెరికాలో కూడా కొన్ని ప్రాంతాల్లో నిషేధించారు. అయితే మన భారత దేశంలో మాత్రం ఈ పిచ్చి అంతకంతకూ ముదురుతోంది. మనవారికి అసలు సంగతి తెలియదుగాని, అంతులేకుండా పిచ్చి గెంతులు వేయడం మాత్రం తెలుసు. కాలక్షేప ప్రేమ, అక్రమ దారుల్లో కోరికలు తీర్చుకునే ప్రేమలతో ముసుగులు ధరించి మరీ తిరుగుతూ, మన దేశ యువతీ యువకులు - ఈ ప్రేమికుల రోజు పేరు మీద సర్వనాశన మౌతున్నారు. ఎందరో ఎయిడ్స్‌కు గురికావడం కూడా జరుగుతోంది. ఆ రోజున వెర్రి ఆవేశంతో మంచీ చెడ్డలు మరచి చిందులు వేయడం, యువతకు ఒక గొప్ప ఫ్యాషన్‌గా మారింది.

మన దేశస్థుల్లో చాలామందికి ఒక వింత జబ్బువుంది. 'మనదేశం, మనదేశ చరిత్ర, మనదేశవ్యక్తులు అంటే లోకువభావం ఉండడం... విదేశీ చరిత్ర, విదేశీ వ్యక్తులు, విదేశాలంటే మోజు చూపటం' ఈ జబ్బులక్షణం. చిత్రమేమిటంటే మనదేశపు ఘనత ఏదయినా వుంటే దాన్ని మనదేశస్థులు

ప్రకటించినా కూడా, ఈ జబ్బు ఉన్నవారు నమ్మరు. పైగా అదే విషయాన్ని విదేశీయులెవరైనా ప్రకటిస్తే మాత్రం నమ్ముతారు. అప్పుడు మనదేశ ఘనతను గుర్తిస్తారు.

ఈ అలవాటు చాలా పూర్వంనుండే మనదేశంలోవుంది. అందుకే గొప్ప ప్రేమికుల విషయంలో ఉదాహరణలు చెప్పాలంటే ప్రతివారూ "లైలా మజ్ను, రోమియో జూలియట్" అంటూ ఎవరెవరివో పేర్లు చెపుతుంటారు. వారికి మన హిందూ ప్రేమికుల పేర్లేవీ మచ్చుకైనా తెలియవు. రాణీసంయుక్త, పృథ్వీరాజుల పేర్లు మీరెప్పుడైనా విన్నారా? నిజమైన అమర ప్రేమికులు వాళ్ళు. వారు తమ పవిత్ర ప్రేమను గెలిపించుకుని పెళ్ళిచేసుకుని, కాపురం చేశారు. దేశభక్తులైన వీరిద్దరూ విదేశీ దురాక్రమణ దారులనెదిరించి వీరస్వర్గం పొందారు. వీరికి మన చరిత్రలో సరైన స్థానమే కల్పించబడలేదు. ఎందుకంటే మన దేశచరిత్ర, మనం వ్రాసుకున్నది కాదు కదా!

అలా మన పురాణకాలంలోకి వెళితే... గొప్ప ప్రేమికులు అనేకమంది వున్నారు. నల, దమయంతులు ఒకరినొకరు ప్రేమించుకున్నారు. కేవలం బాహ్య సౌందర్యంచూసి కాదు. వారివారి గొప్పతనాల్ని విని, ప్రేమించుకున్నారు. (ఆ మధ్య వచ్చిన ఒక సినిమాలో "అందరిలాగా పైపై అందాలకు మైమరచిరోడ్డున పడి తిరిగే ప్రేమకాదు మా హీరో ప్రేమ. కనీసం పరస్పరం ముఖాలు చూచుకోకుండానే ప్రేమించుకున్న పవిత్ర ప్రేమ" అంటూ ఒక డైలాగ్ వుంది, చూశారా ? అలాంటి పవిత్రప్రేమ ఈ నలదమయంతుల ప్రేమ.) అందుకే దేవతలను మెప్పించి మరీ పెళ్ళి చేసుకుని, ప్రేమవిజయాన్ని సాధించారు వీళ్ళు.

అదే విధంగా దేవకన్య ఊర్వశి, మానవ చక్రవర్తి పురూరవుడు..... ఏకంగా ఇంద్రుణ్ణే మెప్పించి, తమ ప్రేమను గెలిపించుకున్నారు.

శివుణ్ణి ప్రేమించింది సతీదేవి. ఆస్తులు, అంతస్తుల భేదం వుందని

ఆ పెళ్ళికి ఇష్టపడలేదు దక్షుడు. అయినా శివుణ్ణి పెళ్ళాడి, విజయం సాధించింది సతీదేవి. సతీదేవిగా మరణించినా మళ్ళీ పార్వతిగా పుట్టి, తపోదీక్షలోవున్న శివుణ్ణి మెప్పించి చేపట్టింది. అంత ధృడమైన ప్రేమ 'పార్వతీ పరమేశ్వరులది'. అందుకే వారు ఆది దంపతులనబడ్డారు.

తాను ప్రేమించిన పద్మావతి కోసం జీవితాంతం రుణగ్రస్తుడిగా వుండడానికి కూడా వెనుదీయక, పద్మావతిని పెళ్ళాడి ప్రేమ విజయాన్ని సాధించాడు శ్రీనివాసుడు. (శ్రీ వెంకటేశ్వరస్వామి)

ఇన్ని విజయాల్ని సాధించిన పవిత్రప్రేమికులు మనకు వుండగా..... ప్రేమలో ఓడిపోయి, నశించిపోయిన పరాయివారి తద్దినాలను పండగలుగా చేసుకునే ఖర్మ ఏమిటి మనకు?

అంతగా "ప్రేమికుల రోజు" అనే పండుగ చేసుకుని తీరాలని భావిస్తే... "నభూతో నభవిష్యతి" అనే విధంగా యెన్నో ప్రేమలను విజయవంతం చేసిన గొప్ప ప్రేమమూర్తి శ్రీకృష్ణ పరమాత్ముని జన్మదినాన్ని (శ్రీకృష్ణాష్టమిని) "ప్రేమికుల రోజు"గా నిర్వహించుకుంటే... పుణ్యం, పురుషార్థం లభిస్తాయి.

'శ్రీకృష్ణుడు - ప్రేమ' అనగానే 'ఆయనకు అనేకమంది భార్యలు కదా! అదేం ప్రేమ?' అని అపహాస్యాలాడేవారు ఎందరో వున్నారు. అలాంటి వారికి శ్రీకృష్ణ తత్వాన్నీ, దాని అంతరార్థాన్నీ మా "శ్రీకృష్ణ గీత" గ్రంథంలో వివరించాము చదవండి. శ్రీకృష్ణుని గురించి మనం ముఖ్యంగా తెలుసుకోవలసిన విషయం ఒకటుంది. ఆయన సాక్షాత్తూ భగవంతుడు. పసిపిల్లవాడిగా ఉన్నప్పుడు భయంకరమైన రాక్షసులనెందరినో సంహరించాడు. యశోదమ్మకు తన నోటిలో 'విశ్వం' అంతా చూపించాడు. అనంతమైన తన విశ్వరూపాన్ని రెండుమూడు సందర్భాల్లో ప్రదర్శించాడు. ఆయన భగవంతుడని తెలియజేసే సందర్భాలు ఇలా అనేకం వున్నాయి. ప్రస్తుతానికి

ఇవిచాలు. సాక్షాత్తూ సృష్టికర్త ఆయనే అయినప్పుడు... ఆయనకు ఇంతమంది భార్యలేమిటి? అనే ప్రశ్నే అనవసరం. ఎందుకంటే సృష్టిలో మగ, ఆడ కూడా తనే! మనుషులే కాదు, సకల జీవజాలము తానే! కొండాకోనా తానే! రాయీరప్పాతానే! నేల, సముద్రమూ తానే! నక్షత్రాలూ తానే... సకల విశ్వమూ తానే! కురుక్షేత్ర యుద్ధ సమయంలో అసలైన తన విశ్వరూపాన్ని అర్జునుడికి చూపించాడు. కృష్ణుడు దివ్యదృష్టి ప్రసాదించినా కూడా, ఆ స్వరూపాన్ని చూడడానికి భయపడిపోయాడు అర్జునుడు. విశ్వంలో సకల చరాచరమూ తానే అయినప్పుడు... ఆయనకు ఇంతమంది భార్యలేమిటనే ప్రశ్న వ్యర్థమైనదని తెలుస్తూనేవుంది కదా! (విశ్వరూపుడైన భగవంతుని ముందు మనమెంత? ఆయన్ని విమర్శించడం, వేళాకోళం చేయడం, ఆయనతో పోల్చుకోవడం... ఇవన్నీ అతిహీనమైన చర్యలు. దేవుణ్ణి విమర్శించడం అంటే ముఖంపైకెత్తి ఆకాశంమీద ఉమ్మివేయడం వంటిదని తెలుసుకోండి.)

ప్రస్తుతం శ్రీకృష్ణ చరిత్రలోని కొన్ని ప్రేమగాథల్ని తెలుసుకుందాం రండి. వాటి ఆధారంగానే నేడు అనేక సినిమాలు కూడా వస్తున్నాయి. కులం, ధనం, అంతస్తు వగైరా విషయాల్లో ఎంతో అంతరాలువున్న హీరో, హీరోయిన్లు ప్రేమించుకోవటం...ఆ ప్రేమకు పెద్దలు అభ్యంతరం చెప్పటం... వేరేపెళ్ళి చేయటానికి ఏర్పాట్లు చేయడం... సమయానికి హీరో హీరోయిన్లు పారిపోవటం... వాళ్ళని పట్టుకునేందుకు ఎందరో రౌడీలూ, గూండాలూ కత్తులు, గొడ్డళ్ళు, తుపాకులు తీసుకుని వెంటాడడం... ఆ తర్వాత ఫైటింగులు... చివరకు... శుభం. ఇలాంటి ఇతివృత్తాల కథలు కోకొల్లలుగా వస్తున్నాయి. అది ఈనాటి ఫ్యాషన్. వీటన్నింటికీ మూలగాథ "శ్రీకృష్ణ-రుక్మిణీ కళ్యాణం".

నేటికి 5000 సంవత్సరాల పూర్వం రుక్మిణి అనే రాజకుమార్తె, శ్రీకృష్ణ పరమాత్ముడి ఘనత విని ప్రేమించింది. అదే విధంగా ఆమెను శ్రీకృష్ణుడూ ప్రేమించాడు. (ఇది కూడా పరస్పరం బాహ్యసౌందర్యాలను చూడకుండా

మనసుల్లో పుట్టిన పవిత్రప్రేమయే!) అయితే రుక్మిణి అన్న "రుక్మి" అనేవాడు వారి పెళ్ళికి అభ్యంతరం చెప్పాడు. శ్రీకృష్ణుడు గొల్లవాడు, రాజ్యంలేని వాడు, తమతో సరిసాటికాడని యెంచి, రుక్మిణిని శిశుపాలుడనే రాజుకు ఇచ్చి పెళ్ళి చేయాలని ఏర్పాట్లు చేశాడు. అది తెలిసిన రుక్మిణి ఒక బ్రాహ్మణుడి ద్వారా శ్రీకృష్ణుడికి కబురు చేసింది. సమయానికి శ్రీకృష్ణుడు వచ్చి, రుక్మిణిని తన రథంలో తీసుకుపోసాగాడు. రుక్మి తన సైన్యంతో ఆయుధాలు ధరించి శ్రీకృష్ణుని వెంటపడ్డాడు. అయితే శ్రీకృష్ణుడు వారందరినీ చావగొట్టి, రుక్మిని బంధించాడు. దయతలచి తన అన్నయ్యను విడిచిపెట్టమని రుక్మిణి కోరింది. ఆమె కోరికను మన్నించాడు శ్రీకృష్ణుడు. రుక్మికి గుండు గీసి, వదిలేశాడు.

ఆ విధంగా వీరత్వంతో తమ ప్రేమను గెలిపించుకుని రుక్మిణిని పెళ్ళాడాడు శ్రీకృష్ణుడు.

తన ప్రేమనేకాదు. తన వారి ప్రేమలను కూడా విజయవంతం చేసిన ప్రేమమూర్తి శ్రీకృష్ణుడు.

బలరాముడు, శ్రీకృష్ణుల చెల్లెలు సుభద్ర. ఆమె అర్జునుణ్ణి ప్రేమించింది. అర్జునుడూ ఆమెను ప్రేమించాడు. కానీ అర్జునుడికన్న దుర్యోధనుడు ధనవంతుడని, అతనికే చెల్లెల్ని ఇచ్చి పెళ్ళి చేయాలని బలరాముడు నిర్ణయించాడు. శ్రీకృష్ణుడు అన్నగారికి ఎదురు చెప్పలేడు. చెల్లెలి ప్రేమను ఓడిపోనీయలేడు. ఆయనకు యిదొక సమస్యఅయింది. అందుకే రహస్యంగా సుభద్రార్జునుల పెళ్ళి జరిపించి పంపేశాడు. మళ్ళీ మామూలే! బలరాముడి తరపు సైన్యాలు ఆయుధాలు పట్టుకుని, సుభద్రార్జునుల వెంటపడ్డారు. కానీ అర్జునుడే వారిని ఓడించి, సుభద్రను తీసుకుపోయాడు. అనంతరం బలరాముడికి సర్దిచెప్పి, శాంతపరిచాడు శ్రీకృష్ణుడు. అలా చెల్లెలి ప్రేమకు విజయాన్ని చేకూర్చాడు.

శ్రీకృష్ణుడికి, రుక్మిణికి పుట్టిన కుమారుడు ప్రద్యుమ్నుడు. అతడు మన్మథుడి అంశన పుట్టినవాడు. అందుకే రతీదేవి, అతని కోసం కూడా భువికి దిగివచ్చింది. ప్రద్యుమ్న, రతీదేవులు ప్రేమలో పడ్డారు. నిరభ్యంతరంగా వారికి పెళ్ళిచేసి, మరో ప్రేమజంటను కలిపాడు శ్రీకృష్ణుడు.

శ్రీకృష్ణుడు, జాంబవతుల కుమారుడు 'సాంబుడు'. అతను దుర్యోధనుడి కుమార్తె 'లక్షణ'ను ప్రేమించాడు. ఆమె కూడా అతన్ని ప్రేమించింది. ఇంకేముంది... మన హీరో సాంబుడు, రహస్యంగా లక్షణ అంతఃపురంలోకి వెళ్ళాడు. దుర్యోధనుడు తమపెళ్ళికి ఒప్పుకోడనీ, అందువల్ల తనను తీసుకుపొమ్మనీ కోరింది లక్షణ. వెంటనే హీరో హీరోయిన్లు పారిపోసాగారు. కౌరవులు, కర్ణుడు, వారి సైన్యాలతో ఆయుధాలతో వెంటపడ్డారు. సాంబుడు తిరగబడి వీరత్వం చూపించాడు. అయినా శత్రుబలం ఎక్కువ కావటం వల్ల, పట్టుబడక తప్పలేదు. చెరసాల పాలయ్యాడు సాంబుడు. విషయం తెలిసింది శ్రీకృష్ణుడికి. సాంబుడి ప్రేమను గెలిపించాలంటే దుర్యోధనుణ్ణి ఓడించాలి. కానీ తన అన్న బలరాముడు దుర్యోధన పక్షపాతి. ఎలామరి? అందుకే తెలివిగా సమస్యను బలరాముడి చేతిలో పెట్టాడు. బలరాముడు హస్తినాపురం సరిహద్దుల్లో విడిది చేసి - లక్షణ, సాంబులను తనవద్దకు పంపించ వలసిందిగా కౌరవులకు కబురు చేశాడు. 'గొల్లలతో సంబంధం తమకు చిన్నతనం కనుక సాంబునితో లక్షణ పెళ్ళికి ఒప్పుకోము అనీ, సాంబుణ్ణి విడుదల చేయం' అని జవాబిచ్చాడు దుర్యోధనుడు. బలరాముడి అహం దెబ్బతింది. కోపంతో లేచాడు. హస్తినాపురాన్ని పెళ్ళగించి యమునానదిలో కలిపేస్తానంటూ, నాగలితో హస్తినాపురాన్ని లేవనెత్తసాగాడు. కంపించిపోయింది నగరం. దానికి హడలిపోయిన కౌరవులు - లక్షణ, సాంబులను బలరామునికి అప్పగించారు. లక్షణా సాంబుల వివాహం జరిపించి, వారి ప్రేమకు విజయాన్ని చేకూర్చాడు శ్రీకృష్ణుడు.

(బలరాముడు లేవనెత్తినందున నేటికీ హస్తినాపురం [ఢిల్లీ] కాస్త ఒక ప్రక్కకు ఒరిగివుంటుందని అంటారు.)

రతి, ప్రద్యుమ్నుల కుమారుడు అనిరుద్ధుడు. బాణాసురుడనే రాక్షసుని కుమార్తె ఉష, తనకలలో కన్పించిన అనిరుద్ధుణ్ణి ప్రేమించింది ఉష. అతనెక్కడున్నా తీసుకురమ్మని చెలికత్తెకు చెప్పింది. మాయలునేర్చిన ఆ చెలికత్తె అనిరుద్ధుని

కనుగొని, అతను నిద్రపోతున్నప్పుడు మంచంతో సహా అతన్ని ఆకాశమార్గాన తీసుకుపోయి, ఉషకి అప్పగించింది. మొత్తం మీద ఉష, అనిరుద్ధులు పరస్పరం ప్రేమలో పడ్డారు. ఆ విషయం తెలిసిన బాణాసురుడు, అనిరుద్ధుణ్ణి చెరసాలలో బంధించాడు.

ఆ సంగతి కృష్ణునికి తెలిసింది. వెంటనే ఆయన - సాత్యకి, ప్రద్యుమ్న, సాంబాదులను సైన్యాలతో సహా తీసుకుని వెళ్ళి, బాణాసురుడిపై దాడి చేశాడు. ఘోరయుద్ధం జరిగింది. బాణాసురుడు శివభక్తుడు. అందువల్ల అతని కోరికపై శివుడు కూడా బాణాసురుడి తరపున వచ్చి యుద్ధం చేశాడు. చివరకు బాణాసురుణ్ణి ఓడించాడు శ్రీకృష్ణుడు. ఉష, అనిరుద్ధులకు పెళ్ళి చేయడమే మంచిదని, బాణాసురుడికి శివుడు కూడా సలహాయిచ్చాడు. ఆవిధంగా సాక్షాత్తూ పరమేశ్వరుడితో కూడా యుద్ధం చేసి, ఉషా అనిరుద్ధుల ప్రేమను గెలిపించి, వారికి పెళ్లి జరిపించాడు శ్రీకృష్ణుడు.

ఎవరైనా యువతులకు చాలాకాలంవరకూ పెళ్ళి కుదరకపోతే, ఆ యువతులు శ్రీమద్భాగవతంలోని రుక్మిణీ కళ్యాణ అధ్యాయాన్ని రోజూ భక్తిగా చదువుకుంటే వారికి త్వరగా పెళ్ళి జరుగుతుందని, అలాగే ఎవరైనా యువతి తాను కోరుకున్న వ్యక్తితో పెళ్ళి జరగాలని ఆశించినప్పుడు కూడా- ఈ రుక్మిణీ కళ్యాణ ఘట్టాన్ని ప్రతిరోజూ చదువుతుంటే, తప్పక ఆమె కోరిక నెరవేరుతుందనీ పెద్దలు చెపుతారు.

తన ప్రేమనే కాక, ఇలా ఎన్నో జంటల ప్రేమలను విజయవంతం చేసిన శ్రీకృష్ణుడు - నిజమైన ప్రేమకు ప్రతీక! ప్రేమికుల రోజు జరుపుకోదలచుకుంటే ఆయన జన్మదినమే అందుకు అత్యుత్తమం.

అయినా చివరిగా ఒక విషయం.....

విదేశాల్లో ఇలా..... "ప్రేమికులరోజు, తల్లి రోజు (మదర్స్‌డే), తండ్రిరోజు (ఫాదర్స్‌డే), ఫ్రెండ్‌షిప్ (స్నేహం) రోజు, పెళ్ళాంరోజు, బావమరిది రోజు....." అంటూ ఒక్కొక్కరికి ఒక్కొక్క "దినం" పెడుతూ హడావుడి చేస్తుంటారు. విదేశీ జీవనాల్లో భోగవిలాసాలూ, విచ్చలవిడితనం, హడావుడి, ఉరుకులూ పరుగులూ ఎక్కువ. అభిమానం, ఆప్యాయత, ప్రేమాభిమానాలు, బంధాలు, బంధుత్వాలు

తక్కువ. అయితే తమ జీవితాల్లో ఏం కోల్పోతున్నాం అనేది వారికి అప్పుడప్పుడూ గుర్తుకొస్తూ వుంటుంది. అప్పుడు మాత్రం ఒకసారి అవన్నీ గుర్తుచేసుకుంటూ అభిమానం, ఆప్యాయత, ప్రేమాభిమానాలు చూపించుకునే ప్రయత్నాలు చేస్తారు. ఆ ప్రయత్నాల్లోంచి పుట్టుకొచ్చిన పండుగలే పైన పేర్కొన్న "దినాలు". ఏనాడూ కూడా తల్లి బాగోగులు చూడని వాడుకూడా, కనీసం "మదర్స్‌డే" (తల్లిదినం) అనిపెడితే, అప్పుడయినా ఆ ఒక్కరోజూ తల్లిని ఆదరిస్తాడనే ఆశతో, ఆరోజును పెట్టుకున్నారు. అలాగే తండ్రినీ, భార్యనూ, స్నేహితులనూ, ఇతరితరంగా ప్రేమించే వారినీ పట్టించుకోని ఎంత చవట అయినా కూడా, కనీసం ఆయా రోజుల్లోనైనా "ఫాదర్స్ ·డే, పెళ్ళాండే... ఫ్రెండ్‌షిప్‌డే... లవర్స్‌డే... "అంటూ కనీస ఆదరణ చూపిస్తాడేమోననే ఆశతో... అలా సంవత్సరానికో దినాన్ని కేటాయించు కున్నారు విదేశీయులు. ఇలాంటి దౌర్భాగ్యస్థితి మన భారతీయులకు అక్కర్లేదు. వివిధ సందర్భాల ప్రేమల కోసం సంవత్సరానికి ఒకరోజు కేటాయించుకుని తంటాలు పడవలసిన పని మనకు లేదు. ఎందుకంటే ప్రేమాభిమానాలకు పుట్టినిల్లు మన భారతదేశం. ఆప్యాయత, అనురాగం, ప్రేమాభిమానాలు నిత్యం ప్రతీక్షణం మన భారతీయుల్లో మూడు పువ్వులు - ఆరు కాయలుగా వెల్లివిరుస్తుంటాయి.

అయితే ఈమధ్య మాత్రం మనం కాస్త విచారించవలసిన పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. మన జీవన పరిస్థితుల్లో అనేక మార్పులు వస్తున్నాయి. స్వదేశీ అభిమానం నశించి, విదేశీ జీవన పైత్యం ఫ్యాషన్‌గా మారుతుంది. దాంతో మన దేశంలోనూ పరస్పర సంబంధ బాంధవ్యాలు నశిస్తున్నాయి. మనవాళ్ళు కూడా విదేశీ జీవనాల్ని ఆదర్శంగా తీసుకుంటూ, అగాధాల అంచులవైపు పరుగులు పెడుతున్నారు. అదిగో... ఆ కారణంగా మనకు కూడా ఈ ప్రేమికుల రోజులు, మదర్స్‌డేలు, ఫాదర్స్‌డేలూ... అవసరం అనిపిస్తున్నాయి. అనునిత్యం తల్లిని మాతృదేవత అని పూజించే భారతీయుడికి 'మదర్స్‌డే' అవసరం ఉంటుందా... చెప్పండి. అలాగే మిగతా దినాల అవసరాల్ని కూడా ఆలోచించి చూడండి. అవి మన సంస్కృతికి అవసరమా? మీలో మీరే తర్కించుకుని, ఓ మంచి నిర్ణయానికి రండి.

సర్వేజనా సుఖినోభవంతు.